9 ఆగస్టు 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లె, 99594 88088


## కథాక్రమం

మీకు నచ్చిన కథ ఉన్న వరుస మీద క్లిక్ చేయండి. నేరుగా ఆ కథ ఉన్న పేజీలోకి వెళ్లండి


| | | | |
|---|---|---|---|
| తెలుగుప్రభ | కళింగోరలు | అట్టాడ అప్పల్నాయుడు | 94400 31961 |
| ఆదివారం ఆంధ్రజ్యోతి | సుక్రబల్ముచు | కె.ఎన్.మల్లీశ్వరి | 88850 16788 |
| సాక్షి ఫన్‌డే | చేదుకట్టు | చాగంటి ప్రసాద్ | 90002 06163 |
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | సెల్లుసిత్రం | అశోక్ పోతరాజు | 94929 13913 |
| ప్రజాశక్తి స్నేహ | వెలుగుపూల దారిలో | పాలకొల్లు రామలింగస్వామి | 94414 16049 |
| విశాలాంధ్ర | ఒకరికొకరు | సిహెచ్.ప్రతాప్ | 98660 71785 |
| సూర్య | అమ్మకు మొదటి ఉత్తరం | డా.డివిజి శంకరరావు | 94408 36931 |
| నవతెలంగాణ సోపతి | జ్యోతిర్మయం | రాజు యెదుగిరి | 99634 85370 |
| ఈనాడు ఆదివారం | అద్దెకి ఆకాశం | సౌమ్య నిట్టల | 99858 51181 (వాట్సప్) |
| వార్త | జన్మభూమి | ములుగు లక్ష్మీమైథిలి | |
| సాక్షి ఫన్‌డే | ప్రేమయాత్ర | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| 2.8.26 కథానిధి సమీక్ష | సామాజిక వాస్తవికతకు అక్షర దర్పణం | భూక్యా గోపినాయక్ | 99891 59196 |


## మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్‌అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథా ప్రియులకు నమస్తే..

ఈ ఆదివారం (9 ఆగస్టు 2026) కథల సంకలనం 45 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 11 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

**కథానిధి పాఠకులకోసం ఒక కొత్త సదుపాయం అందిస్తున్నాను. మొదటి పేజీలో కథల వరుసక్రమం, రచయిత, ప్రచురణల వివరాలు ఉంటాయి. అందులో మీకు నచ్చిన కథ ఉండే వరుస మీద క్లిక్ చేస్తే.. పీడీఎఫ్ సంకలనంలో నేరుగా ఆ పేజీ కి వెళ్లిపోవచ్చు. ఈ సదుపాయాన్ని కథాప్రియులు వాడుకోగలరు**

కథానిధి పాఠకులకు గతవారం కథల సమీక్షను కూడా అందిస్తున్నాము.
'2 ఆగస్టు 2026 కథానిధి' కథలపై భూక్యా గోపి నాయక్ సమగ్ర సమీక్ష కోసం
ఈ కింది లింక్ లను క్లిక్ చేయండి

**adarsini.com వెబ్ సైట్లో చదవడం కోసం**

**యూట్యూబ్ లో వినడం కోసం**

**2 ఆగస్టు 2026 కథానిధి సంకలనం పీడీఎఫ్ కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ

కె.ఎ. మునిసురేష్ పిళ్లె

99594 88088

- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలేయకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు ***https://kathavasudha.com*** లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# కళింగోరలు

● అట్టాడ అప్పల్నాయుడు

"... అన్నా, సిగ్నల్స్ వొచ్చాయి, ఫోన్ సిగ్నల్స్ వొచ్చాయి.." చెప్పాడు సంతోషంగా రెయ్యి కోదండం. అప్పుడే ఫోన్ మోగింది.

" ... నాల్రోజులు సంతోషంగా ఉన్నానని నంజికొడుకులకి కంటసంగా ఉంది గావాల..." విసుక్కుంటూ ఫోన్ అందుకున్నాడు అన్న.

ఏ నంజికొడుకులకో తెలియక బుర్ర గోక్కున్నాడు కోదండం.

గత మూడురోజులుగా ఉండిన తుఫాను వెలిసింది, గానీ ఆకాశం - సముద్రంలో గల్లంతైన కొడుకుల కోసం ఏడ్చి,ఏడ్చి సొమ్మసిల్లిన మత్స్యకారుల తల్లుల మొహాల్లా దిగులుగా, మబ్బుగా ఉంది. తీరం మీద చెట్లు సూతకం స్నానం చేసిన వారిలా నీరు గారుస్తున్నాయి. రక,రకాల పక్షులు రక,రకాలుగా అరుస్తూ ... సాఫ్ట్ వేర్ ఉద్యోగుల్లా ఒకే దిక్కు ఎగురుతున్నాయి. ఇళ్ళల్లోంచి జనాలు పుట్టల్లోంచి చీమల్లా పొలాల వేపు, తోటల వేపు,కల్లాల వేపు కదులుతున్నారు. కుక్కలు వొళ్ళు దులపరించుకొని వీధులన్నీ తిరిగేస్తున్నాయి. కళింగసముద్ర కెరటాలు ఒడ్డును డీకొని, వెనక్కి వెళ్లి మళ్ళా ఎగసిపడుతున్నాయి.

"... బంగ్లాల అన్ని సుఖాలు అనుభగించీడం అయిపోయిందా? మర్రెండు రోజులు గానీ తుఫాన్ని కంటిన్యూ చేయమని వాతావరణ శాఖ వారికి రికమండ్ చేయమంటావా?.."

టీం లీడర్ ఎకసెక్కెంతో గాయపడ్డ సాఫ్ట్ వేర్ ఉద్యోగిలా అవతలి ఫోన్ కాల్ తో కించిత్ గాయపడి, చింతించాడు అన్న.

బుర్ర గోకి,గోకినా నొప్పి పెట్టడం తప్ప అవతల ఎవరి ఫోనో తెలియక - ఎవులన్నా? అని ప్రశ్నించాడు కోదండం.

సముద్ర ఒడ్డుకి కూతవేటు దూరంలో పాత కాలం నాటి రహదారి బంగ్లా అది. ఇటీవల – నాడు-నేడు స్కీం కింద పాఠశాలలు మరమ్మత్తులు, ముస్తాబులూ అయినట్టు బంగ్లా కూడా ముస్తాబయింది. తుఫానుకి చిక్కి మూడు రోజులుగా ఉండిపోయాడు అన్న నల్ల వీరన్నాయుడు. బయటకు వెళ్ళలేక పోవడం తప్ప, కావాల్సినవన్నీ నాయుడు కాళ్ళ దగ్గరకు వస్తున్నాయి. రెండో రోజుకి తుఫాను వాతావరణాన్ని బాగా ఆస్వాదించాడు, మరి కొన్నాళ్ళు తుఫాను ఉంటే బాగున్ను అనుకున్నాడు కూడా, తుఫాను విజృంభించి, పరిసరాలను, ఇళ్ళను ధ్వంసం చేసినా బాగున్ను అనికూడా అనుకున్నాడు తుఫాను నష్ట పరిహారాలు అతని మనసులో కదలటంతో. గానీ బయటకు అనలేదు. ఫోన్ లో అవతలి వ్యక్తి – ఎకసెక్కేలాడుతూనే వున్నాడు,వ్యంగ్య బాణాలు విసురుతూనే వున్నాడు. చెవి గోక్కుంటూనే తలూపుతు, వింటున్నాడు వీరన్నాయుడు.

కోదండం – అవతల ఎంపీ గానీ, ఎమ్మెల్లె గానీ అన్నని వోయించుతండు అనుకున్నాడు. "...ఎల్లిన పని ఎంతవరకూ వచ్చింది?" బాణాలు కాస్తా శాంతించినట్టున్నాయి.

వచ్చిన దగ్గర నుంచీ వీరన్నాయుడు ఏమేమి చేసాడో చెప్పసాగేడు. తుఫాను లేకపోతే ఇపాటికి ఏరియా యావత్తూ ఒకే మాట పలికేటట్టు చేసిద్దును...అని చింతించాడు.నిజానికి వీరన్నాయుడు మూడు రోజులూ తుఫాన్ ఎపుడన్నా కాస్తా తెరిపిస్తే, ఊళ్ళు తిరిగేవాడు, వీలు కుదరకపోతే వూళ్ళ పెద్ద మనుషులను రప్పించి మంత్రాంగం చేసేవాడు. కర్తవ్యం మరచిపోలేదు.

గత కొన్నాళ్ళుగా ప్రభుత్వం ఆ ప్రాంతంలో కార్పోరేట్

## రచయిత




**అ**ట్టాడ అప్పల్నాయుడు కళింగాంధ్ర నుంచి పలికే బలమైన కథా గొంతుక. రాసిలోను, వాసిలోను పేరెన్నికగన్న రచయిత. వివిధ పత్రికల్లో వందకు పైగా కథలు అచ్చయ్యాయి. ఆరు కథా సంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. అప్పల్నాయుడు సాహిత్యం పేరుతో ఎంపిక చేసిన 33 కథలతో ఒక సంపుటి, నవలల కూర్పుతో మరో సంపుటి వేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాలతో నేస్తం ఊసులు శీర్షికన మూడు సంపుటాలు వెలువరించారు. కొన్ని కథలు ఇంగ్లీషు, హిందీ, బెంగాలీ, కన్నడ, తమిళ భాషల్లోకి అనువాదం అయ్యాయి. ఉత్తరాంధ్ర రచయితలు– కళాకారుల వేదిక అధ్యక్షులు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సలహా మండలి సభ్యులు. రాచకొండ రచనా పురస్కారం, పెద్దిభట్ల సుబ్బరామయ్య స్ఫూర్తి పురస్కారం, ఆంధ్రప్రదేశ్ కళారత్న పురస్కారం సహా అనేక పురస్కారాలు అందుకున్నారు.

9440031961

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

వారి పరిశ్రమ కోసం, విమానాశ్రయం కోసం భూ సేకరణ ప్రయత్నాలు చేస్తోంది. రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు వాటి వలన కలిగే లాభాలను పత్రికలలో వివరిస్తున్నారు. కానీ ప్రజలు భూములు ఇవ్వడానికి ఇష్టపడడం లేదు. గ్రామ స్తాయి నుంచి మండలం,శాసన సభ నియోజిక వర్గం దాక పలుకుబడి గల నాయకులను ప్రత్యేకంగా సమావేశ పరచి, కంపెనీ కోసం భూములు ఇచ్చేట్టు ఎలా ప్రజలను వొప్పించాలో ఎంపీ గారూ,మంత్రి గారూ సలహాలు ఇచ్చారు. ఎమ్మెల్యేను బాధ్యత తీసుకో మన్నారు. సరంజామా ఇచ్చారు. పెన్షన్లు, రేషన్లు,పథకాలు వల్లించమన్నారు, పథకాలన్నీ పోతాయిసుమా అని...ఇం క్రిమెంట్లు ఆగిపోతాయి సుమా అని ఉద్యోగులను హెచ్చరించేట్టు హెచ్చరించమన్నారు.ఇంకోవేపు రెవెన్యూ అధికారులకు గడువులు విధించారు. భూసేకరణ చేయలేకపోతే బదిలీల బెదిరింపులు చేసారు. అయినా ఫలితం కనిపించటం లేదు. అవతల కార్పోరేట్ అధిపతులు, కేంద్రనాయకులు ముఖ్యమంత్రి మీద వొత్తిడి పెంచారు. అసలకు వారి వొత్తిడి అక్కరలేదు, ఇటువంటి కార్పోరేటీ కరణ తన విజన్ గా చెప్పుకుంటారు ముఖ్యమంత్రి.



వెంటనే జిల్లా పర్యటనకు వచ్చారు. జిల్లా వెనకబడి ఉన్నందుకు నొచ్చుకొని, పక్కనున్న మంత్రి గారిని సిగ్గులేదా అనడిగారు. మంత్రిగారయితే చాల ఫీలయి పోయారు. అప్పటికీ మంత్రిగారు - తను మాత్రమే ఏమిటి ,తనతో పాటు సీఎం, ఇప్పుడిదాక ఏలిన అందరూ సిగ్గుపడాలి అనలేక, సంజాయిషీ ఇస్తూ — రాక్షసులులాగ అ భివ ృద్ధి యగ్యానికి కమ్యునిస్టులు అడ్డుపడు తున్నా రన్నాడు. ముఖ్యమంత్రి పోలీసుల వేపు చూపారు.

ఆ తరవాత పోలీసులు గ్రామాల్లో కవాతు చేయసాగేరు. గ్రామస్తుల కదలికలకు ఆంక్షలు పెట్టారు. గ్రామీణుల చేతుల్లో పనిముట్లను నిషేధించారు. ఒక గ్రామస్తులు ఇంకో గ్రామం వెళ్లడాన్ని నిషేధించారు. గ్రామాల్లో స భ లూ, స మావేశాలు నిషేధించారు. అయినా ఏ గ్రామం రైతూ భూమి ఇవ్వడానికి ఇష్టపడడం లేదు. గ్రామసభల్లో ముక్త కంఠంతో "...ప్రాణాలయినా ఇస్తాం గానీ, భూములు ఇవ్వం" అంటున్నారు.

అవతల ఫోన్ కట్ అయింది. వీరన్నాయుడు విసుగ్గా ఫోన్ టీపాయ్ మీద పెట్టి ,ఎదురుగా కనిపించే సముద్రం వేపు చూడసాగేడు . సముద్ర కెరటాలు ఉవ్వెత్తున లేచి, వొడ్డుని డీకొని వెనక్కి వెళిపోయి, మళ్ళీ వస్తున్నాయి.

'...సముద్ర కెరటాలు ఆగవేట్రా...' అనడిగేడు వీరన్నాయుడు.

ఏమి బోధ పడిందో — జెనసముద్ర కెరటాలు ఆగవన్నా _ అనన్నాడు కోదండం.

వీరన్నాయుడు మౌనంగా సముద్రం వేపే చూస్తున్నాడు.

'తిరుగాడిన ఊరు,తలదాచుకున్న ఇల్లు, కడుపుకి బువ్వ పెట్టిన బూమి వొదిలి ఎల్లడానికి ఎలాగ మనసొప్పుతాది అన్నా ఎవురికైనా?'.

'భూకంపం వొస్తే వుంతారేటిరా? భూతం తిరుగాడితే


ఇంటిల నిద్దరోతాత్రా?"

'...అయితే, కొంపదీసి భూకంపం, భూతమే జెనాల మీదకి వొస్తన్నాయేటి, ఆ కమీనిస్టులు అన్నట్టుగా?'

వీరన్నాయుడు అనుమానంగా, అసహనంగా కోదండం వేపు చూసాడు.

'అదేటన్నా అలాగ చూస్తావు? నన్ను అనుమానించకు. కోవర్ట్ ని కాను. నువ్వు తప్ప నన్ను ఎవురూ నమ్మరు. నిన్ను తప్ప మరొక పురుగుని నీను నమ్మను. నీను బతికుండగా నిన్ను వదలనన్నా. నన్ను నమ్ము... జెనం పల్స్ చెప్పాను' అన్నాడు కోదండం.

వీరన్నాయుడికీ తెలుసు... ప్రజలు దేన్నయినా తెంపుకుంటారు భూమితో ఉన్న బంధం తెంపుకోరు , అలనాటి అశోకుడితో చేసిన యుద్ధం నుండి మొన్నటి సోంపేట,కాకరాపల్లి, గంగవరం ...కళింగ జనాల ప్రాణ త్యాగాలన్నీ తెలుసు. కాకపోతే ఎంపీని,ఎమ్మెల్యేని కాదనలేడు. వారి దయ వలన మండలంలో తిరుగులేని నాయకుడిగా చలామణి అవుతున్నాడు. గత అయిదేళ్ళు ప్రతిపక్షంలో ఉండినందున మండలం లో ఏ కాంట్రాక్టు రాలేదు,సరికదా కేసులు ఎదుర్కొన్నాడు. ఇపుడిపుడే అన్నిటినుంచి బయట పడ్డాడు. కాంట్రాక్టులు సంపాదించాడు. కంపెనీ వస్తే మరింత సంపాదనా పరుడు కావచ్చు అని వొకోసారి ఆశ, మరోసారి ప్రజల వ్యతిరేకతతో మళ్ళీ ప్రతిపక్షం లోకి వెళ్తే ఎదురయే గత స్తితీ భయం వేస్తాది...



"... రాజకీయాలు చేంజ్ అయిపోయాయిరా. ఒకప్పుడు పార్టీ సమావేశాల్లో చర్చలు జరిగి కార్యక్రమాలు నిర్ణయాలు జరిగేవి. ప్రభుత్వం చేయాల్సిన శాశనాలను పార్టీ నిర్ణయించేది. ఇపుడు మారిపోయింది. కొసకి ఎన్నికల్లో ఎవరికి టిక్కెట్ ఇవ్వాలో కూడా పార్టీ కాదు నిర్ణయించేది...కార్పోరేట్ కంపెనీలు నిర్ణయిస్తన్నాయి. డబ్బు ఖర్చు పెట్టి అభ్యర్ధిని గెలిపిస్తున్నాయి. గెలిచాక కంపెనీలు పెట్టమన్న కాయితమ్మీద సంతకమెట్టాల, చేయమన్న చట్టం చెయాల. లేపోతే ,మళ్ళా ఎలక్సన్కి మన పొజిషన్ మారిపోద్ది " అని చెప్తూ ఆగి,శ్వాస తీసుకొని —

"జెనానికి ఏది మంచి అన్న దానికంటే మన పొజిషన్ కి ఏది మంచి అన్నది ముఖ్యంరా. పవర్ పోతే పెళ్ళాం కూడా నిసాకారంగా చూస్తాది. పవర్ మీద ఉండడం పులి స్వారీ రా. మీద ఉంటేనే క్షేమంగా ఉంటావు ,దిగినావా పులి తినేస్తాది ..." అనోసారి వీరన్నాయుడిని హెచ్చరించాడు ఎంపీ..

'...మీమేమి పులుల మీద స్వారీ చేస్తన్నామురా బాబూ, నువ్వు స్వారీ చేస్తంటే నీ ఎనక పరిగెడత న్నాము...' అని మనసులో అనుకున్నాడు,బయటకు అనలేకపోయాడు వీరన్నాయుడు.

ఆగిపోయిన ఫోన్ మళ్ళీ మోగింది.

'...ఈరోజే కదా సభ? సరిగ్గా సభ సమయానికి నీను,ఎంపీ వొస్తాము. ఈలోగా కలక్టర్, ఎస్పీ వొస్తారు. నువ్వు ఆళ్ళని ఫాల్లో అవు...మన కార్యకర్తలని మోపు చేయి. అవుసిరం అయితే కర్రా,కంపా వాడాలని కార్యకర్తలకి చెప్పు...నిన్నే నమ్ముకున్నాన్రా నాయనా. ఆ వూరు గానీ అంగీకరిస్తే, మిగిలిన వూళ్ళని వొప్పించడం తేలిక . ఎంపీ పట్టుదలగా ఉన్నాడు. భూ సేకరణకి గానీ సభ ఆమోదం తెలిపెట్టు చూస్తే, కంపెనీ వోళ్ల చేత మనకి ఏటి కావాలంటే అది ఇప్పించుతాడట.... '

అవతల ఫోన్ ఆశలు చూపిస్తోంది.

నల్ల వీరన్నాయుడు ఆలకిస్తూ, ఆలోచిస్తున్నాడు.

'...మీటింగుల జెనం మన గుడ్డలు ఇప్పేసేటట్టు ఉన్నారన్నా ' ఆఖరి మాటగా చెప్పాడు కోదండం. ఫోన్ మళ్ళీ కట్ అయింది.

గబగబా లేచి, బట్టలు వేసుకొని బయల్దేరుతూ — కారు తెమ్మనురా,డ్రైవర్ని ... ఎస్పీ,కలెక్టరు వొస్తన్నారాట — తొందర చేసాడు నల్ల వీరన్నాయుడు

❑ ❑ ❑

జిల్లా కేంద్రం నుంచి కలక్టర్,ఎస్పీ బయల్దేరినారు, చెరో ఇన్నోవా కారుల్లో. వారిని అనుసరిస్తూ అధికార్లు కొందరు కార్లలో , వారి వెనక గుమాస్తాలు జీపుల్లో.

ఉదయం పదకొండు గంటలు. కళింగ సముద్రం గాలి చల్లగా వీస్తోంది. ఎస్పీ గారి కారుకు ముందు కలెక్టర్ గారి కారు హైవే మీదుగా వేగంగా పోతోంది. కలక్టర్ ఫోన్ లో ఆర్డీవో,ఎమ్మార్వోలకు సూచనలు రిపీట్ చేస్తున్నారు,మరోప్రక్క తేడా వస్తే ఏమి చేస్తాడో వార్నింగులు ఇస్తున్నాడు. ఆయన ఆఫీసులో ఉన్నా, కేంప్ లో ఉన్నా,

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కొన్నిసార్లు గూగుల్ మీట్ ల్లో అయినా సిబ్బందిని హెచ్చరించడం ఇష్టం. హెచ్చరించకపోతే సిబ్బంది పని చేయరని అతని నమ్మకం.

అప్పుడే ఎంపీ గారి పియ్యే కాల్ – స్పాట్ కి వెళ్ళారా?జెనం వచ్చారా? ఏమిటి సిట్యుయేషన్? ఎంపీ గారు ఎంత సేపటిలో బయల్దేరాలి, అక్కడ ఏ టైం లో ఉండాలి? – అని అడుగుతున్నాడు పి.ఏ.

ఎంపీ కంటే ఎంపీ పి.ఏ తో మాటాడ్డం కష్టం. అదీగాక కలక్టర్ గారికి తెలుగు అంతంతమాత్రమే తెలుసు. ఒకటి చెప్పబోయి, మరొకటి చెప్పేస్తా నాన్న భయం...కలక్టర్ కి.

పలానా పని అయిందా అన దుగుతున్నారు ఎంపీ గారు అని పి.ఏ ఫోన్ చేస్తాడు,

కష్టమేమోనండీ... అని సాధక, బాధలేవో కలక్టర్ గానీ చెప్పాడో – అంతే!

అయితే ఆ మాట ఎంపీ గారికి చెప్పమంటారా అనడు గుతాడు పి.ఏ. కలెక్టర్ అన్నవే గాక అననివి కూడా చేర్చి చెపుతాడు. ఎంపీ తన భార్య మాట నమ్ముతాడో లేడో గానీ పి.ఏ మాట నమ్ముతాడు. కేంద్రస్థాయి పనిష్మెంట్ల లిస్టు చదువుతాడు ఎంపీ.

> పోలీసులు గ్రామాల్లో కవాతు చేయసాగేరు. గ్రామస్తుల కదలికలకు ఆంక్షలు పెట్టారు. గ్రామీణుల చేతుల్లో పనిముట్లను నిషేధించారు. ఒక గ్రామస్తులు ఇంకో గ్రామం వెళ్లడాన్ని నిషేధించారు. గ్రామాల్లో సభలూ, సమావేశాలు నిషేధించారు. అయినా ఏ గ్రామం రైతూ భూమి ఇవ్వడానికి ఇష్టపడడం లేదు.

అంచేత -

"ఎస్,ఎస్,తుఫాన్ ఆగిపోయింది. ఎస్పీ గారితో ఇప్పుడే అన్ని విషయాలూ డిస్కస్ చేసాను, ఎస్సెస్ ... ఆ,ఆ, ఎంపీ గారు ఎపుడేనా రావొచ్చు. తుపాన్ ఎగైన్ రాకపోవచ్చు.మినిస్టర్ గారితో కలిసి వొచ్చినా పర్లేదు, విడిగా వొచ్చినా పర్లేదు. తుఫాన్ ఎగైన్ నాట్ కం అండీ, రాదండీ, సర్క్యులర్ కూడా ఇచ్చానండీ,ఎవ్విరి థింగ్ ఈజ్ ఇన్ అవర్ కంట్రోలండీ.ఎస్పీ వెహికలేమో నా వెహికల్ వెనక ఉందండీ. ఒన్ మినిట్ ఆగండి, ఎస్పీ గారితో మాటాడి కన్ఫర్మ్ చేస్తాను ...బోత్ ఆఫ్ అజ్ ఆన్ ది గ్రామ సభ డ్యూటీ ... ఐ విల్ మెసేజ్ యూ..." అని బదులిచ్చి ఫోన్ కట్ చేసారు కలక్టర్ గారు.

పి.ఏ. తాను అడిగినదేమిటి? కలక్టర్ చెప్పినదేమిటి - బోధపరచుకోడానికి బుర్ర గోక్కోవాల – అలాంటి సమాధానం ఇచ్చాడు కలక్టర్.

తర్వాత కలక్టర్ గారు ఎస్పీకి కాల్ చేసారు. అప్పటికి వాహనాలు హైవే నుంచి సముద్రతీర రోడ్డున గ్రామాల మీదుగా పోతున్నాయి. నీళ్ళతో తడిసిన తోటలు, జీడి,పనస, అరటి మొక్కలు సూర్యకిరణాలు పడి దేవతలెవరో పెంచిన వనసీమల్లా ఆకుపచ్చగా మెరుస్తున్నాయి. కొన్ని గ్రామాలలో కమ్యునిస్టు అమరుల స్తూపాలు కూడా తడిసి, ఎర్రగా,ఎర్రెర్రగా మెరుస్తూ మహేంద్రగిరి కొండ మీది పాండవుల గుడుల్లా ఉన్నాయి.

ఎస్పీకి ఆ స్తూపాలను చూడబుద్ధి వేయలేదు. దుశ్శకునాలను చూస్తున్నట్టు వుంటుంది. చూపు మరల్చి, వాహనాన్ని వేగంగా నడపమని డ్రైవర్ కి చెప్పాడు.

చిన్నపాటి కలకలం కూడా సహించలేడు ఆయన....ఇంట్లో గానీ బయట గానీ. ఇంటిలోని వారిని చూపులతో బెదిరిస్తాడు,బయట వారిని చేతలతో భయపెడతాడు...ప్రశాంతత కోసం.

అప్పుడే కలక్టర్ ఫోన్. మౌనంగా విన్నాడు, తప్ప బదులివ్వలేదు.

కలక్టర్ గారు – వాడ్డుయూ సే అని ఆంగ్లంలో అడిగారు విసుగు ధ్వనించేట్టు.

ఎస్పీ గారు టోపీ వెదికారు, సీట్ పక్కనే కిరీటంలా ఠీవిగా ఉంది. పిస్తోలు కోసం నడుం బెల్ట్ చెక్ చేసారు. ఆ తర్వాత – ఉయ్ ఆర్ ఆల్మోస్ట్ ఎట్ ది స్పాట్. లెట్ దెం కం ఎట్ దెయిర్ కన్వీనియంట్ టైం – అని కలక్టర్ గారికి చెప్పారు.

ఎస్పీ గారి జవాబుని కలక్టర్ తెలుగులో అనువదించి ఎంపీ పి.ఏ కి చేరవేశారు

❑ ❑ ❑


బల్లిసారధి ఊరి నడుమ విశాలమైన సెంటర్లో గ్రామ సభ ఏర్పాటు చేసారు. విలేజ్ స్థాయి ఉద్యోగి నుంచి తాలుకా,జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులు, మండల పోలీసు సిబ్బంది...మరికొన్ని ప్రభుత్వ సంస్థల సిబ్బంది హడావిడిగా తిరుగుతున్నారు. ఎత్తయిన వేదిక నిర్మించారు. వేదిక ఎదురుగా రెండువందలకు పైగా కుర్చీలు వేసారు. మైక్ పెట్టారు. మైక్ లో అపుడపుడూ గ్రామ సచివాలయ ఉద్యోగి ఒకరు - ప్రజలందరికీ ఇదే మా ఆహ్వానం.మరి కాసేపట్లో గ్రామ సభ ఆరంభం అవుతుంది. మన ప్రాంతంలో నిర్మించబోయే పెద్ద కర్మాగారం గురించి, దాని వలన ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించడానికి ఎంపీ గారు,ఎమ్మెల్యే గారు,కలక్టర్ గారు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

వస్తున్నారు. ప్రజలందరూ రండి - అని ప్రకటిస్తున్నాడు.

సమయం గడుస్తోంది కానీ వేదిక ముందర కుర్చీలు ఖాళీగానే ఉన్నాయి.

ఇంటి గడపలో కూచొని, కూచొని విసిగిపోయిన కుత్తుం జోగయ్య నడుము ఈడ్చుకుంటూ నడిచి (కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు దింపుతూ, దిగినపుడు కాళ్ళు పట్టు తప్పి పడిపోయి నడుము జారిపోయింది.) ఖాళీగా ఉన్న కుర్చీల మీద కాసేపు కూచుందామని వచ్చాడు. అతనిని అనుసరించింది అతని పెంపుడు కుక్క...పేరు బాహుదా. జోగయ్య బాహుదా అనలేడు...బాయుదా అంటాడు, బాహుదా సరిచేసి, సరిచేసి - నా పేరు పలకలేని నీలాటి పద్దుకు మాలిన మనిసి ఎనకాల తిరగమని ఏ బగవంతుడు ముండాకొడుకు రాసేడో నాకు - అని విసిగిపోతుంది.



జోగయ్య ఓ కుర్చీలో కూచున్నాడు. బాహుదా కుర్చీలో కూచోకుండా కాసేపు సంశయంగా అటూ,ఇటూ చూసింది. పోలీసులు చేతుల్లో లాటీలతో, ఉద్యోగులు ఫైళ్లతో హడావిడిగా కన్పించగా — ఎందుకైనా మంచిది కాసేపు జోగయ్య గాడితో పాటు కూచోడం ఒంటికి మంచిది కాదు అనుకొని, జోగయ్యకు కాస్తా ఎడంగా నిల్చుంది. మైక్ లో ప్రకటన కాసేపు ఆపి,వేదిక దిగి, జోగయ్య కుర్చీ దగ్గరకు వచ్చాడు ప్రకటనల సచివాలయ ఉద్యోగి.

ప్రజలు ఏమి ఇంకా రావడం లేదు? - అడిగాడు ప్రకటనల ఉద్యోగి.

ప్రజలకు పనీ,పాట్లు వుంటాయి కదా — అనన్నాడు జోగయ్య.

బాహుదా నవ్వినట్టు అన్పించింది ప్రకటనల ఉద్యోగికి — తోక కత్తిరించీగలను అన్నట్టు చూసాడు కోపంగా . బాహుదా తోకను అటూ,ఇటూ వూపి మౌనం వహించింది.

నీకు ఏమాత్రం బూమి ఉంది?.

ఇతగానికి ఇంకేమి భూమి ఉంది? అప్పుల కింద కొంత, ఆలికి కిడ్నీ జబ్బు చేస్తే వొయిద్యానికి మరికొంత చెల్లిపోయింది. చెర్లోని చేపలన్నీ చెల్లిపోనాయి, గుడ్డి కొంగ లాగ మిగిల్నాడు అని చెప్పింది బాహుదా.

నాకే బూమి ఉంటే గవర్మెంట్ ఇంత బలవంతం చెయ్యక్కరలేదు, పువ్వుల్ల పెట్టి ఇచ్చీద్దును — అన్నాడు జోగయ్య.

సచివాలయ ఉద్యోగి సంతోషంగా చూసాడు జోగయ్యను.

భూములు లేనోలంతా యిలాగే కవుర్లాడతారు .ఉన్నోడికి తెలుస్తాది...పేగు తెగిన బాధ — అంది బాహుదా.

సచివాలయ ఉద్యోగి కల్లెర్రగించి చూసాడు బాహుదాను.

ఎందుకైనా మంచిది ... దుష్టులకు దూరంగా ఉండాలని భావించి బాహుదా జోగయ్యను వదిలేసి వేదిక మరో చివరికి వెళ్ళింది. సరిగ్గా అప్పుడే ఎస్పీ,కలక్టర్, వారి సిబ్బంది వాహనాలు చేరాయి. ఊరిలోంచి ప్రజలు కూడా వొస్తున్నారు. కుర్చీలు నిండుతున్నాయి. మైక్ లో ప్రకటనలు వినిపిస్తున్నాయి. మైక్ శబ్దానికి మించిన శబ్దంతో డప్పుల ధ్వని, పాడుతున్న కంఠాలు వినవచ్చాయి. ఎస్పీ అసహనంగా అటువేపు చూసాడు. ఆ చూపు అర్థం చేసుకున్న పోలీస్ సిబ్బంది... డప్పులను, కంఠాలను వేదికకు దూరంగా తరిమేసింది. అదే సమయంలో ఎంపీ గారి వాహనం, ఎమ్మెల్యే గారి వాహనం, వారి సెక్యూరిటీ వాహనాలు సందడిగా వచ్చాయి. సభ ఆరంభం అయింది. కలక్టర్ గారు సభ ఉద్దేశం వివరించారు. ఎమ్మెల్యే క్లుప్తంగా ఉపన్యసించి, ఎంపీ గారిని ఉపన్యసించమని ఆహ్వానించారు, ఎంపీ గారు — విమానాశ్రయం వలన, పెట్టబోయే కార్పొరేట్ కంపెనీల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

భూమికి పరిహారం గురించి, ఉద్యోగాల గురించి కొందరు ప్రశ్నలు వేసారు. మరికొందరు...ఈ మడకనే ఎందుకు? ఇంకోచోట పెట్టుకోవచ్చు కదా అనన్నారు. ఇంకొందరు విమానాలు మాకెందుకు? అదేదో కంపెనీ వలన మాకు వొరిగే దేమిటి — ప్రశ్నలు వేయడం,ఎంపీ గారు సమాధానం చెప్ప బోతుండగా —ఆకుపచ్చ చీర, ఎర్రెర్రని జాకెట్తో కదలివస్తున్న పతాకాలా ఓ స్త్రీ — పెను కేక వేసింది.

కలింగోర వొచ్చింది — కలింగోర అని సభలో జనాలు. వేదిక మీది ఆసన్నులైన వారు కూడా అటు చూసారు.

'...నాకు సమాధానం చెప్పండి' కలింగోర.

ఒకే స్త్రీ కంఠంలా కాదు,పెద్ద సమూహమేదో ప్రశ్నించినట్టు, అనేకమంది ఆకుపచ్చ చీర, ఎర్రజాకెట్లతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కలింగోరల గుంపు.. కన్పిస్తోంది... ఒకరా? గుంపా? కళ్ళు పులుముకొని చూడసాగేరు... వేదిక మీది వారంతా.

అప్పటిదాకా వేదిక నుంచి దూరంగా తరిమేసిన డప్పులు, నినాదాల కంఠలు కలింగోర దగ్గరకు చేరాయి. వేదిక ముందరి ప్రజలు కూడా కలింగోర వెనక చేరారు. బాహుదా కూడా తోక ఊపుకుంటూ కలింగోర పక్కకు చేరింది. వేదిక మీద, వేదిక ముందర రెండు ప్రత్యర్థి గుంపులు మోహరించినట్టు మారిపోయింది సభ.

పోలీసు సిబ్బంది కదిలింది, కలింగోరను తరిమేయబోతే ... తీక్షణంగా వారి వేపు చూసిన కలింగోర కళ్ళలోంచి యేవో అగ్నిశిఖలు తమ మీదకు దాడిచేసినట్టన్పించి నిశ్చేష్టు లయ్యారు పోలీసులు. కలింగోర మరికాస్తా వేదిక ముందరకు నడిచి ,గొంతు విప్పి ప్రశ్నలు వేయసాగింది. ప్రశ్నాపత్రం అది. వేదిక మీది వారు సమాధానం చెప్పాల్సిన ప్రశ్న పత్రం...చెప్పలేక తలలు పట్టుకున్నారు ,సమాధానాలు తెలియని విద్యార్థుల్లా.



"..మీరెవరు" కలింగోర తొలి ప్రశ్న.

తలలు పట్టుకున్న వేదిక మౌనంగా ఉంది.

ఆ మౌనం సహించని బాహుదా — ఆళ్లు ఆపీసర్లు, పొలిటీసియన్లు, ఎవులని అడుగుతావేటి? ఆమాత్రం తెల్దా? అనంది.

అవును గానీ, మీరెవరు? మళ్ళీ ప్రశ్నించింది కలింగోర

"...ప్రభుత్వ ప్రతినిధులం..." వేదికమీది ఓ గొంతు సమాధానమిచ్చింది.

"...ప్రభుత్వమెవురిది?"

బాహుదా అడ్డుసుడి సమాధానం చెపుతాదని, తన కంటే ముందు సమాధానం చెప్పేయాలని , కరెక్ట్ ఆన్సర్ చెప్పే విద్యార్థిలా ఎంపీ బుద్ధిగా నిల్చొని _ ఇది ప్రజల ప్రభుత్వం, ప్రజా ప్రబుత్వం అని చెప్పారు.

"...మరి మీరు ప్రజల వేపు ఉండాలి,ప్రజలకు బాధ్యులు కావాలి. కంపెనీలకి, కార్పోరేట్ వాళ్ల కోసం ఎందుకు పని చేస్తన్నారు?"

"...బయటికి చెప్పుకోలేరు గానీ ఓటు ప్రజలిస్తారు, నోటు కంపెనీలు,కార్పోరేటోలు గదా ఇస్తారు. నీకు తెలిసే ఎందుకు ఇలాటి ప్రశ్నలు ఏస్తావు? అసలు, సిసలు ప్రశ్నలెయ్యక్కా ?" అంది బాహుదా.

ఏమనుకుందో కలింగోర — ఏళ్లతరబడి ఈ ఉద్దానం గానీ, అటు పార్వతీపురం, సీతంపేట అటవీ ప్రాంతం గానీ, విజీనగరం,విశాఖపట్నం,శ్రీకాకుళం మైదానం గానీ ఏటి కావాలని అడిగినాయి? అని ప్రశ్నించింది. వేదిక మౌనం...

వొద్దన్నా వొర్షం కురస్తాది, పద్దెనిమిది సిన్నా,పెద్ద నదులు...పొలాలికి పారాల్సిన నీళు సముద్రంల ఎందుకు కలిసిపోతన్నాయి? ఆనకట్టలు ఎందుకు కట్టరు? కడుతున్నవి ఎందుకు పూర్తి చెయ్యరు? పంటల ఆధార పరిశ్రమలు చెరకు,జనపనార మిల్లులు ఎందుకు మూత అయినాయి? ఇంటింటా ఒక మగ్గం — ఎందుకు ఇరిగిపోనాయి? బుడితి కంచు, బొబ్బిలి వీణ,పొందూరు ఖద్దరు,కొండపల్లి బొమ్మలు ... రాజాం మిల్లులు ఏటయినాయి? మీము అడిగినవి — ఆనకట్టలు, పంటల ఆధార పరిశ్రమలు, చిన్న మిల్లుల నడక,అడివిపంటల గిడ్డంగులు, మార్కెట్ సదుపాయాలూ — ఇవి ఎందుకు చేయరు?

మేము అడగనివి, మాకు అక్కరలేనివి ఎందుకు పెడుతున్నారు? భూములు,ఊళ్ళు, జెనాలు తరతరాలు జీవించే ఈ కళింగ సీమ మీద...వొచ్చే ఆ విమానాలు, ఆ కంపెనీలు చేసే అభివృద్ధి ఏటి?ఎంత? చెప్పండి...చెప్పండి '' ప్రశ్న పత్రం చదివింది కలింగోర.

ఒక గొంతు కాదు వందలాది గొంతుల్లా ప్రశ్నలు విన్పించాయి.

వేదిక మీది పెద్దల్లో సన్నగా ఆందోళన మొదలైంది. పోలీసులు అదుపుచేయలేని గందరగోళంగా, గోల, గోల!

ఎంపీ, ఎమ్మెల్యే,అధికారులు ఆందోలనగా వేదిక దిగి,వాహనాలు ఎక్కబోతుంటే , ఆకుపచ్చ చీర,ఎర్రెర్రని జాకెట్లతో కదిలి వచ్చే పతాకాల్లా —అనేకులు , కలింగోరల గుంపు... అడ్డు నిలిచాయి. కలింగోరల కంఠాలు పెను శబ్దంతో ప్రశ్నలేస్తున్నాయి.

ఇంకోపక్క చిన్నగా వాన జల్లు ఆరంభం అయింది. జల్లు పెద్దదవుతోంది. దానితోపాటు పెను శబ్దంతో మెరుపులు,ఉరుములు ఆకాశంలో .... కలింగోరల ప్రశ్నల్లా ....

❑

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# సుక్ర బల్మొచు

- కె. ఎన్. మల్లీశ్వరి



సుకన్ బురు కొండమీద రంగురంగుల గాలిపటాలు ఎగురుతున్నాయి.

కొసలతో మెలికలు తిరుగుతూ వీరవిన్యాసాలు చేస్తున్న వాటిని - తుండక్ తమక్ డోలు వాయిద్యాలు మరింత రెచ్చగొడుతున్నాయి.

"ఢండనక ఢండనక ఢండనక... ఏ ఏ ఏ
దినక దినక దిద్దినక దిద్దినక దిద్దినక.."

కొండమీది జంతువులను, చెట్లను లక్ష చేతులతో జవురుకుంటూ పర్వతపు ఆత్మ బురుబొంగా - భూమినుంచి ఆకాశం వరకూ శివాలెత్తుతున్నాడు.

ఒక స్త్రీ తలవంచి మొవా పూలు ఏరుకుంటున్నది.

ఇద్దరుపిల్లలు విచిత్రమైన గాలిపటం ఎగరేస్తున్నారు. దాని తోక చాలాపెద్దది. వెయ్యి గూడ్సుబండి పెట్టెలంత పొడవు. అది సాగుతూవచ్చి ఒంటిని చుట్టేసింది. గింజుకున్నా కదల్లేకపోతున్నాడు. అపుడొచ్చి గుండెలమీద కూచున్నాడు బురుబొంగా. బుగ్గలు పొంగించి రౌద్రంగా -

'పూర్వీకుల ఆత్మల సంచారానికి ఇంకా రావేమిరా' హూంకరించాడు.

"బురు బురుబొంగా" పొలికేక పెడుతూ నిద్రలో నుంచి ఒక్క ఉదుటున లేచాడు లైన్‌మాన్ సుక్ర.

కొత్తవలస రైల్వేస్టేషనుకి కాస్తదూరంలో పాడుబడి ఉన్న ఆ రైల్వేక్వార్టర్స్ ఒక్కసారిగా తుళ్ళిపడింది. కొంచెం శుభ్రం చేసినచోట పరజాలు పరిచి పడుకున్న రైల్వేకాంట్రాక్ట్ లేబర్లో నలుగురైదుగురు ఉలిక్కిపడి లేచి చుట్టూచూసి, తిట్టుకుంటూ మళ్ళీ వెచ్చదనంలోకి ముడుచుకున్నారు.

మదుగ్గా ఉన్నచోట ఐరన్ మంచంమీద పడుకున్న వంటతను లేచికూచుని, తలకింది చుట్టుగుడ్డని సుక్రమీదికి విసిరికొట్టి 'ఎవరినీ పడుకోనివ్వు గదరా లమ్డీకే' అరిచాడు.

నిద్రమత్తులో అయోమయంగా చూసి, చెవుల క్యాప్స్ సర్దుకుంటూ బైటకి వచ్చాడు సుక్ర. ఆ వెనకే హెల్పర్ దండాసి. డిసెంబర్ నెలాఖరు చలిలో కూడా చెమటతో తడిచి పోయిన సుక్ర వీపుమీద చిన్నగా చరిచి "ఏటయింది అన్నియ్యా?" అన్నాడు.

పగలంతా రైలుపట్టాల వెంబడి తిరుగుతూ పోల్స్ ఎక్కీదిగి అలిసిపోయి, రాత్రికి పెట్టింది తిని, రహస్యంగా ఇంత గాంజా తీసుకుని మైకంగా శూన్యంలోకి చూస్తూ ఉంటాడు సుక్ర. అతనివి చిన్నచిన్న ఆలోచనలు. ఊరు, కొండ, పెళ్ళాంపిల్లలు, దైవికశక్తులు, రైలుపట్టాలు, పోల్స్ మసకగా కదిలిపోతుంటాయి. అలాంటిది ఇపుడింత గట్టికల! సుకన్ బురు పండక్కి ఇంటికి వెళ్ళకపోతే దేవతలు శపిస్తారేమో, తన కోసం ఎదురుచూస్తున్న పెళ్ళాంపిల్లల ఉసురు తగులుతుందేమో! గొణుక్కుంటున్నాడు.

రెండేళ్ళపాటు నడిచే కొత్తవలస-విజయనగరం రైల్వే ఓహెచ్చీ కాంట్రాక్ట్ కోసం పాతికమందికి పైగా లేబర్, ముగ్గురు ఇంజినీరింగ్ స్టాఫ్ ఆ సైట్లో ఉన్నారు.

అక్కడ, భాష చాలామంది సమస్య. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన లేబర్ హిందీ మాట్లాడి నెగ్గుకొస్తారు. కానీ సుక్ర మాట్లాడే జార్ఖండ్ ముండారీభాష ఎవరికీ అర్థంకాదు. అపుడపుడు వచ్చీరాని హిందీ పదాలు కలిపి మాట్లాడినా ఉపయోగం ఉండదు. దండాసికి తెలుగుతప్ప మరేదీరాదు. కానీ సుక్రమాటలు చక్కగా అర్థమయ్యేది అతనొక్కడికే.

'లోపటి సీమూనెత్తురూ ఏటి సెప్తే అది సేసేవాళ్ళమే ఎవుళమయినా. అది ఎరికయితే సాలు, ఆడి బాసతో నాకేటిపని' అంటాడు.

ఇపుడుకూడా సుక్ర గొణుగుడు అర్థమయినట్లు నవ్వాడు. "ఏడింటికి ఒక గంట బ్లాకు దొరికినాది, అది తీసేసుకో. నీను ఆలకి సెప్తాలే. అయిదుపోల్స్ ఎక్కి దిగిసినావంటే అయిపోతాది, ఆనక బేగి లగెట్టి లారీ అట్టుకో వచ్చు" సైగలు, మాటలు కలిపిచెప్పాడు.

అది నచ్చినట్లు, గబగబా పనిలోపడ్డాడు సుక్ర. పట్టాలదగ్గరికి బయల్దేరే సమయానికి ఆకలికి కడుపులో పేగులు వింతశబ్దాలు చేశాయి. వంటతని కోసం వెతికాడు. కంబళి కప్పుకుని వరండాలో ఓ మూలకి ముడుచుకుని అడ్డపొగ పారవశ్యంలో తేలకళ్ళు వేసుకుని మంచుతెరలను చూస్తూ ఉన్నాడు.

పొట్టచూపించి ఆకలని సైగచేశాడు. ఆ సైగలు అర్థమయినా తను తిరిగి మాటల్లో చెప్పేదేదీ సుక్రకి అర్థంకాదని వంటతనికి తెలుసు. ఆ కారణంగా నోటికొచ్చింది అనొచ్చునన్నది గిలిగింతలు పుట్టిస్తుంది. అందుకే నవ్వుమొహం, మాయగొంతుతో -

"ఎపుడూ తిండిగోలేరా కొండమేళం! పాము పొట్టేసుకుని పొద్దుపొద్దున్నే రెడీచ్ మని తగలడిపోతావు, వండిపెట్టాలిగానీ కుండెడు గూనపులుసు ఒట్టినోటితో జుర్రేత్తావ్" అన్నాడు.

సుక్రకి ఏమీ అర్థంకాలేదు. "క్యా బోల్తే హో" అన్నాడు అయోమయంగా.

"ఏం బోల్తానురా జడ్డిడా, బకాసురుడి బాబాయ్ లెక్కన తయారయ్యావు. కొండోడి మూతీమొహం సూడుమీ! అనుమంతుని అవతారం" మూతి ఉబ్బించి వెక్కిరించాడు.

ఓహెచ్చీ ఎక్విప్మెంట్ తగిలించుకుని అపుడే అక్కడికి వచ్చిన దండాసి -

"ఇదేటిది! నువ్వేటి అంతన్నావో ఆడికి తెల్దని నీకుతెలుసు, ఇలగ ఆడీసుకుంతన్నవేటి? ఏడింటి బ్లాకవ్వగానే ఈడు లారీలట్టుకుని అంచెలమీద ఊరెల్తడు. నీ దగ్గర ఏటన్నా ఉంటే పెట్టు, నేపోతే నేదు" కోపంగా అన్నాడు.

జయ్యిన లేచాడు వంటతను. పక్కనున్న అంట్లనుంచి దబరా తీసి విసిరికొట్టి, "సూడరా మెతుకు అంటుకుని ఉంటే చెప్పుచ్చుకు కొట్టు. రాకాసితిండిరా నాయనా, బస్తాబియ్యం ఒక్క రోజులో ఊదేస్తారు. నీనేటి సెయ్యాల! ఇహనేటి మరి, నన్ను పీక్కుతినండిరా, లేపోతే అల్లదో ఆడ ఇంజినీర్ బాబులు బొబ్బున్న కంటీనర్ ఉంది సూసావా, దాన్ని గుటుక్కున మింగేంద్రా కడుపు నిండుతాది!" అన్నాడు.

"ఎల్లేస్! దొబ్బకు సిరాగ్గా" వంటతన్ని విసుక్కుని సుక్ర చేయిలాగుతూ 'పోదాం రా! బ్లాకయ్యాక వచ్చి తిందూగానీ" చెప్పి ముందుకు కదిలాడు దండాసి.

• • •

లోకం తెల్లబడిందిగానీ పూర్తి వెలుతురు లేదు. పదినిమిషాలు మంచులో నడుచు కుంటూ వెళ్ళాక పట్టాలు కనబడ్డాయి. నిన్న, గుర్తులు పెట్టిన పోల్స్ చూసుకున్నారు. నడుంబెల్టు కట్టుకుని, నాలుగైదు పనిముట్లు తీసుకుని చకచక పైకి ఎగబాకాడు సుక్ర. అరగంటలో మూడుపోల్స్ ఎక్కి ఎలక్ట్రికల్ తీగలని చెక్ చేసి, సవరించి దిగాడు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




ఈ వారం కథ

నాలుగోపోల్‌కి పెద్ద రెంచి అవసరం పడింది. కిందకి సైగచేశాడు. బ్యాగ్ నుంచి తీసి, పైకి విసిరాడు దండాసి. సుక్రచేతికి అందలేదు, కిందపడినదాన్ని తీసుకుని మళ్ళీ గురిచూసి విసిరాడు. తక్కువఎత్తులో వస్తున్నదాన్ని అందుకోడానికి కాళ్ళు గాల్లోకి లేపి శరీరాన్ని సాగదీసి కిందకి వంగాడు.

అప్పటికే చివికిపోయి ఉన్న నడుంబెల్టు తాళ్ళు పటపట తెగిపోయాయి. పోల్‌ని చుట్టుకున్న ఎడంచేయి మంచుకు తడిసిపోయి శరీరాన్ని కాయలేక పట్టు వదిలేసింది.

మళ్ళీ కిందబడిన రెంచివైపు చూస్తున్న దండాసి - సుక్ర అరుపులకి తలెత్తాడు.

దాదాపు ముప్పైఅడుగుల ఎత్తున్న పోల్ మీద నుంచి దబ్బున పడిపోయాడు సుక్ర. పెద్దపెద్ద కంకరరాళ్ళ మధ్య - చావుని కరిగించి పోతపోసినట్లున్న రైలుపట్టాని తాకి వింతశబ్దం చేసిందతని తల.

దండాసికి ఒళ్లంతా జిమ్మున కొట్టిందేదో. వణుక్కుంటూ దగ్గరకివెళ్ళాడు. పట్టాలని తాకి పగిలిపోయిన సుక్ర తలని చూసి కక్కుకోబోయాడు. వెంటనే వెనక్కిగెంతి, "సుక్రగాడు సచ్చాడ్రోయ్ ఓరిదేవుడో నీవేం దేవుడివిరా నంజికొడకా! నీయబ్బ, సంపేసావు గదరా, సుక్రగాడు పడ్డాడు పాఠ్రాంగ్రోయ్" పరుగందుకున్నాడు.

ఆ పరుగుమధ్యే ఏదో ఆలోచన. ఇంకో ఇరవైనిమిషాల్లో బ్లాక్ సమయం ముగియగానే రైలు వచ్చేస్తుంది. సుక్ర శరీరం పట్టాలమీదే ఉంది. ఆ ఊహకే కడుపులో దేవేసింది.

వెనక్కివచ్చి ఊపిరిబిగబట్టి సుక్రని పట్టాల ఇవతలకి లాగాడు. తెగిపోయిన నడుంబెల్టుని అదే పనిగా రెండునిమిషాలు చూశాడు. తర్వాత కటింగ్ బ్లేయర్ తీసుకుని పిచ్చిపట్టినవాడిలా బెల్టుని సుక్ర శరీరం నుంచి వేరుచేశాడు.

సుక్రకాళ్ళు పట్టుకుని, "అన్నియ్యా నన్ను చమించు, నాకోసంగాదు, అందరికోసం ఇలగసేసాను, చమించు అన్నియ్యా" బతిమలాడుతున్నట్లు చెప్పి, ఆ బెల్టుకి పెద్దరాయి కట్టి వెళ్ళే తోవలో ఉన్న నీటికుంటలో పడేశాడు.

• • •

హాంగోవర్ వల్ల తల దిమ్ముగా ఒళ్లంతా బరువుగా ఉంది. కాళ్ళీడ్చుకుంటూ హాల్లోకి వచ్చాడు ప్రఫుల్ల. విశాలమైన హాల్‌కి ఒకవైపు గోడంతా సీత్రూ అద్దాలున్నాయి. విల్లా బైట అందంగా పెంచిన తోటమీద సన్నగా మంచుతెర.

"ఏమీ, పొద్దున్నే మొహం దుంపలా పెట్టుకున్నావు!" వాళ్ళావిడ నవ్వింది. మాట్లాడాలనిపించ లేదు. లోపల ఒకటే తలపోత.

రెండేళ్ళు అనుకున్న కొత్తవలస - విజయనగరం కాంట్రాక్ట్ మూడేళ్ళు పట్టేట్టుంది. కోటిరూపాయల మార్జిన్ ఆ మేరకి తగ్గిపోతోంది. పార్ట్ పేమెంట్స్ శాంక్షన్ కాలేదు. అప్పులకి వడ్డీలు పెరిగిపోతున్నాయి. లేబర్ దొంగ నా కొడుకులు సరిగ్గా పనిచేయరు. సైట్ ఇంజినీర్లు ఆడుకుంటున్నారు. వీటికి తోడు ఇరవై ఐదేళ్ళ కొడుకుతో రోజూ గొడవే. మంచి ఉద్యోగం వెతుక్కుని నిశ్చింతగా బతకమంటే - 'సంతోష్ చౌదురి 'ఎ' క్లాస్ రైల్వేకాంట్రాక్టర్ అవుతానంటాడు. తనూ కాంట్రాక్టుల్లోకి రానివ్వక వాడూ ఉద్యోగం చెయ్యక రోజులు నడిచిపోతున్నాయి.

ఈ ఒత్తిళ్ళకి గుండెపోటు వచ్చి పోతే- ఎక్కడెక్కడ ఏమేం ఉన్నాయో చెప్పి జాగ్రత్తగా చక్కబెట్టుకోమని నిన్న సాయంత్రమే వాళ్లావిడతో అన్నాడు. అక్కడికీ తీరక ముగ్గురుఫ్రెండ్స్‌తో కలిసి మందుకొడుతూ తన బాధలన్నీ కరువుదీరా చెప్పుకున్నాడు.

హాల్లో లాండ్ ఫోన్ ఆగకుండా మోగుతోంది. వంటగదిలో ఏదో పురమాయిస్తున్న వాళ్ళావిడ 'ఫోన్ చూడండి' గట్టిగా కసిరింది. తేరుకున్నట్లు లేచివెళ్ళాడు. అటునుంచి చెప్పింది విని- "ఎవడూ సుక్ర బల్మాచు గాడా?" నమ్మలేనట్లు అడిగాడు. రెండుమూడు పొడిమాటల తర్వాత ఫోన్ పెట్టేసి తలపట్టుకు కూచున్నాడు. భార్యవచ్చి రెట్టించి అడిగింది.

"సైట్లో కొండోడెవడో పెంటబెట్టాడు" విసుగ్గా అన్నాడు.

'ఒకటికి పది మనకే రావాలా!' తిట్టుకుంటూ లోపలికి వెళ్ళిందామె.

అదనంగా ఎంతపని వచ్చిపడిందో తలచుకుంటే ఓపలేనట్లు, గుండెలో పెద్దబండ పడినట్లు ఉంది ప్రఫుల్లకి. తోచనట్లు చుట్టూచూశాడు. హాల్లో రిక్లైనర్ సోఫాలో అడ్డదిడ్డంగా పడుకుని నిద్రపోతున్నాడు సంతోష్. చుట్టూ రకరకాల కార్పోరేట్ బిజినెస్ పుస్తకాలు. రాత్రి వాళ్ళమ్మ కలిపిచ్చిన అన్నం బౌల్ మీద మూతకూడా తీయలేదు. ఒక్క ఊపులో లేచివచ్చి సంతోష్ భుజం మొరటుగా తట్టి, విషయం చెప్పి "డ్రైవర్ సెలవులో ఉన్నాడు, స్టేషనుకి వెళ్ళాలి పద" అన్నాడు.

మొహం వికసించింది సంతోష్‌కి. అయిదే నిమిషాల్లో రెడీ అయిపోయాడు. తండ్రి తయారయి వచ్చేలోపు కంప్యూటర్ నుంచి ఏదో సమాచారం వెతికిపెట్టుకున్నాడు. కార్లో కూచోగానే 'డాడీ! నువ్వు రిలాక్స్‌గా ఉండు" అన్నాడు చనువుగా.

ప్రఫుల్ల విననట్లు ఊరుకున్నాడు. లోపలి ఆలోచనలతో మొహం బిగుసుకుపోయి ఉంది. పోయినోడికి కాంపెన్సేషన్ ఇవ్వాలి. వాళ్ళెంత డిమాండ్ చేస్తారో! సైట్ మీదకొచ్చి యాగిచేస్తే! రైల్వేపోలీసులే కాకుండా క్రైమ్ వాళ్ళుకూడా దూరతారేమో, అందరికీ పందారాలు చేసుకుంటా పోవాలి కాబోలు, ప్రెస్ ఎవడికన్నా లీకయితే వాళ్లకి మేపాలి.

> రెండేళ్ళపాటు నడిచే కొత్త వలస - విజయనగరం రైల్వే ఓహెచ్ఈ కాంట్రాక్ట్ కోసం పాతిక మందికి పైగా లేబర్, ముగ్గురు ఇంజనీరింగ్ స్టాఫ్ ఆ సైట్లో ఉన్నారు.
>
> అక్కడ, భాష చాలామంది సమస్య. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన లేబర్ హిందీ మాట్లాడి నెగ్గుకొస్తారు. కానీ సుక్ర మాట్లాడే జార్ఖండ్ ముండారీభాష ఎవరికీ అర్థం కాదు. అపుడపుడు వచ్చీరాని హిందీపదాలు కలిపి మాట్లాడినా ఉపయోగం ఉండదు. దండాసికి తెలుగుతప్ప మరేదీరాదు. కానీ సుక్రమాటలు చక్కగా అర్థమయ్యేది అతనొక్కడికే.

ఇంట్లో, బ్యాంకుల్లో కలిపితే రెండులక్షల కన్నా లేనట్లుంది. తాకట్టుకోసం పెళ్ళాన్ని బంగారం అడిగితే ఇస్తాదా, ఊహూ! కొనిపించుకునేపుడే వలపులు, మొగుడు తిరిగి అడిగితే కాలిపట్టీ కూడా ఇవ్వదు.

తల బద్ధలవుతున్నట్లు ఉంది ప్రఫుల్లకి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



పోలీస్‌స్టేషన్‌కి వెళ్లేసరికి షుగర్ డౌనయి వేలాడిపోయాడు. అతనికి టీ, బిస్కెట్స్ ఇచ్చి, సీట్ వెనక్కివాల్చి పడుకోమని, పేపరుమీద రాసుకున్న పాయింట్స్ చూసుకుంటూ స్టేషన్ లోపలికి వెళ్ళాడు సంతోష్.

గంటయ్యాక కొద్దిగా తేరుకుని ఆదుర్దాగా కారు దిగబోతుంటే కొడుకు వచ్చేశాడు. సుక్ర బాడీ కెజిహెచ్‌కి వెళ్ళిపోయింది. పోస్ట్ మార్టం అయ్యాక అతని తరుపువాళ్ళు వచ్చేవరకూ మార్చురీలో ఉంచి, తర్వాత సైట్లోకి తెస్తారు. పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టేశారు. ఇంకే ఎంక్వైరీలు పెద్దగా లేకుండా కాంప్రమైజ్‌కి సహకరించడానికి లక్ష రూపాయలు అడిగారు, యాభైవేలకి బేరం సెటిల్ చేశాడు సంతోష్.

వివరాలన్నీ విని పెద్దగా మూలిగి, "సుక్రగాడి ఫ్యామిలీకి రెండులక్షలు. అంతే! నన్ను ఈడ్చికొట్టినా పైసా రాలదు" ఉద్రేకంగా అన్నాడు ప్రఫుల్ల.

"మూడుపైన అడగొచ్చని.." సంతోష్ మాట ముగిసేలోపే రయ్యిమన్నాడు ప్రఫుల్ల.

"ఆడి కాళ్ళకి స్పైక్స్ లేవు, బాడీబెల్ట్ లేదు, తలకి హెల్మెట్ లేదు, కోతుల్లాగా ఎగురు కుంటూ చెట్లు ఎక్కినట్లు పోల్స్ ఎక్కుతారు, అడివిమాలోకాలు! ఆడి తప్పిదంవల్లే జరిగింది, కాంప్రమైజప్పుడు గట్టిగుండాల మనం."

"అంత తేలికకాదు డాడీ! 'వాడు వేసుకున్నవి తెగిపోయి ఉంటే కాంట్రాక్ట్ బ్లాక్ లిస్టులోకి వెళ్ళిపోయేది, మీ డాడీమీద చాలామంది కన్నేశారు' అన్నారు పోలీసులు."

సంతోష్ మాటలు విననట్లు మొహం చిరాకు చేసుకుని "ఆ లేబర్ సప్లయిర్ కుశరాజు గాడిని రమ్మను కాంప్రమైజ్ టయానికి" అన్నాడు.

• • •

ప్రఫుల్ల, సంతోష్ సైట్లో కారు దిగేసరికి సుక్ర శవం- క్వార్టర్స్ ఎదురుగా ఉన్న చెట్టుకింద కనబడింది. తిక్కలేసిపోయింది ప్రఫుల్లకి. "ఆర బైట పడేసారా! అదిమాత్రం ఎందుకురా, తీసు కొచ్చి నా నెత్తిన పెడ్తే సరిపోయేది కదా"అన్నాడు.

సైట్ ఇంజినీర్ పరుగున వచ్చి, 'క్వార్టర్స్ వరండాలో శవాన్ని పెడితే వర్క్ వదిలేసి వెళ్లిపోతామని, ఇక్కడ దెయ్యాలున్నాయి కాబట్టి అసలు క్వార్టర్స్ లోనే ఉండము' అని లేబర్ బెదిరిస్తున్నారని చెవిలో చెప్పాడు. అంతకుముందు తనన్నమాట, ఇంజినీర్ మాట పక్కనపడేసి శవం ఉంచినవైపు అడుగులేస్తూ ఓరగా చుట్టూచూశాడు ప్రఫుల్ల.

ఇంకో చెట్టుకింద పరజా మీద సుక్రపెళ్ళాం దామి చంకనబిడ్డ, చేతికింద కూతురితో కనబడింది. పక్కనే ఆమెతండ్రి వంటతను ఇచ్చిన టీలో రొట్టెలు ముంచుకు తింటున్నాడు. పండగ నుంచి ఆపళంగా వచ్చేసినట్లు నలిగిపోయిన అలంకరణతో ఉంది దామి. ఏడుస్తూనే అందరినీ వింతగా చూస్తోంది.

శవానికి పెట్టీపెట్టనట్టుగా దండంపెట్టి దీర్ఘంగా చూస్తూ నిల్చున్నాడు ప్రఫుల్ల. పక్కన చేరిన వంటతను చేతులు నలుపుకుంటూ "సిటం ఆగితే పకాలన్నమో పరమాన్నమో పెడతానురా సుక్రా అన్నాను, రాట్ నాకేటీ వద్దని జాకర్లేసుకుంటా పోయాడు...పోయాడు. ఆడికి దారిబత్తెం తీసుకునే అదృష్టం రాసిపెట్టిలేదు" విచారంగా అన్నాడు.

ఆశ్చర్యపోడానికి మనసులో జాగాలేనట్లు నేలమీద గొంతుక్కూచుని, శవంవంక దీనంగా చూస్తూ 'చమించు అన్నియ్యా, వర్కు ఆగిపోతే అందరి పొట్టకొట్టిన పాపం సుట్టుకుంతాది నాకు, అందకే ఇలగ సేసినాను' లోపల్లోపల గొణుక్కుంటున్నాడు దండాసి.

ఊపిరాడనట్లుంది ప్రఫుల్లకి. 'సైట్లో ఇదంతా తొరగా క్లియర్ చేసేయాల' అనుకుంటూ అలికిడికి తిరిగిచూశాడు. లేబర్ సప్లయిర్ కుశరాజు, ఇంకోవ్యక్తి ఎవరో నిల్చున్నారు.

ప్రఫుల్ల మొహంలోని కోపంచూసి - "అసలు ఏటైందో! సుక్రగాడు మామూలోడు గాదు స్కిల్డు. ఆడికి ఇలగ్గావడం మాయలాగుంది" ఎదురు బెదిరింపు ఎత్తుకున్నాడు కుశరాజు.

శవానికి పెట్టీపెట్టనట్టుగా దండంపెట్టి దీర్ఘంగా చూస్తూ నిల్చున్నాడు ప్రఫుల్ల. పక్కన చేరిన వంటతను చేతులు నలుపు కుంటూ "సిటం ఆగితే పకాలన్నమో పరమాన్నమో పెడతానురా సుక్రా అన్నాను, రాట్ నాకేటీ వద్దని జాకర్లేసు కుంటా పోయాడు...పోయాడు. ఆడికి దారిబత్తెం తీసుకునే అదృష్టం రాసిపెట్టిలేదు" విచారంగా అన్నాడు.

పసిగట్టేశాడు ప్రఫుల్ల. "కో..ట్లానంటే గూబ గులాబ్ జామ్ అయిపోగల్దు. కమిషన్ కోసం కొండెదవల్ని అంటగట్టేది గాకుండా నక్క ఏసికాలు ఏస్తున్నావా!" అని కుశరాజు పక్కనున్న మనిషినిచూసి "ఈడెవడు?" మొహమంతా చిరాకు చేసుకుని అన్నాడు.

ఆ మనిషి మొహం కందిపోయింది. 'వీడు అంటాడా నన్ను! జోబీలో పెన్ను, చేతిలో పుస్తకం, భుజానున్న గుడ్డసంచికైనా విలువ ఇవ్వడం తెలీదు బలుపు నాయాలకి!' మన సులో కసిగా తిట్టుకున్నాడు పత్రికా రిపోర్టర్.

"ఒక అమాయక ఆదివాసీప్రాణం నిష్కారణంగా..." ఆవేశంగా అంటున్న అతన్ని పురుగులాచూసి కంటైనర్ లోపలికి వెళ్ళిపోయాడు ప్రఫుల్ల.

తండ్రి కోపానికి నవ్వుకుని, "ఎంత?" అడిగాడు సంతోష్.

ఉలిక్కిపడ్డాడు రిపోర్టర్. వెంటనే తేరుకుని, ఆళ్ళకి లేని సిగ్గూశరమూ నాకేలా అనుకుని "మేనేజ్మెంటుకి తెలిస్తే పాతిక, నాలోనే ఉంచుకుంటే పదేలు" అన్నాడు.

సంతోష్ వెంటనే వాలెట్లోంచి వెయ్యి రూపాయలు తీసి చనువుగా రిపోర్టర్ జేబులోకుక్కి, "పిల్లలకి పళ్ళు, స్వీట్లు తీసికెళ్ళండి" అనేసి కుశరాజుని తీసుకుని కంటైనర్ లోపలికి వెళ్లబోతుంటే -

"ఆ కర్జూరం పళ్ళు మా అబ్బాయికి ఇష్టం" సంతోష్ తింటున్న బాక్స్ వంక ఆశగా చూస్తూ అన్నాడు రిపోర్టర్.

• • •

"సుక్రగాడి ఫ్యామిలీకి రెండులక్షలు, అంతే తెగ్గొట్టేయ్" కుశరాజుతో ఖండితంగా అన్నాడు ప్రఫుల్ల.

"దాన్నిచూసారా, ఆ దామి! కయ్యాలసూరి మొహం దాయి. పైగా దానిబాబు గట్టోడంత, మంత్రతంత్రాలు కట్టి మరీ ఏటిగావాలో సెపుతాడంత, ఆళ్ళు సాపైనోళ్ళుగారండీ బాబో!" నీనిలాగా కప్పకీ పాముకీ మధ్య ఇరుక్కు పోయానేట్రా దేముడా అని మనసులో తిట్టుకుంటూ అన్నాడు కుశరాజు.

ఇకంతే రెండులక్షలు దాటి ఇచ్చేదిలేదన్నట్లు బైటకొచ్చి కూచున్నాడు ప్రఫుల్ల.

కుశరాజు కాళ్ళీడ్చుకుంటూ తమవైపు వస్తుంటే- టెంపరిలా మొహం ఎగబెట్టుకుని, బిగదీసుకుంది దామి. రకరకాలభాషలు మాట్లాడుతూ కాంప్రమైజ్ విషయం చెప్పి ఎంతకావాలో అడగమన్నాడు.

దామి, ఆమెతండ్రి నేలమీద లెక్కలు మొదలుపెట్టారు. ఇసుకతో నాలుగైదుకుప్పలు వేశారు, వాటిమీద, చిన్నచిన్న గులకరాళ్ళు, గింజలు అమర్చారు. తీస్తూవేస్తూ లెక్కసాగుతుంటే-

'ఈ బ్రోకరుగాడు ఎంతకి తెగ్గొడతాడో'నని ప్రఫుల్ల, 'ఈ ఒంటిపొత్రం కాంటాక్రుతో ఇంకెన్ని పడాలో'నని కుశరాజు యమయాతన పడుతున్నారు.

చివరికి ఎంత అడగాలో దామి చెవిలో చెప్పాడు ఆమెతండ్రి. బింకంగా తలూపి పదిచేతివేళ్ళూ ఆడించి చూపిస్తూ- "థకా థకా మోరెన్ హిసీ మోరెన్ హిసీ థకా" పదేపదే అంది.

కుశరాజు తలాడిస్తూ "ఆ ఆ! థకా.. సొమ్ము.. వెయ్యి పది పదులు, కాదా? పదేల పదేలు ఆహ్ కాద్కాదు సరిగ్గా చెప్పు" అంటూ కిందామీదా పడి ఇసుకకుప్పలు, గులకరాళ్ళు, గింజలు, చేతివేళ్లు అన్నీ గుణించి లెక్కవేసి వాళ్ళెంత అడుగుతున్నారో రాబట్టాడు. ఆశ్చర్యపోయి మళ్ళీ మళ్ళీ అడిగాడు.

చివరికి గాల్లో తేలుతున్నట్లు మునివేళ్ళమీద ఎగురుకుంటూ ప్రఫుల్ల పక్కకొచ్చి రహస్యంగా "లక్షరూపాయలకి తక్కువిస్తే ఊరుకునేదిలేదు అంటున్నారు ఆళ్ళు" తన పాటవాన్ని

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

చమత్కారంగా గొంతులో పలికిస్తూ అన్నాడు.

నమ్మశక్యం కాని ఆనందం కలిగింది ప్రఫుల్లకి. పైకికనపడనీకుండా "నీకేమీ ఎంతయినా చెప్తావు, దేకుళ్ళు నావిగదా" ముక్కుతూ కంటైనర్లోకి వెళ్ళాడు. 'ఈడికి సంతృప్తి అన్నదే లేదని' ప్రఫుల్లని చెడతిట్టుకున్నాడు కుశరాజు.

ఆపుకోలేక రిపోర్టర్ పక్కనజేరి దామితండ్రిని చూపిస్తూ-

"ఈడో పేద్దమాంత్రికుడు, వోలకం సూడుమీ! కొండోళ్ళ కింగ్ కూడా మందెగ్గిర బారికోడి లెక్క! ఒరేబాబూ రారా, వచ్చి సిమ్మాసనం ఎక్కుమీ అని పిలిసినాడు చౌదురి. ఈడేటంతన్నాడూ? అచ్చీ! అసియ్యం, నీను ఎక్కను, నేలమీదే కూకుంతానంతాడు. ఇలగే ఉంతాది మరి. సిరి మాలచ్చిమి కూడా గుడ్డలిప్పుకు వచ్చి ప్రఫుల్లచౌదురికే కన్నుకొడతాది. ఇహన, నీవూనేనూ.." మిగతా బూతుమాట చెప్పకుండా మూతిమీద చెయ్యేసుకుని చూపించాడు కుశరాజు.

కిసుక్కున నవ్వుతూ, బాక్స్ నుంచి ఒక కర్జూరం పండు తీసి కుశరాజుకి ఇచ్చాడు రిపోర్టర్.

తండ్రి వచ్చిచెప్పగానే దామికి ఇవ్వడానికి పదులు, ఇరవైల కట్టలు బైటికితీశాడు సంతోష్. 'బ్యాంకుకి పోయి డబ్బుతెమ్మంటే చిల్లరకట్ట లెందుకు తెచ్చావని' విసుక్కో బోయాడు ప్రఫుల్ల. కానీ కొడుకు చేతులనిండుగా పట్టుకుని చూపించేసరికి ముసిముసిగా నవ్వాడు.

చేతిలోపడిన డబ్బుని ఒకటికి పదిసార్లు చూసుకున్నారు దామి, ఆమెతండ్రి. అప్పటికే సుక్ర శవం మినీవ్యాన్లోకి ఎక్కించారు. మారుపలక్కుండా వాళ్ళు వ్యాన్ ఎక్కబోతుంటే

చుట్టూ అందరూ నోరావలించి చూస్తున్నారు.
ఊహించని ఆ ఔదార్యానికి కొండ కరిగినట్లు జలజలా రాలింది దామి. ఆపళంగా పిల్లలిద్దర్నీ ప్రఫుల్ల పాదాలమీద పడవేసి మొక్కించింది. చేతులు మొహంవరకూ చేర్చి పరిపరివిధాల దండాలు పెట్టింది. దామితండ్రి ప్రఫుల్ల తలమీద చేయివుంచి రాగయుక్తంగా మంత్రాలు చదివి ఆశీస్సులు ఇచ్చాడు.
తిరుపతి హుండీ అవసరం లేకుండానే పుణ్యం సరాసరి వచ్చి తలనుంచి పాదాల వరకూ తడిపేయడం ప్రఫుల్లని ఉక్కిరిబిక్కిరి చేసింది.

సంతోష్‌కి ఏదో వెలితిగా అనిపించింది. ఊపుగా వచ్చి ఆగమన్నాడు.

ఇచ్చింది లాక్కుంటారేమోనని డబ్బు మూటగట్టిన కొంగు గుండెలకి అదుముకుంది దామి. అందరూ ఇటే తిరిగిచూస్తున్నారు.

లోపలినుంచి పదివేల రూపాయల కట్టలు రెండు తెచ్చి తండ్రి చేతిలోపెట్టి వాళ్ళని పిలిచాడు.

"నీకు పిచ్చిపట్టిందా?" నిర్ఘాంతపోయి చేతిలోని డబ్బువంక చూశాడు ప్రఫుల్ల.

అప్పటికే అయోమయంగా చూస్తూ దగ్గరికి వచ్చారు దామివాళ్ళు. తండ్రితో పిల్లలిద్దరి చేతిలో చెరో డబ్బుకట్టా పెట్టించాడు సంతోష్.

చుట్టూ అందరూ నోరావలించి చూస్తున్నారు.

ఊహించని ఆ ఔదార్యానికి కొండ కరిగినట్లు జలజలా రాలింది దామి. ఆపళంగా పిల్లలిద్దర్నీ ప్రఫుల్ల పాదాలమీద పడవేసి మొక్కించింది. చేతులు మొహంవరకూ చేర్చి పరిపరివిధాల దండాలు పెట్టింది. దామితండ్రి ప్రఫుల్ల తలమీద చేయివుంచి రాగయుక్తంగా మంత్రాలు చదివి ఆశీస్సులు ఇచ్చాడు.

తిరుపతి హుండీ అవసరం లేకుండానే పుణ్యం సరాసరి వచ్చి తలనుంచి పాదాల వరకూ తడిపేయడం ప్రఫుల్లని ఉక్కిరిబిక్కిరి చేసింది.

తిరిగితిరిగి చూసుకుంటూ దండాలు పెట్టుకుంటూ కృతజ్ఞతతో వంగిపోతూ వెళ్ళిపోయారు వాళ్ళు.

సైట్లో అందరూ సంతోష్ చుట్టూ వినయంగా చేరారు. కొడుకుని మురిపెంగా చూసుకుంటున్నాడు ప్రఫుల్ల.

సంతోష్, వంటతని చేతికి ఐదువేలు ఇస్తూ "లేబర్‌కి సారాపాకెట్లు తెప్పించు, మాంచి ఘాటుగా వంజిరం పులుసు పెట్టు, దెబ్బకి క్వార్టర్స్‌లో దెయ్యాలు పారిపోవాల" నవ్వుతూ అన్నాడు. కొడుకుమాటలకి నవ్వుకుంటూ అతని భుజంచుట్టూ చెయ్యేసి తలూపాడు ప్రఫుల్ల.

అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

దండాని మాత్రం చెట్టుకిందనుంచి లేవకుండా "అన్నియ్యా నన్ను చమించు, నీకు అన్నాలం సేసినాను నన్ను చమించు" దేవులాడుతూనే ఉన్నాడు.

88850 16788


ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఈవారం కథ



• చాగంటి ప్రసాద్

# చేదుకట్టు



కొత్తగా పనిలో చేరిన సావిత్రి మాటతీరు చూసిన రేవతి ''దీనికి ఎంత తెలివో?'' బుగ్గలు నొక్కుకుంటూ ఆశ్చర్యపోయింది. ఆమె తెలివైన మాటల వెనుక జీవితాన్ని తీర్చిదిద్దుకునే ధ్యాస తప్ప మరో ఆలోచన కనబడలేదు రేవతికి. పనిలో చలాకీతనం, శ్రద్ధ చూసి ముచ్చట వేసింది. కోనసీమలో ఒక పల్లెటూరు నుండి హైదరాబాద్ అపార్టుమెంటు కాపలాపనికి మొగుడు సూరిబాబుని తీసుకుని రావడమే తరవాయి, ఫ్లాట్స్ అన్నీ తిరిగి తనని పనిలో పెట్టుకొమ్మని కోరింది సావిత్రి.

అశోకా పౌడర్ ముఖానికి రాసుకుని, ముప్పేట కొబ్బరికాయలా ఉన్న తలకు కొబ్బరినూనె పాముకుని, తలలో మందార పువ్వు పెట్టుకుని, నుదుట సన్నని తిలకం దిద్దుకుని, పొట్టిగా, సన్నగా, శుభ్రంగా ఉన్న సావిత్రి మొదటి చూపులోనే నచ్చేసింది రేవతికి.

''చక్కని గాలి, బోల్డు నీళ్ళు, పచ్చని వరిచేలతో కోనసీమ బావుంటుంది కదే అక్కడే సుఖంగా ఉండక, సామాన్యుడు బతకలేని ఈ మహానగరానికి ఎందుకు వచ్చావు?'' అడిగింది ఆరాగా.

''మా వూళ్ళో పనులేం ఉండడం లేదమ్మా. ఈ మధ్య పొలం పనులు కూడా బాగా తగ్గిపోయాయి. సేలన్నీ రొయ్యల సెరువులవడంతో సానా కట్టంగా ఉంది పని దొరకడం. దానికి తోడు మా వోడు బద్ధకస్తుడు, అన్నీ ఒళ్ళోకి వచ్చి వాలాలనుకుంటాడు. మగాడని గోరోజనం. మా వూళ్ళో ఉంటే కట్టబడి కూడబెట్టిన డబ్బులతో తాగడం తిరగడం తప్ప, పిల్లల ఆలనా పాలనా సూడడం లేదు. దొరికిన ఈ కాపలా పనైనా జాగ్రత్తగా సేసుకోమని బతిమాలి ఇక్కడకు లాక్కొచ్చాను, పిల్లల్ని కూడా సక్కని బళ్ళో ఎయ్యొచ్చు కదమ్మా,'' మంచి భవిష్యత్తు ఊహిస్తూ చెప్పింది.

''అమ్మా! సెల్లి కొడతందే'' అంటూ కీచులాడుకొంటూ ఏడుస్తున్న పిల్లల చేతుల్లో బిస్కెట్లు పెట్టి ఊరుకోబెట్టింది రేవతి. సావిత్రి రాకతో రేవతికి ఇంటి పని చాలా తగ్గింది. రోజూ రేవతి ఆ చిరు కుటుంబం కోసం తమతో పాటే కాసిని బియ్యం పోసి అన్నంతో పాటు కాస్త కూర, పచ్చడి లాంటివి ఇవ్వడంతో, రేవతి పట్ల సావిత్రి మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

•••

అపార్ట్‌మెంట్‌లో పనులన్నీ అయిపోయాక, విశ్రాంతి తీసుకోకుండా ఏదో పని చేసి డబ్బులు సంపాదించడం అలవాటుగా మారింది సావిత్రికి. ''వయసున్నప్పుడే ఒళ్ళొంచి పనిచెయ్యాలి, నాలుగు డబ్బులు కూడబెట్టుకోవాలే సాయిత్రి!''.. అమ్మ రాజేశ్వరి మాటలు ఆమె మస్తిష్కంలో ఇంకా సజీవంగా ఉన్నాయి.

సావిత్రి పుట్టుక ఒక విషాదం. రాజేశ్వరి వయసులో ఉన్నప్పుడు ఆమె ఎంతగానో నమ్మిన మగాడు మోజు తీరిపోయాక తల్లినీ, పసిగుడ్డుగా ఉన్న సావిత్రినీ వదిలేసి వెళ్ళిపోయాడు. ఊళ్ళో బంధువులు ఎన్ని సూటిపోటి మాటలన్నా, కన్నకూతుర్ని ఎంతో ధైర్యంతో పెంచిన తన తల్లి మనోబలమే సావిత్రికి ఆమె నుంచి వచ్చిన ఆస్తి. తన కంటే పెద్దదైన కూతురున్న వాడిని మారుమనువాడింది తల్లి. పెంపుడు తండ్రి ప్రేమ పొందకపోయినా, సవతి అక్క, బావ ఆమెను బానే చూసుకోవడం కాస్త ఊరట.

ఇద్దరు కూతుళ్ళకు ఏదో రకంగా సాయపడవచ్చని, వాళ్లకు భారం కాకూడదని నడి వయస్సులో 'కొయిటా' వెళ్ళిన తల్లి మరికాస్త ఆలంబన సావిత్రికి. ఇళ్ళల్లో పనులన్నీ గబా గబా అవగొట్టుకుని, చాప పరుచుకుని, జనుముతో తయారుచేసిన పేపర్లతో వంద కవర్లు పూర్తి అయ్యాక వాటిని ఎండలో ఆరబెట్టి, గదిలోకి వెళ్లి గోధుమ పిండి, పెనం, స్టవ్వు, గిన్నెలు సర్దుకుంది. సాయంత్రం నాలుగు గంటలు అయ్యింది. ఇంతలో స్కూల్ నుంచి పిల్లలు రావడంతో వాళ్ళకు స్నానాలు చేయిస్తాడేమోనని ఆశతో సూరిబాబు కేసి చూసింది. బయట కుర్చీలో దర్జాగా కూర్చుని ఆమెకేసి తల కూడా తిప్పకుండా మొబైల్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుకుంటూ కూర్చొన్నాడు.


''పిల్లల్ని దగ్గరకు తీసుకుని, తానం సేయిద్దారని కూడా లేదు'' ఉసూరుమంటూ, వాళ్ళకి నీళ్ళు పోసి, ఉతికిన బట్టలు వేసి, చేతుల్లో చిరుతిళ్ళు పెట్టింది. కాస్త చీకటి పడగానే, గోధుమపిండి, సామాన్లు, సంచిలో పెట్టుకుని కాలనీలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్దకు బయలుదేరడానికి సిద్ధం అయ్యింది. ఆమె వైపు తల కూడా తిప్పకుండా మొబైల్ చూసుకుంటున్న మొగుడిని చూడగానే ఆమెకు చిర్రెత్తుకొచ్చింది.

''ఎప్పుడు సూసినా పోనట్టుకుని ఆడుకోడమేనా, కొంత సాయం సెయ్యలేవా'' అతని చేతిలో ఫోన్ లాక్కోడానికి ప్రయత్నం చేసింది. ఆమెని పక్కకు తోసేసి, ''ఉండేహె ఆట మంచి రంజుగా ఉంది, నీ పని నువ్వు సూసుకో, మద్దెలో అడ్డం రాకు! ఎన్నాళ్ళు ఈ సిన్నా సితకా పనులు సేత్తాం డబ్బుల కోసం? కొట్టేదేదో గట్టిగా కొట్టాలి'' అంటూ బెట్టింగ్ గేమ్స్‌లో దూరిపోయాడు. ఉసూరుమంటూ సంచీని మోసుకుని వెళ్లి, నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఒక పక్కగా సామాను చేర్చి గోధుమ రొట్టెలు కాల్చి అమ్మడం మొదలుపెట్టింది. అలా రాత్రి తొమ్మిది వరకూ అమ్ముకుంది. ఇంతలో సూరిబాబు నుంచి ఫోన్ రాగానే, ''అయిపోయింది వత్తన్నా!'' అంటూ అన్నీ సర్దుకుని ఇంటికి బయలుదేరింది.

తనకున్న చిన్నపాటి తెలివితో, చిరు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



సంపాదనకి చిన్న చిన్న మార్గాలు వెతకడం, ఎంత చిన్న ఆలోచన వచ్చినా దాన్ని అమలుపరచడం నిరంతరం చేసేదామే. పండగలు వస్తే వినాయక చవితికి మట్టి వినాయక బొమ్మలు, దీపావళికి మతాబులు చేసి అమ్ముకునేది.

●●●

ఒకరోజు ఆమె చేసిన కవర్లు తీసుకువెళ్ళడానికి వచ్చినతను, ''సాయిత్రి! మా సేటుకి యాపారం మంచిగ లేదుట, ఆయన దుకాన్ బంద్ జేస్తుండు, ఇంగ కవర్లు వద్దుట, నీకివ్వలసిన పైసల్ తీసుకో''.. చేతిలో పెట్టి స్కూటర్ మీద వెళ్ళిపోయాడు.

హఠాత్తుగా ఆధరువు పోవడం ఆమె చిన్న జీవితానికి తగిలిన పెద్ద దెబ్బ. దాన్ని తట్టుకునే లోపు మరో దెబ్బ ఆమె జీవనానికి మరింత గట్టిగా తగిలింది. రోడ్డుపక్కన రొట్టెలు అమ్ముకునే ప్రదేశంలో కంకర గుట్టలు పోసేశారు. అక్కడ ఆకాశ హర్మ్యం నిర్మాణం మొదలైంది. ఆమె ఆశల భవంతి కూలిపోయింది. ఎక్కడైనా ఖాళీ ఉన్న చోటు దొరికితే, అమ్ముకుందామని తిరిగి తిరిగి ఎక్కడా దొరక్క, దిగాలుగా ఇంటికి తిరిగి వచ్చింది. సూరిబాబు ఆమెను చూసి, ''అప్పుడే వచ్చేశావే, ఎంత గిరాకి అయ్యింది ఇయ్యాల'' వెటకారంగా అన్నాడు నవ్వుతూ. రోడ్డు మీద కంకర పోశారనే విషయం తెలిసి కూడా చెప్పలేదని, కోపంగా చూసింది అతనికేసి. అతను నిర్లక్ష్యంగా తల విసిరి, కంచంలో అన్నం కలుపుకుంటూ, పక్కనున్న మొబైల్ చూసుకుంటున్నాడు. నిద్రపోతున్న పిల్లల్ని లేపి, అన్నాలు పెట్టే పనిలో పడింది సావిత్రి.

మర్నాడు ఉదయం అన్యమనస్కంగా పనిచేస్తున్న సావిత్రిని గమనించిన రేవతి, ''ఏంటే ఇవ్వాళ నీరసంగా ఉన్నావు? టీ తాగుతావా?'' అడిగింది. చేస్తున్న రెండు పనుల ప్రవాహానికి గండి పడిందని నిరాశగా చెప్పింది.

''అయ్యో! బాధపడకు. నువ్వు తెలివైనదానివి, వేరే ఏదైనా దొరుకుతుందిలే, కష్టించి పని చేసేవాళ్ళకు ఏదో కొత్త దారి దొరుకుతూనే ఉంటుందిలే'' ఓదార్చింది.

ఖాళీగా ఉండడం అంటే సావిత్రికి భయం. తమ ఊళ్ళో ఏ పనీ చేయకుండా కాళ్ళ దాకా వచ్చింది, నోటి దాకా రాకుండా పోతుందా అనే ధీమాతో బతికేస్తూండే చాలామందిని చూస్తే చాలా భయం. కాళ్ళదాకా వచ్చేది హఠాత్తుగా ఆగిపోతే భవిష్యత్తులో ఎలా జీవించాలో అనే భీతి లేకుండా బ్రతికేవాళ్ళని చూస్తే మరీ భయం. భర్తను చూశాక, ఆ భయం మరీ ఎక్కువైంది. అతని సోమరితనం, జీవితం పట్ల నిర్లక్ష్యం చూసి, అతనంటే అసహ్యం మరింత పెరిగింది. ఎవ్వరిమీద ఆధారపడకుండా, తన కష్టాన్ని నమ్ముకుని పైకి రావాలనే తపన ఆమెను మరిన్ని కొత్త ఆలోచనలకు పురికొల్పుతూ ఉంటుంది.

●●●

ధనుర్మాసం వచ్చింది. కాలనీలో ఉండే వెంకటేశ్వరస్వామి గుడిలో తిరుప్పావై వైభవంగా జరుగుతోంది. గుడి ప్రాంగణంలో ప్రవచనం వినడానికి రేవతి సావిత్రిని కూడా తీసుకుని వెళ్ళింది. ప్రవచనకర్త చెప్పిన ఆధ్యాత్మిక విషయాలు సావిత్రికి అర్థం కాలేదు. కానీ ఆయన చెప్తున్న ఉపన్యాసంలో జీవితాన్ని ఎలా సరిదిద్దుకోవాలో, కష్టాలని ఎలా అధిగమించాలో, ఎలా పోరాడాలో చెప్పడం మాత్రం ఆమెకు బాగా నచ్చింది. ఇంతలో ఆయన ధనుర్మాసం అంతరార్థం చెప్తూ, రాబోయే పండుగలు చాలా విశిష్టమైనవని, ఇంటి ముందు ముగ్గులు వెయ్యడం శరీరానికి మంచి వ్యాయామం అని, ఆవు పేడతో గొబ్బెమ్మలు పెట్టడం వలన లక్ష్మీదేవి ఇంటిలో కొలువై ఉంటుంది అని భక్తిని మేళవించి చెప్పడం వలన ఆ కాలనీ వాసుల బుర్రలోకి ఆయన వాక్కులు బాగా ఎక్కాయి. కాలనీ వాసులలో పెళ్లి కాని అమ్మాయిలకు ముగ్గుల పోటీ పెట్టాలనే ఆలోచన మహిళా కార్పొరేటర్ బుర్రలో మొలకెత్తింది. ఆ వార్త విన్న సావిత్రి బుర్రలో రెండు కొత్త ఐడియాలు పురుడు పోసుకున్నాయి. కాలనీలో ఇంటింటికీ వెళ్లి, తనకు ముగ్గులు వేయడం బాగా వచ్చని, ముగ్గు చేతకాని ఆడపిల్లలకు నేర్పి కొన్ని డబ్బులు సంపాదించింది. అలాగే గుడి పక్క గోశాలకు వెళ్లి ఆవు పేడ తెచ్చుకుని, గొబ్బెమ్మలు చేసి, అందంగా బంతి పూలు అమర్చి అమ్మింది. కనుమ పండుగ నాడు ముగ్గుల పోటీలో బహుమతి వచ్చిన అమ్మాయి, సావిత్రి కష్టానికి జాలిపడి, తనకి వచ్చిన క్యాష్ బహుమతిలో కొంత ఇచ్చేసింది. ఆ డబ్బులు కూతురి భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని బ్యాంకులో డిపాజిట్ వేసింది. ఆ విషయం తెలిసిన రేవతి సావిత్రిని అభినందిస్తూ, ''చూశావా సావిత్రీ! దేనికీ నిస్పృహ చెందకుండా కాస్త ఆలోచిస్తే ఇలాంటి పనులు సంవత్సరమంతా ఏవో ఒకటి దొరుకుతూనే ఉంటాయి'' అంది రేవతి.

''అవును అమ్మగారు!'' ఆనందం వ్యక్తపరచింది. ఇలాగే డబ్బులు సంపాదిస్తున్న సావిత్రి ముందు ముందు తనని లెక్కచేయదేమోననే అనుమానం జెర్రిగొడ్డులా సూరిబాబు మనసులో ప్రవేశించింది.

●●●

వేసవికాలంలో అక్క, బావలతో కలిసి తిరుపతి మొక్కు తీర్చుకుందామని వెళ్ళింది సావిత్రి. తిరుపతి నుంచి సావిత్రి తిరిగి రాగానే, సూరిబాబు, ''మా యమ్మకి సానా తేడా సేసిందంట, మనం కొన్ని రోజులు అక్కడే ఉండాలి'' స్వంతవూరికి బయలుదేరదీశాడు.



అ లా గా!

ప్రపంచంలోని అత్యంత సుదీర్ఘ యుద్ధం దాదాపు 335 ఏళ్ల పాటు జరిగింది. నెదర్లాండ్స్‌కు సిలీ ద్వీపసమూహానికి నడుమ జరిగిన ఈ యుద్ధం 1651 సంవత్సరంలో మొదలై 1986లో శాంతియుతంగా ముగిసింది. ఇది అత్యంత సుదీర్ఘ యుద్ధం మాత్రమే కాదు, అత్యంత శాంతియుతమైన యుద్ధం కూడా! ఈ యుద్ధంలో ఇరుపక్షాలూ పరస్పర కాల్పులు జరుపుకోలేదు. ఇరుపక్షాల్లోనూ ఎవ్వరూ మరణించలేదు.

అత్తకి సుస్తీ అన్నది అబద్ధం, అతనికి పనిచేయడం ఇష్టం లేదు అన్నది నిజమని తెలుసుకున్న సావిత్రి అతన్ని నిలదీస్తే, ఆమె కంఠ శోష గోదావరి రైలు వంతెన ఘోషలో కలిసిపోయింది. సావిత్రి కష్టపడి కూడబెట్టిన డబ్బులన్నీ సూరిబాబు చేతిలో పడి బెట్టింగ్ పాలైపోయాయి. సావిత్రికి గుండె మండిపోయింది.

గట్టిగా నిలదీస్తే, ''దర్జాగా హైద్రాబాద్ లో తిరుగుదారని అనుకుంటున్నావేమో! మనతో కుదరదు, సిటీ ఓళ్ళ మాటలు బాగా సెవికెక్కి నన్ను పట్టించుకోవడమే మానేహావు'' అంటూ ప్రతీరోజూ మాటలతో మానసికంగా హింసించేవాడు. పెల్లుబుకుతున్న కన్నీటి గోదారిని అదుపుచేసుకుంటూ ..

'నానేం తప్పు సెయ్యలేదే, నానెందుకు ఏడవాలి? సదువు సంజలులేని మొరటోడు, జీవితం ఇలువ తెలియని సన్నాసి ఆడేదో అన్నాడని ఏడవడం ఏంటి? నాను సావిత్రి! ఐదో కలాసు. ఆడు నిసానీ గాడు' మనసుకు నచ్చ చెప్పుకుంది. అలా అనుకోవడమే తడవుగా గుండెల్లో కలిగిన బాధ మటుమాయం అయ్యింది. గబ గబా అన్నం వండి పిల్లలకి పెట్టి, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, కొబ్బరిచెట్టు కింద నులకమంచం వాల్చుకుని, పక్కలో పిల్లల్ని వేసుకుని ఆలోచిస్తూ నడుం వాల్చింది. కొబ్బరి ఆకుల మీద నుంచి ఆమెపై పడుతున్న కొబ్బరి పువ్వుల్లా ఆలోచనలకు రూపం వచ్చి ఒక్కటి ఒక్కటీ ఆమె ముందు సాక్షాత్కారిస్తున్నాయి.

'అవును ఆ పని చేస్తాను, కొబ్బరిసెట్టులా నిబ్బరంగా నిలబడతాను' మనస్సుకి ధైర్యం చెప్పుకుని, నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది.

మధ్యరాత్రి వేళ హఠాత్తుగా వచ్చిన అంతు తెలియని కడుపు నొప్పి తీవ్రమై సొమ్మసిల్లి పడిపోయింది. ఆసుపత్రిలో జాయిన్ చేశారు సావిత్రి అక్క, బావ. చేతిలో ఒక్క పైసా కూడా లేని సూరిబాబు చేతులు నలుపుకుంటూ బయట కూర్చున్నాడు. జీవితంలో ఎంతో పైకి ఎదుగుదామనుకున్న సావిత్రికి, ఆమె కడుపులోని చేదుకట్టుకి వచ్చిన రోగం యముడిలా ఆమె ఆశలకు అడ్డుకట్టు వేసింది. ఆపరేషన్ చేసి చేదుకట్టు తొలగిస్తే గాని బతకదని డాక్టర్ చెప్పాడు. చావు బతుకుల మధ్య ఊగిసలాడుతోంది సావిత్రి.

సావిత్రి ఎందుకు తిరిగి రాలేదో కనుక్కోవడానికి రేవతి ఫోన్ చేసింది. సావిత్రి బావ ఫోన్ ఎత్తి, ''సావిత్రికి సానా తేడా సేసింది ఆపరేసన్ సేసి సేదుకట్టు తీసేశారు'' అన్నాడు. ''చేదుకట్టు అంటే'' అడిగింది ? అదేనమ్మ గాల్... గాల్ అని తడుముకుంటుంటే, గాల్ బ్లేడరా ? ''అవునమ్మా అదే'' అన్నాడు. చాలా బాధపడింది రేవతి. కొంత డబ్బు పంపించింది.

శల్యం మీద కోత వలన పార్వతి చిక్కి శల్యమయ్యింది. బలం పుంజుకొని తన పని తాను చేసుకోవడానికి మూడు నెలలు పట్టింది. రోజు రోజుకి ఇంట్లో పరిస్థితులు దిగజారుతున్నాయి. దాచిన డబ్బులన్నీ అనారోగ్యానికి, ఇల్లు గడవడానికి ఖర్చు అయిపోయాయి. తల్లి, బావ చాలారోజులు సాయం చేసి, ఇంక మీ బాధలు ఏవో మీరే పడండని వదిలేసారు. పిల్లలకి కడుపునిండా అన్నం పెట్టలేకపోతోంది. అయినా సూరిబాబు ధోరణి మారలేదు. కష్టమైన పనైనా, కొబ్బరి వలుపు తీసే కొట్లో చేరింది. రోజంతా పని ఉండడం వలన శరీరం కష్టపడుతున్నా, మనసు మటుకు హాయిగా ఉంది. పనంతా చక్కబెట్టి, ఇంటికి వచ్చి పెరట్లో బట్టలు ఆరేస్తూ ఆలోచనలో పడింది. ఇంతలో ఇంటి గోడను వొరుసుకుంటూ వడివడిగా ప్రవహిస్తూ వెడుతున్న గోదావరిలో పయనిస్తున్న పడవను చూశాకా, రేవతి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. 'నది ప్రయాణంలో నావకు తగులుతున్న నీటి దెబ్బలను, ఒడిదుడుకులు చూస్తే అవతలి ఒడ్డుకి చేరగలదా అని మొదట కంగారు పడతాం. కానీ అది చేరుకున్నాక, ఇంతేనా అనిపిస్తుంది. జీవితం కూడా అంతే!' ఆ మాటలు తలుచుకోగానే ఉత్సాహం వచ్చింది. మెదడులో మరో కొత్త ఆలోచన ఉదయించింది.

• • •

నిన్ను ఈ స్థాయిలో చూస్తుంటే చాలా గర్వంగా ఉందే సావిత్రి! అంటూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది రేవతి.

''ఆ రోజు మీరన్న మాటలే నన్ను కష్టంలో కూడా ధైర్యంగా నిలబడమని సెప్పేయమ్మా! లోకంలో పనికిరాని వస్తువంటూ ఏదీ లేదు, ప్రతీది మనకి ఉపయోగ పడేదే అని గుడిలో ఆ రోజు గురువుగారు సెప్పిన మాటలు నన్ను ఈ యాపారం సెయ్యమని సెప్పినట్టు అనిపించి ధైర్యంగా దిగిపోయాను.'' అంది వినయంగా...

''అది సర్లే గానీ, కొబ్బరి పెంకులతో, పీచుతో చేసిన బొమ్మలు, గ్రామీణ ఉత్పత్తుల మార్కెటింగ్ మటుకు భలే కొత్త తరహాలో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాంలో నీ పిల్లలతో చేయిస్తున్నావు చూడూ! అదీ నీ తెలివి. భలేగా ఉందే నీ ఐడియా'' అంటూ అభినందించింది రేవతి.

''మీరు ఇచ్చిన పాత ఫోన్‌లో అయన్నీ నేర్చుకున్నాను అమ్మా'' చెప్పింది వినయంగా.

ఇంతలో శిల్పారామం దర్శించడానికి వచ్చిన వాళ్ళు సావిత్రి, పిల్లలను గుర్తుపట్టి ఫొటోలు తీయించుకుంటున్నారు.

''నాకు కూడా ఒక సెల్ఫీ ఇవ్వవే నువ్వు ఇంకా పైకి ఎదిగిపోతే మాకు దొరకవు కూడానూ'' నవ్వుతూ అంది రేవతి .

''అయ్యో అమ్మగారు! మిమ్మల్ని మర్చిపోవడమా, ధైర్యంగా బతకడం ఎలాగో నేర్పినది మీరే.'' అంటూ ఇద్దరినీ ఫ్రేములోకి బిగించి క్లిక్‌మనిపించింది. సావిత్రి మొహంలో చిరుగర్వం, ఆత్మవిశ్వాసం.. ఎదురుదెబ్బలెన్ని తగిలినా, గండాలు వచ్చినా స్థిరంగా తన కాళ్ల మీద నిలబడగలిగాననే చిరుగర్వం! రేవతి మొహంలో సంతృప్తి... తన కళ్లెదుటే మారాకు తొడిగిన మొక్క, మహావృక్షంగా ఎదిగిన క్రమంలో తాను కూడా కొంత చేదోడు కాగలిగాననే సంతృప్తి! ఆ ఆనందసమయంలో సూరిబాబు గురించి అడగలేకపోయింది రేవతి.

పని చేయలేని అశక్తుడితో, చేతకానివాడితో సర్దుకుపోవచ్చు. పని చేయదలచుకోని వాడితో ఎంతకాలం సర్దుకుపోగలం?

బాధ్యత తెలియని వాడితో సర్దుకుపోవచ్చు బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూసేవాడితో ఎలా సర్దుకుపోవడం?

సుఖపడేవాళ్లను చూసి ఓర్వలేని వాడి నైచ్యం అర్థం చేసుకోవచ్చు. కానీ కష్టపడేవాళ్లని చూసి కూడా ఓర్వలేని వాడిని ఎలా సహించడం? ఆస్పత్రి పాల్జేసి మంచం పట్టించి అనారోగ్యం సావిత్రికి ఓ బతుకుపాఠం నేర్పింది చేదుకట్టు దేహానికి అవసరమే! అది ఎందుకూ కొరగాకుండా పోయినప్పుడు, ఉపేక్ష కూడా కూడా ప్రమాదమే... కత్తిరించి తీసేయడమే దేహానికి రక్ష! బతికినంత కాలమూ కొన్ని జాగ్రత్తలు తప్పవు. నిజమే, తాళికట్టిన పెనిమిటి జీవితానికి అవసరమే. కాని, ఒక నిర్ణయానికి వచ్చింది సావిత్రి. సావిత్రి చేసింది తప్పో ఒప్పో ఎవరు చెప్పగలరు? ఆమె అనుభవించిన ఆనందమైనా, బాధైనా ఆమె స్వంతం కదా మరి

## కథాకళి

FEED ME A STORY

**26.7.2026 ఫన్‌డేలో ప్రచురించిన 'తైలవర్ణ చిత్రం' కథకి పాఠకులు సూచించిన టాప్ 5 పేర్లు.**

తైలమర్మచిత్రం
అనూరాధ సింగారెడ్డి

పరచిత్ర ప్రవేశం
టి.సూర్యకుమారి, హైదరాబాద్

వశీకరణ చిత్రం
వి.ఎస్.ఆర్.పాముగారి, అనంతపురం

బొమ్మను గీసి ప్రాణం తీసి
ఆదిత్య జానకి, ఆస్ట్రేలియా

చంపావతి
గుడిబండ రవి, వెనిగండ్ల

కథ

# సెల్లు సిత్రం

అశోక్ పోతరాజు



ఇంటి ముంగట మంది బగ్గనే జమైంద్రు.

''అయ్యో మల్లేషా! మా ఇంటి కన్న ఒచ్చి ఒక ముచ్చటైన జెప్పక పాయే! ఎంత పని జేసిండు. ఇప్పుడు వాని పెండ్లాం పిల్లలు ఆగమైద్రు!'' అని కొంగు మూతికాడవెట్టి, ఒక్క తీర్గ దుఃఖం ఎల్లవోస్తున్నది రామక్క.

మల్లేష్ పెండ్లాం పద్మ సుట్టూర కూసోని వాడ కట్టోళ్లంత గూడి శోకాలు వెడుతాద్రు.

''ఔనే పద్దీ! ఏమైందే.. పగటీలి ఏ సప్పుడు లేకుండే! మంచిగనే ఉంటిరి గదనే? రాత్రి ఏమనుకున్నరే.. పానం తీస్కునేంత కట్టమేమచ్చిందే.. శెప్పవేమే'' అని అడుగుతున్నది రామక్క.

ఆమె ప్రశ్నలకు జవాబిస్తలేదు. లోపటున్నది బైటవెడ్తలేదు. అండ్లదండ్లనే కుమిలి గోడకు ఒరిగి.. మొగన్ని, అత్తను దీనంగ సూత్తున్నది పద్మ.

''ఓ తమ్మీ.. నా తమ్మీ! నువ్వెంత పని జేస్తివిరా.. నా అయ్యా!'' అనీ గట్టిగ ఒర్లుత.. రొండు శేతులు చాతి మీద గుద్దుకుంట.. మల్లిగాని మీదొచ్చి పడ్డడు పెద్దబాపు కొడుకు సాయన్న. అది జూసిన తన భార్య ఒక్కసారిగా దీర్ఘం తీసింది. ఆడునోళ్లకు దుఃఖం ఆగుతలేదు. అందరు ఏడుపు మొదలువెట్టిద్రు. జెరాగి సాయన్న లేసి..

''ఓరి పోడా రాజు! ఇంటెన్క గడ్డాములకెల్లి మోపెడంత గడ్డి తేపో! కాకను కిందేసిద్రు. గాయింత సోయి లేదారా!'' అనే..

ఆ పోరడు పోయి మోపెడంత ఎందుకని సందెడంత గడ్డి పట్కచ్చిండు. ఇంట్లకెల్లి పీటె తెచ్చి, దాని మీద గడ్డేసి పండేశిద్రు. తలాపున గాంచునూనె దీపం, ఆగరుబత్తీలు. నొష్టికి ఇంత కుంక్మ, ఒక రూపాయి సిక్కతో.. శెవాన్ని సింగారిచ్చి ఆకిట్ల ఒక బాదుకు అగ్గి రాజేసిద్రు..

''రాజు.. గా శివన్నకు ఫోన్ జేసి టెంటు, కుర్చీలు తీస్కరాపో!'' అనే సాయన్న.

నిమిషాల్ల తెచ్చి ఏశిద్రు. పెద్ద మనుషులు కూసున్నరు. దోస్తులకు ముచ్చట తెల్సి వస్తున్నరు. అటెన్క గీ కార్యం సుట్టపోల్ల శెవినెయ్యాలే! తల్లిగారికి మొదాలు జెప్పాలె! ఇగ గా పని మీదున్రు. ఎవలికి తోశినోల్లు వాళ్ల బంధుబల్గానికి పోన్లు కొడుతున్నరు. బిరాన్నే చేరుతాంది మత్లావ్.. ఎన్కటి దినాలు గావాయే! ఇంట్ల ఎవలన్న కాలంజేత్తె మొదాలు ఇంటికాపుతోని ఊర్ల పొంటి వార్త చెప్పి పంపేది. ఆ రోజులు ఇప్పుడు యాడున్నయ్!? ఫోన్లనే సెకండ్ల మీద ఊర్లు, దేశాలు దాటి పోతున్నయ్..

శింటు వాకిట్ల పండుకున్న తండ్రిని చూసి లోపటనే బెక్కున పల్గుతున్నడు. పద్మ వాన్ని దగ్గరికి తీస్కోని ఏడుస్తున్నది. ఆడునోళ్లకు వాళ్ల గోస సూడ వశమైతలేదు.

మందిల రాజంతాత గంగదరి పటేల్‌తోని..

''ఏ.. పోరడు ఏమంత పెద్దోడు గాదు. శిన్న




ఈడే! పదో తరగతి సదివిండు. శిన్నప్పటి సంది ఒక్కడే కొడుకాని పాయిరంగ పెంచి బగ్గ లాడుజేసిన్రు కనీ.. వీడు ఇట్ల జేస్తడని ఎవలనుకుంటరే? సంసారం అన్నంక శిన్న శిన్న జౌడాలు ఐతనే ఉంటయ్! అందరిండ్లల జరిగేటియే! ఈల్లేమన్న మీదికెల్లి ఊశి పడ్డారా? ఇంటింటికి మట్టి పొయ్యే ఉంటది. బంగారు పొయ్యి ఉండది. గాయింత దానికే గిట్ల జేసుకుంటరా? ఊరేమన్న గొడ్డువోయిందా!? నలుగురిని కూసుండవెట్టి మెప్పిచ్చేదుండే! లంగెవలో దొంగెవలో తేలుతుండే! ఉత్తపున్నానికే పానం దీసుకుంటారు!? ఐనా.. ఇప్పటి పోరలే ఇట్ల జమైండ్రు. అయ్యవ్వల ఖదర్ల లేక ఇట్ల జేస్కొని ఇంకో నలుగురికి నేర్పుతాండ్రు. వీని పనికినవారేతు..'' అని అంటున్నడు.

ఇది జరగడానికి కొన్ని రోజుల ముందు ముచ్చట..

* * *

మబ్బుల ఐదుగొట్టంగ లేసి..

''అవ్వా! నేను బాయికాడికి పోతున్న. ఇయ్యాల మిరపచెట్లకు మందు కొట్టాలె! పొద్దంత ఆడనే పనుంటది. శింటుగాన్ని బడికి పంపి దాన్ని తోల్కోని ఇంత సద్ది పట్కరాయే!'' అనీ బాయిబాట వట్టిండు మల్లేష్.

వాకిట్ల సాన్పి జల్లుతున్న తల్లి ఏదో అనబోయింది. అది వినబడనట్టు వాడు శీకట్ల కలిసిపోయిండు. ఇగ వీనికి చెప్పినా లాభం లేదనీ ఆ లోటల పెండనీళ్లను లక్కోద్ది వాకిలికేసి సరుస్తున్నది.

మొక్కంగ పుట్టిండు ఒక్కగానొక్క కొడుకానీ.. గావురంగ పెంచి, పెద్ద జేస్తే.. నడిమంత్రాన అయ్యవోయిండు. గంజో గాసమో తాగి కడుపు కట్టుకొని ఇంతటోన్ని జేసిందామె.

ఇగ వీని పెండ్లాం పేరు పద్మ. మ్యాన మరదల్నే లగ్గం చేసుకున్నడు. ఇంటర్ సదివింది. మా ఉషారున్నది కనీ.. దానికి సెల్లు సోకెక్కువ. ఎప్పుడూ అండ్లనే దాని పానమంత. ఫొటోలు దిగాలే, రీల్స్ చెయ్యాలే.. సోషల్ మీడియాల పెట్టాలే! పెండ్లయినంక మారుతదని అన్నరు కనీ.. గా సోకు ఇంకా ఎక్కువ అయింది. ఆ రీల్స్ చూసి సుట్టాలు, వాడకట్టోళ్లు అట్ల చేయొద్దని చెప్పిన్రు. అయినా వాళ్ల మాటలు పట్టించుకోలేదు. దాని సోకు దానిదే! మ్యాన మరదలేననీ వీడు కూడా అంతగా పట్టించుకోలే! దాని కడుపుల కాయగాస్తే.. అదే సంసారం రోకుల పడ్డదని అనుకున్నడు. లగ్గమైన యాడాదికే కొడుకు పుట్టిండు. అయినా ఫోన్ చూసుడు ఇంకా ఎక్కువనే అయింది. అంబటాళ్ల దాక పన్నపక్కలకెల్లి లేసేది కాదు. గంతకు దగ్గ బొంతోలే దాపురించిందని అత్త బాధ.

తెల్లారంగ వాడకట్టుల సర్రు సుర్రుమని శీపుర్ల సప్పుడు, కోడి కూతలు, పసుల అరుపులు, రాముల గుడి కాడి మైకు సెట్ల కలిసి.. ఊరంతా నిద్ర లేస్తున్నది. సాన్పి సల్లుడు అయింది. ఇంట్ల బోల్లు, ముంతల సదిరే సప్పుడుకు పోరడు బొంత నిండా కప్పుకొని తల్లి పక్కలకు జారిండు.

''పొద్దు పొడుపొస్తాంటే మీకు నిద్రెట్ల వడుతుందే! పక్కబొక్కలు నొస్తలెవ్వా!? మీ నిద్రకగ్గిదల్ల.. లెవ్వరేందే!?''

ఆ గున్నుడుకు పద్మ లేసి, అత్తను కోపంగ చూసి.. పక్కనున్న సెల్లు తీస్కోని ఆరోజు ఏం స్టేటస్ పెట్టాలని రీల్స్ సెలెక్ట్ చేస్తున్నది. ఆ పాటల సప్పుడుకు పోరడు లేసి, తల్లి చేతిల ఉన్న సెల్లు వెలుగులనే సూర్యోదయం చూసిండు..

''అమ్మా! బాయిల బల్లి పాట పెట్టు! నిన్న చేసినవ్ కద.. పొట్టు పొట్టు లైకులొస్తయే!'' అనే ముసి ముసిగ.

''ఆ.. సరేరా!'' అని అదే పోస్టు చేసింది.

''నా కొడుకు రాత్రింబగలు కష్టపడి పెయి పుండుజేస్కొని, బురుద బుక్కి పొర్లాడుతుంటె.. మీరేమో గీ పోర్ల తైతక్కలాడుతున్నారు?''

ఆమె మాటలు వినిపించనట్లే.. బైటకెల్లి బనుకు మీద కుసోని రీల్స్ చూస్తున్నరు ఇద్దరూ..!

ఆమె బోల్లు తెచ్చి జాలట్లేసి, చెంబు తీసుకుని బైటికి నడిచింది. పద్మ ఫోను పోరనికిచ్చి జాలట్లకు పోయింది. తర్వాత వాకిట్ల ముగ్గేస్తూ.. మాటి మాటికీ పోరని చేతిల ఫోన్ దిక్కే సూత్తున్నది. టన్ టన్నుమని కామెంట్ల సప్పుడు మోగుతున్నది. గా సప్పుడుకు ముగ్గాపి, ఫోన్ తన శేతి లకందుకొని.. ఎంతో ఆశగా కామెంట్లు, లైకులు ముసిముసిగ చూస్తూ నవ్వుతున్నది.. చంద్రముఖి పూనిన గంగోలె! రెండు కండ్లు పెద్దగజేసీ!

అత్త పాలు తెచ్చి..

''అయిందా మీ పోను నూకుడు! పొయ్యి రాజేసి ఇంత కూడు ఉడ్కవెడితే బాయి మొఖానా పోవాలే! అరేయ్ శింటు.. తానంజేసి ఇంత తిని బడికి పోదువు తయార్ కాపో!'' అని ఒర్లింది అత్త.

వాడు జాలట్లకు ఉర్కిండు. ఈమె ఫోన్ చార్జింగ్ పెట్టి, గా పనిలవడ్డది. కానీ, మనసు మాత్రం ఆ టింగ్‌మనే నోటిఫికేషన్ల మీదనే ఉంది. పోరడు బడికి వోయిండు. వీళ్ల సద్ది కట్టుకొని బాయిబాట వట్టిన్రు. తొవ్వెంట ఒక చేతితో నెత్తిన సద్దిగంప, ఇంకో చేత సెల్లు చూస్తాంది పద్మ. ఎదురుగ రవి సైకిల్ మీదొచ్చి..

''ఏమొదినే.. ఇయ్యాల రీల్ మస్తుంది!'' అని నగుకుంట వోతాండు.

''ఔనా పిలగా! అంత బాగుందా!? అయితే షేర్ జేసి స్టేటస్ పెట్టుకో!'' అని వయ్యారాలు వోతున్నది పద్మ.

'అది ఏం రీలో.. ఏందో!? ఇదెప్పుడో మా సంసారం బజాట్ల పెడుతది గనీ!' లోప ల్లోపల్నే బుగులు వడ్డది అత్త.

అటీటు మెల్లగ బాయికాడికి చేరిర్రు.

చెట్లకు పురుగు మందు కొడుతాండు మల్లేష్.

'వానికి రోజు పనే. శేను పూతకచ్చి ఆకు ముడత వడుతంది. ఈ పంట మంచిగొస్తే పటేల్ బాకీ సుత్త జేయాలని వాని కోరిక. అగ్గో.. గా కొసల కొడుతున్న మందు వాసన బాయికాడి గుడిసెలకు ఇసురుతాంది. ఎట్ల భరిస్తాండో ఏమో!? నెత్తికి తువాల తప్ప మూతికి బట్టసుత కట్టుకోలే కొడుకు!' అని తల్లి తల్లడిల్లుతాంది. అదేమీ పట్టనట్టు పద్మ మొఖం మీద కొంగు కప్పుకొని రీల్స్ చూస్కుంట మురుస్తాంది. అట్లుంటది మరీ.. దాని పని వరుస.


ఒకనాడు భారీ వర్షం. పొలానికి పోయినోడు ఇంటికి రాలేడు.

''ఏమే! కొడుకు ఇంకా రాకపాయే! నువ్వేమో ఆ పోన్లకెల్లి మూతి తీయవు. ఈ జోరు వానల యాడ ఆగిండో!? గా చెత్రి తీస్కోనీ పోయి చూసిరాపో'' అనే అత్త.

సరేననీ చెత్రి పట్కోని పోయింది పద్మ. పోంగ తొవ్వల ఒక చెట్టు కింద ఆగి.. ఆ చినుకుల్ల రీల్ చేద్దామని అనుకుంది. అక్కడ ఆ రాలిన ఆకుల కింద పాకురు పట్టింది. సూడలే పొల్ల. కాలు లేపి ఒక దుంకు దుంకి.. జారి బొక్కబోర్లా వడ్డది. ఫోన్ నీళ్లల్ల పడ్డది. మోకాలి నుంచి నెత్తురు.. వాన దారల కలిసి ఎర్రని కుంకుమోలె పారుతున్నది. లేచి ఏడుపు మొఖంతోని ఇంటికి నడిచింది.

వాన ఆగింది. ఇల్లు చేరుకున్నడు భర్త. ఇంటి కొచ్చి దాని ఏడుపు విని.. ఏమైందని అడిగితే, జరిగింది చెప్పలేక తొవ్వల జారి పడ్డానని అబద్ధం. కాలుకు మొలాం రాసిండు. దెబ్బ తల్గిందనే బాధ లేదు. దాని పానమంత సెల్లు నానిందనే! టౌనుకు పోయి ఆ సెల్లు బాగు సేపిచ్చే దాక వినలేదు, తినలేదు. ఇంత సెల్లు పిచ్చి ఉన్న మనిషిని భరిస్తూ.. ఆ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెల్వక వాడు నలిగిపోతున్నడు.

తెల్లారి చేన్లకు పోయి చూస్తే వానకు సగం పూత రాలిపోయింది. చేసిన కష్టం గంగపాలైందని బాధపడ్డడు. రైతు కష్టమంటే ఇంతే! వానే మురిపిస్తది. వానే ఏడిపిస్తది. అట్ల తొల్త కిత్త మిర్చి తెంపి మార్కెట్ల అమ్మిండు. తక్కువ పైకమే వచ్చింది. అమ్మితే వచ్చిన పైసలు అకౌంట్ల జమ చేసిండు. వాని చిన్న ఫోను మొన్న వానల తడిసి పాడైంది. కొత్త ఫోను కొనే దాక తన సిమ్ పద్మ ఫోన్ల వేసుకున్నడు. అటు పటేల్ అప్పు, ఇటు తల్లి కంటి పరీక్ష. వచ్చిన పైకమేమో ఎటూ సరిపోదనీ.. రెండో కిత్తల తెంపిన పంట అమ్మినంక అప్పు తీర్చి, కొత్త ఫోన్ కొందామని అనుకున్నడు.



''ఆ.. నా అకౌంట్ల లచ్చలు ఉన్నయ్ మరీ!
వాళ్లు ఎత్కపోనీకి.
ఇగ నువ్వేమో నోట్లకట్టలు
జమ చేయవడితివి మరీ!''
అనే వెటకారంగా..
''సరే! జెర పైలం. ఎంతైనా
ఈ ఫోను మా సెడ్డదే!?
ఎప్పుడు ఏం కత వెడ్తదో!?''
అనుకుంట ఇల్లు చేరిర్రు.

ఆ సాయంత్రం ఊళ్లే దండోరా మోగింది. కచ్చీర్ కాడ ప్రోగ్రాం పెడుతున్నరు. పిల్లజెల్లా, ముసలీముతక అందరూ రావాలనీ..! ఊరంత కచ్చీర్ కాడికి చేరుతున్నరు. కచ్చీర్ ముంగట స్టేజీ. దాని మీద ఒక పెద్ద పల్కటీవీ, సౌండు బాక్సులు పెట్టిర్రు. అక్కడ ఉన్న పోరలు ఇట్లా అనుకుంటుంర్రు..

''ఏంరో! ఏంది గీ ప్రోగ్రాం. బలగం సీన్మ లెక్క, గా రాజు-రాంబాయి సీన్మ సూపిస్తరా ఏందీ..!''

''ఏ ఊకోరా! సీన్మ అయితే సర్పంచ్ సాబ్ చూపిస్తడు కనీ.. పోలీసులు ఎందుకస్తరు?''

''అరే! గా టీవీని సూత్తాంటే.. ఇదేదో సర్కారు దావఖాన్ల చెప్పే ముట్టుకుంటే అంటుకునే రోగం ఉంటది సూడు.. గదేరా ఏడ్సు రోగం! ఆ ప్రోగ్రాం అనిపిస్తాందిరో''.

''టీవీల పస్టు బిట్లు ఏస్తరు. అట్ల జేస్తే రోగం ఎట్లొస్తదోనని సూపిస్తర్రా!'' అనీ ఒకడు.

''బిట్లా!? అంటేందిరో?''

''హే.. గవే రా! మన సర్పంచ్ రోజూ గడ్డాము ఎన్క జేసేటియే!'' అనే.. పైంటు మీదికి ఎగజెక్కుతూ..

''ఛల్! మీరనుకునేది కాదురా! సైబర్ నేరగాళ్లు మన ఫోన్లకు మెసేజులు పంపి, అవి ఓపెన్ చేస్తే మన అకౌంట్ల పైసల్ ఎట్ల మాయం చేస్తరో చూపెట్టనీకి పెట్టిన ప్రోగ్రాం!'' అని బ్యానర్ మీదున్న అసలు సంగతి సదివి అందరినీ సల్లవడగొట్టిండు రాజు.

ఇగ ప్రోగ్రాం చాలయ్యింది.

'మీరందరూ చాలా జాగ్రత్తగా ఉండాలి. తెలియని వ్యక్తులు మీ ఫోన్‌కి పైసలొచ్చినయని ఆశ చూపి.. లింక్స్ పంపుతరు. అవి ఓపెన్ చేస్తే మీ అకౌంట్ల ఉన్న పైసలు ఖాళీ అయితయి' అని అనౌన్స్ చేస్తూ.. అదెలా జరుగుతదో ఒక చిన్న సినిమా చూపించారు.

'కాబట్టి, అందరూ ఇక నుంచి జాగ్రత్తగా ఉండాలి' అని చెప్పారు.

ఈ రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు చేస్తే చాలా మంచిదనీ, గ్రామ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగ పడుతదని పోలీసులు, సర్పంచ్ మాట్లాడారు. అంతటితో ఆ ప్రోగ్రాం ఒడ్సింది. అందరూ ఇళ్లకు నడుస్తుర్రు.

తొవ్వంట పోంగ..

''సూశినవాయే పద్దీ! ఊకే దాంట్లనే మూతివెడుతవ్! లేనిపోనియి ఒత్తితే ఏమైతదో సమజైందా?''

''ఆ.. నా అకౌంట్ల లచ్చలు ఉన్నయ్ మరీ! వాళ్లు ఎత్కపోనీకి. ఇగ నువ్వేమో నోట్లకట్టలు జమ చేయవడితివి మరీ!'' అనే వెటకారంగా..

''సరే! జెర పైలం. ఎంతైనా ఈ ఫోను మా సెడ్డదే!? ఎప్పుడు ఏం కత వెడ్తదో!?'' అనుకుంట ఇల్లు చేరిర్రు.

* * *

ఒకరోజు ఇంటికి మనిషిని తోలిండు పటేల్.

''మల్లీ.. పటేల్ రమ్మన్నడు నడువ్!'' అనంగనే..

కాదనకుండ వీడు వానెంట పోయిండు.

''నమస్తే పటేలా!?'' అనే ఎదురుగ నిలవడీ,

ఆయన పక్కన ఊరి పెద్దమనుషులు కూసున్నరు.

''హా! వచ్చినావ్రా మల్లిగా! ఔరా.. పైసల సంగతి ఏమాయెరా!? పంట అమ్మితివి. అప్పు కట్టబుద్ధి అయితలే? నాకేం పనీపాట లేదారా!? ఊకే.. నీ ఇంటికి తిర్గనీకి?''

''మొన్నటి వానకు పూత రాలి ఏమంత పైకం రాలే! మీకు తెల్వనిదేమున్నది. ఈ కిత్తల తెంపింది అమ్మి కడుత పటేలా!'' అన్నడు.

''సరే గానీ.. ఔరా! నీ పెండ్లాం లవు సోకుల వడుకుంట ఫోన్ల డ్యాన్స్ లేస్తున్నది. దానికేమన్న ఖదరున్నాదిరా! బజాట్లకు ఇడిసినవ్? ఔరా.. మీకే ఉన్నాయిరా? మాకు లేవా ఫోన్లు! మొన్న



ఊరి గ్రూపులకు రీలు పంపింది. ఊరందరికి సూపిస్తాదిరా.. దాని సోకులు. తీస్కున్న అప్పు కట్టనీకి శాతగాదు కనీ.. రీల్స్ గావాలే మీకు రీల్స్..! అయినా మీ ఇజ్జతి మీ ఇష్టం! గవన్ని నాకు తెల్వది. మర్యాదగా పైసల్ కట్టు. ఈ ఎలచ్చన్లు ఒడ్సే దాంక చూస్త. లేకుంటే పొలంల టాక్టర్ దిగుతది బిడ్డా.. చూస్కోమల్ల!'' అని గద్దించిండు పటేల్.

అంత మందిల ఆయన అంటున్న మాటలకు తల్కాయ తీసేసినట్టు అయింది వానికి.

గా అవమానంతోని పోతుంటే తొవ్వల వీని దోస్తులు..

''ఏంరో.. చూస్కుంటనే పోతున్నవ్! ఊళ్లే కనవడుడేలేదు. ఎప్పుడు గా బాయికాడనే పంటవ్!? ఊళ్లే ఏం జరుగుతుంది? ఏ సంగతి అర్సుకోవారా? సర్పంచ్ ఎలక్షన్లు పడ్డయి. నీకు పొలం–ఇల్లు.. ఇదే సోయా!? నలుగుట్ల తిర్గాలే, మాట్లాడాలే. నీకంటె మీ పొల్ల నయంరా.. ఊరంత రీల్స్ పంపి అందరి కంట వడుతుంది'' అని నగుతుండ్రు.

వీని మొఖంల కోపం చూసి, పటేల్ తాన జరిగిన సంగతి వాని వెంట వచ్చిన మల్లయ్య చెప్తే..

''అరే! ఏమనుకోకురా. ఏదో పరాష్కానికి అన్నమేగానీ.. మాకు తెల్వది. గా పటేల్ గాని మగ్గ వొంచాల్నంటే.. మనందరం గూడి ఉపాయం జేద్దాం!'' అన్నరు వాళ్లు.

''ఈసారి ఎలక్షన్లకు మన రాజును దించాలే! పెద్ద సదువులే సదివిండు. మస్తు తెలివుంది. ఉజ్జోగం రాక ఎవుసం జేత్తాండు. వాన్నే పోటీకి నిలవెట్టాలే!'' అని అనుకున్నరు.

అది విన్నంక మల్లేష్ కోపం సల్లవడ్డది.

'నన్ను, నా భార్యను నలుగుట్ల పల్సదనం చేసిన పటేల్ మీద ఈ రకంగా పగ తీసుకుంటా!' అనుకొని వాళ్లతోని కలిసిండు.

రాజు మొదాలు పటేల్ మీద పోటంటే మామూలు ముచ్చట కాదని భయపడ్డడు.

''అరే.. ఏంగాదు. మేమంతా ఉన్నం. నువ్వు బుగులు పడకు. ఇంకెన్ని రోజులు ఇట్లనే ఉందాం. రాత్రి అందరినీ కూసోవెట్టి మాట్లాడుకుందాం. వాడు మనకు అప్పులిచ్చి, మిత్తీల మీద మిత్తీలు వసూలు జేసి, పిండి పిప్పి జేస్తుండు. ఇదంతా అధికారం వాని చేతిల ఉందనే కదా..! వాన్ని అడిగెటోడు లేడాని.. ఊరంతా ఇష్టమొచ్చినట్టు కట్టుబందు వెడుతుండు. పంచాయితీ నిధుల్ని మాయంజేసి పట్నంల ఇల్లు కొన్నడు. మనం ఇట్లనే ఉంటే.. ఎన్నడో ఊరినే అమ్మేస్తడు. ఈసారి వాడు ఏమిచ్చినా వద్దనకుంట తీసుకుందాం. కానీ ఓటు మాత్రం మనోనికే ఏసి గెలిపించుకుందాం. పోటీల గెలిచి మనమంటే ఏందో సూపుదాం!'' అని ఆ రాత్రి జనాలను పోగుజేసి.. అందరూ తీర్మానించుకుని నామినేషన్ ఏపిచ్చిర్రు.

ఈ విషయం మెల్లగ పటేల్ శెవిన పడ్డది.

'సరే! వాడెట్ల గెలుస్తడో అదిగూడ సూద్దాం!' అని రగిలిపోతుండు.

ఇగ జోరుగా మొదలైంది ప్రచారం. కులాలు, వర్గాలు జట్లుగ విడిపోయిర్రు. ఏదైతే గదాయే అనుకున్నరు..

ఎలక్షన్ రోజు ఊరంత ఓటేయనీకి పోయిర్రు. పగటీలి ఒకటైతాంది. ఓటింగ్ నిమ్మళంగ ఒడిసింది. రెండు గంటలకు ఓట్ల లెక్కింపు చాలైంది. మొదాలు మూడు రౌండ్లల్ల పటేల్‌దే పైచేయి. ఇటు గెలుపు మీద రాజుగాని ఆశలు పోతున్నయ్..! కానీ, నాలుగో రౌండుల అద్భుతం జరిగింది. ఉన్నట్టుండి రాజు మెజారిటీ అమాంతం పెరిగి.. పటేల్ ఓట్లను చీల్చుతాంది. ఆఖరి రౌండు.. నువ్వా? నేనా? అన్నంత పోటీ. చివరికి ఫలితం..

'మూడే మూడు ఓట్ల మెజార్టీతో.. రాజు గెలుపు!' అంటూ మైకు కేకలు వెడుతాంది!

పటేల్ మొఖం కిందికేసుకొని పోయిండు. గెలిచిన ఆనందంల అందరూ సంబురాల్లో మునిగిపోయిర్రు. ఇదేమీ తెల్వని మల్లేష్.. బాయికాడ చేరి మల్ల మిర్ప చెట్లకు మందు కొడుతాండు.

ఆ రాత్రి పటేల్.. ఓడిపోయిన బాధల తన ఇంట్ల మద్దతుదారులతోటి కలిసి, ఓదార్పు మందు తాగుతా.. ఓటమి కారణాలు లెంకుతాండ్రు. మూడే ఓట్లతోని ఊళ్లె ఇజ్జత్ పాయెకదరా.. ఏమై ఉంటదానీ?

''ఔరా! మొన్న మల్లిగాన్ని తిట్టినందుకు వాడు గా మాటలు మనసుల పెట్టుకొని, వానింట్ల ఓట్లు నాకేయ్యలేదేమో? ఔ.. ఏమంటవ్ రెడ్డి సాబ్?''

''ఏమోనే! ఇయ్యాల రేపు ఎవల్ని నమ్మనీకి లేదు. ఏమో వాడు ఎటేసిండో మనకెట్ల తెలుస్తదే!?''

ఇట్ల నడుస్తున్నది అక్కడ ముచ్చట.

ఆ రాత్రి ఊరంతా నిద్రవోతున్నది. పద్మ మాత్రం ఎప్పటిలాగే ఫోన్‌లో రీల్స్ చూస్తాంది. దాంట్ల నవ్వులు, ఆటలు, పాటలు, బాధలు వస్తానే ఉన్నయ్. అప్పుడు తన వేలు ఒక రీల్ దగ్గర ఆగింది. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు వచ్చే ఆశను చూపిస్తూ, ఒక రీల్..

'మీరు ఎన్ని రోజులు పేదవారిగానే ఉంటారు? మా కంపెనీలో వెయ్యి పెడితే పది వేలు సంపాదించే ట్రిక్ కోసం ఇప్పుడే ఈ లింక్‌పై క్లిక్ చేసి.. మీ నెంబర్ పంపండి!' అంటూ చూసే వారికి ఆశ లేపుతాండు.

అది చూసి పద్మ ముఖం వెలిగి.. తన భర్త పడే కష్టం గుర్తుకు తెచ్చుకుంది.

'ఒకసారి కొన్ని పైసలు పెట్టి సూద్దాం. పైసల్ రెట్టింపై వచ్చాక.. తనకు సర్‌ప్రైజ్ ఇద్దాం!' అనుకుంది.

అలా ఆమె ఆ లింక్ ఓపెన్ చేసింది. అక్కడి నుంచి వచ్చిన ప్రతీ ప్రశ్నకు ఓకే బటన్ నొక్కింది. క్షణాల్లోనే ఫోన్‌కి మెసేజ్ వచ్చింది. తెరిచి చూస్తే.. ఫోన్లో ఉన్న డబ్బులు కనిపించకుండా పోయాయి. తను భయంతో నిద్రపోతున్న భర్తను లేపి మెసేజ్ చూపించింది.

వాడు కండ్లు పెద్దగజేసీ.. అది చదివి ఒక్కసారిగా షాకయ్యాడు. ఏముందీ.. తన అకౌంట్లో దాచుకున్న డబ్బులు మొత్తం ఎవరికో బదిలీ అయ్యాయి. కోపంతో..

''మొన్నే చెప్పిన కదే నీకు.. ఇసొంటివి జరుగుతాయని..?''

తనకేమీ తెలియదన్నట్టు మొఖం నేలకేసింది. ఇద్దరి మధ్య గొడవ. వాళ్ల అరుపులకు పక్కనే నిద్రపోతున్న తల్లి లేచి, ఏమైందని అడిగితే.. ఇద్దరి నోటా ఉలుకు పలుకు లేదు.

తెల్లవారితే పటేల్ డబ్బులకు వస్తాడని భయం. ఎలక్షన్ విషయంలో శత్రుత్వం, తల్లి కంటిపరీక్ష చేయించలేకపోయిన బాధ. పంట నష్టపోయిన ఆవేదన. ఊరిలో రోజూ వినిపించే రీల్స్ మాటలు.. అన్నీ ఒకేసారి వాని కళ్ల ముందు తిరిగాయి.

తల్లికి ఏం జరిగిందో తెలియక..

''పొద్దుట మాట్లాడుకుందాం. మీరు పండుకోండ్రి'' అని, మనువడిని పక్కన వేసుకుని నిద్రపోయింది.

ఆ రాత్రి వానికి నిద్ర రాలేదు. ఆ చీకటి ఆలోచనలు వాన్ని వీడలేదు. అంతులేని కోపం.

పద్మ.. పదేపదే ఫోన్ వైపు చూస్తున్నది. పోయిన డబ్బు తిరిగి వస్తుందేమోననీ..!

కానీ, అదీ జరగని పని. ఇలాంటి లింక్స్‌తో జాగ్రత్తగా ఉండాలి. కానీ, ఆమె ఆశపడింది. ఇప్పుడు ఏమైంది? పొద్దున పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ చేద్దామని భర్తతో చెప్పాలని ప్రయత్నించింది. వాడు వినే పరిస్థితిలో లేడు. ఓ మూలన బాధతో ఉన్నాడు. పద్మ మంచం మీద కూర్చుని.. అలాగే నిద్రలోకి జారుకుంది.

తెల్లవారుతున్నది. అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చాడు. తనకు చావే పరిష్కారం అనీ..! ఎవరితో ఏమీ చెప్పలేదు. చివరిసారిగా అందరినీ తనివితీరా చూసి.. దండెం మీది తువాలతో ఇంట్లో దూలానికి వేలాడాడు.

ఊరికి విషయం తెలియదు. కానీ, పద్మకు మాత్రం తెలుసు. తన భర్తను చంపింది.. అప్పు కాదు, పరువు కాదు. తెలిసి కూడా ఫోన్‌లో 'ఓకే' అని నొక్కిన ఒక చిన్న లింక్ అనీ.. ■



అశోక్ పోతరాజు
94929 13913

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# వెలుగుపూల దారిలో..

పాలకొల్లు రామలింగస్వామి
9441416049



'నమస్తే సార్..' ఎవరిదో పిలుపు వినిపించింది. స్టాఫ్ రూమ్‌లో కూర్చుని టీచింగ్ నోట్స్ రాస్తున్న నేను తలెత్తి చూశాను. ఎదురుగా నమస్కరిస్తూ రామలక్ష్మి, వాళ్లబ్బాయి షణ్ముఖరావు నిలబడి ఉన్నాడు.

'నమస్తే.. బాగున్నారా?' అని పలకరించాను.

'బాగున్నాము సార్. మీరు బాగున్నారా?' అంది రామలక్ష్మి.

'ఆఁ.. ఏం షణ్ముఖా.. ఎలా ఉంది కాలేజీ? క్లాసులు జరుగుతున్నాయా?' ఉత్సాహంగా అడిగాను.

జరుగుతున్నాయంటూ తలూపాడు షణ్ముఖ.

'తిరుగు ప్రయాణం ఎప్పుడు?'

'ఎల్లుండే సార్.. నేను కూడా బాబుతో పాటు నూజివీడు వెళ్తున్నాను.' మెల్లగా అంది రామలక్ష్మి.

'గుడ్ షణ్ముఖ.. నీ కోరిక నెరవేరింది. ఇంకేం మనసులో పెట్టుకోకు. బుద్ధిగా చదువు. మంచి ఉద్యోగం సంపాదించుకో. అమ్మానాన్నలను బాగా చూసుకో. నీకు ఏం కావాలన్నా ఫోన్ చెయ్యి.. సరేనా..'

జేబులో నుంచి వెయ్యి రూపాయల నోటు తీసి అతని చేతిలో పెట్టాను.

'వద్దు బాబు..' అంటూ రామలక్ష్మి డబ్బులు తిరిగి ఇవ్వడానికి ప్రయత్నించింది.

'ఉండనీ రామలక్ష్మి.. ఖర్చులు ఉంటాయి కదా. దేనికైనా ఉపయోగపడతాయి.'

నా గొంతులోని గాంభీర్యాన్ని గమనించి ఆమె ఇంకేం మాట్లాడలేదు.

'ఒక గురువుగా నా కొడుక్కి మంచి దారి చూపించారు. ఒక అన్నలా నా బతుకుని సరిదిద్దారు. మీ మేలు ఎప్పటికీ మరిచిపోను సారూ..' దాదాపు ఏడుస్తున్నట్టుగా అంది.

'సరేలే.. అవన్నీ ఇప్పుడెందుకు? ఇక మీ కష్టాలన్నీ తీరినట్టే. సంతోషంగా ఉండండి.'

'అదంతా మీ చలవే.. వెళ్లొస్తాం సార్..' అంటూ చేతులు జోడించింది. కొడుకుని తీసుకుని వెళ్లిపోయింది.

ఒక్కసారిగా ఎగసిపడిన ఆలోచనలతో నా మనసు గతంలోకి జారిపోయింది.

ఉదయం తొమ్మిదిన్నర గంటలు కావస్తోంది. స్కూల్ అసెంబ్లీ ముగిసింది. క్యూ లైన్లలో పిల్లలు ఉత్సాహంగా తరగతి గదుల వైపు కదులుతున్నారు. మరోవైపు ఆలస్యంగా వచ్చిన పిల్లలు గుంజీలు తీయిస్తూ ఆపసోపాలు పడుతూ కనిపిస్తున్నారు.

'స్టాఫ్ రూమ్‌కు ఒకసారి అందరూ రండి!' అంటూ ప్రధానోపాధ్యాయులు ఆఫీస్ రూమ్ వైపు నడిచారు. ఏదైనా ముఖ్య సమాచారం ఉంటే మొదటి పీరియడ్‌కు ముందే అందరినీ పిలిచి క్లుప్తంగా చెప్పి పంపించడం ఆయనకు అలవాటు.

డిసెంబర్ నెల. చలి తీవ్రత ఇంకా తగ్గలేదు. సన్నగా వణికిస్తూనే ఉంది.

'గుడ్ మార్నింగ్ డియర్ టీచర్స్.. అందరికీ నైట్ విజిట్ ప్రోగ్రామ్ వేశాను. షెడ్యూల్ ఒకసారి చూడండి. అభ్యంతరాలు ఉంటే చెప్పండి.' అంటూ సర్క్యులర్ బుక్‌ను టేబుల్‌పై ఉంచుతూ అన్నారు.

రాత్రిపూట గ్రామాల్లో పర్యటించి, విద్యార్థుల చదువులు ఎలా సాగుతున్నాయో వారి తల్లిదండ్రులతో చర్చించి, పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి రూపొందించిన కార్యక్రమం అది.

మా పాఠశాల క్లస్టర్ పరిధిలో సుమారు ఏడు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని పిల్లలు ఐదో తరగతి నుంచి ఆరో తరగతికి, ఏడు నుంచి ఎనిమిదో తరగతికి మా పాఠశాలలో చేరుతారు. మగపిల్లలు రోజూ సైకిళ్లపై, ఆడపిల్లలు బస్సుల్లో పాఠశాలకు రాకపోకలు సాగిస్తూ చదువుకుంటారు.

వారానికి మూడు పూటలు రాగిజావ, మధ్యాహ్నం గుడ్డుతో కూడిన పౌష్టికాహారం, ప్రభుత్వం అందించే పలు రకాల సదుపాయాలతో వారి విద్యాభ్యాసం ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతోంది.

ప్రతి ముగ్గురు ఉపాధ్యాయుల బృందానికి రెండేసి గ్రామాల చొప్పున కేటాయించి జాబితాను ప్రధానోపాధ్యాయులు తయారు చేశారు. శంకరరావు మాస్టారు, గోవిందరావు మాస్టారు, నేనూ ఒక బృందంగా ఏర్పడ్డాం. స్కూల్ నుంచి రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రంగంపేట, మెట్టూరు గ్రామాలు మాకు కేటాయించారు.

'ఈరోజు నుంచే నైట్ విజిట్స్ మొదలుపెట్టండి మాస్టార్లు. తల్లిదండ్రులతో మాట్లాడండి. పిల్లల్ని ఇంటి దగ్గర చదివించమని చెప్పండి. నా వీలును బట్టి నేను కూడా వచ్చి మీతో జాయిన్ అవుతాను. ఫొటోలు తీయడం మర్చిపోకండి. పైవాళ్లకు పంపించాలి కదా.' నవ్వుతూ ఆదేశించారు ప్రధానోపాధ్యాయులు.

'అలాగే సార్.' అంటూ సర్క్యులర్‌పై సంతకాలు చేసి మేము ఎవరి తరగతులకు వారం వెళ్లిపోయాం.

ఆదేరోజు సాయంత్రం ఆరు గంటలకు అనుకున్నట్టుగానే రంగంపేట జంక్షన్ దగ్గర ముగ్గురు ఉపాధ్యాయులం కలిశాం. జంక్షన్ దగ్గర టీ తాగి మోటారు బళ్లపై రంగంపేటకు బయలుదేరాం.

ఆ ఊరు పట్టణానికి దగ్గరగా ఉండటం వల్ల గ్రామస్తులంతా పొట్ట పోసుకోవడానికి తెల్లవారితే పట్టణానికి చేరుకుంటారు. రోజువారీ కూలి సంపాదించుకుని సాయంత్రానికి ఇళ్లకు చేరతారు. ఆడవాళ్లు ఇంటి సరుకులు కొనుక్కుని ఇళ్లకు చేరితే, ఎక్కువ మంది మగవాళ్లు కాస్తంత మద్యం సేవించి ఇళ్లకు వెళ్తారు.

ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి పిల్లల చదువుల గురించి వాకబు చేశాం. తల్లిదండ్రులు చెప్పిన మాటల్లోని సారమంతా ఒక్కటే.

'పిల్లలు ఇంటి దగ్గర పుస్తకాలు తీయడం లేదు. ఎప్పుడూ సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారు. కొంతమంది చదువు మానేసి ఖాళీగా ఉన్న సీనియర్ విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడటానికి వెళ్లిపోతున్నారు.'

ఇలా రకరకాల ఫిర్యాదులు మా ముందుకు వచ్చాయి.

సాధ్యమైనంత వరకు సమస్యలకు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

పరిష్కారాలను సూచించి, చదువును నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని వివరించాం. తల్లిదండ్రులు సాయంత్రం ఇళ్లకు వచ్చిన తర్వాత రోజులో కనీసం ఒక గంటైనా పిల్లల చదువుకు కేటాయించి, వారి చదువును పర్యవేక్షించాలని చెప్పాం.

మాట వినని పక్షంలో సంబంధిత ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించాం. పరీక్షలకు ఇంకా మూడు నెలల సమయం మాత్రమే ఉంది కాబట్టి, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు మరింత శ్రద్ధ వహించాలని కోరాం.

రోజూ ఇస్తున్న వర్క్ పూర్తి చేయించడం, ఉదయం సాయంత్రం బాధ్యతగా చదివించడం వల్లే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పి అక్కడి నుంచి బయలుదేరాం.

తర్వాత మెట్టూరు చేరుకున్నాం.

రాత్రి ఎనిమిది దాటింది. వీధులన్నీ దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి. మేమూ, మాతో పాటు వస్తున్న విద్యార్థుల సందడి తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

'సార్.. షణ్ముఖ ఇల్లు ఈ వీధిలోనే సార్..' అంటూ ఓ కుర్రాడు ఓ వీధి మలుపును చూపించాడు.

షణ్ముఖరావు పదో తరగతి క్లాసులో టాపర్. తెలివైన విద్యార్థి. కానీ ఈ మధ్య ఎందుకో చదువులో కాస్త వెనకబడ్డాడు. దానికి కారణం తెలుసుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను.

'సరే.. పదండి.' అంటూ అందరికంటే ముందు పెద్ద అడుగులతో ముందుకు నడిచాను.

ఓ ఇంటి ముందు మెట్లపై కూర్చుని కొంతమంది గ్రామస్తులు మాట్లాడుకుంటున్నారు. మమ్మల్ని చూసి 'బాగున్నారా సార్' అంటూ పలకరించారు.

'షణ్ముఖ ఇల్లు ఇదే సార్..' అంటూ పిల్లలు ఎదురుగా ఉన్న ఇంటిని చూపించారు.

రోడ్డు దాటి గుమ్మంలోకి ప్రవేశించి తలుపు కొట్టబోతుండగా లోపలి నుంచి పెద్దగా శబ్దాలు, కేకలు, ఏడుపులు వినిపించాయి.

మేమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాం.

మళ్లీ తలుపు కొట్టడానికి జంకి వెనక్కి తిరిగి రోడ్డు దగ్గరకు వచ్చాం.

'ఇంట్లో నుంచి అరుపులు, కేకలు ఎందుకు వినిపిస్తున్నాయి?' అని ఇందాక పలకరించిన వ్యక్తులను ఆశ్చర్యంగా అడిగాను.

'ఓ అదా.. అదో పెద్ద కథ లెండీ సార్. పదండి.. మేము కూడా వస్తాం.' అంటూ వాళ్లు మా వెనకాలే నడిచారు.

తలుపు కొట్టగానే ఏడో తరగతి చదువుతున్న ప్రమీల (షణ్ముఖ చెల్లెలు) వచ్చి తలుపు తీసింది.

'సార్.. మీరా..' అంటూ ఆశ్చర్యంగా చూస్తూ మమ్మల్ని లోపలికి ఆహ్వానించింది.

మేమంతా లోపలికి అడుగుపెట్టగానే అక్కడి దృశ్యం మమ్మల్ని ఒక్కసారిగా నిర్ఘాంతపరిచింది.

ఏడుస్తూ ఒక మూలన కూర్చున్న రామలక్ష్మిని కాళ్లతో తన్నుతున్న కూర్మయ్య (షణ్ముఖ తండ్రి), 'అమ్మను కొట్టొద్దు' అంటూ అతన్ని రెక్క పట్టుకుని వెనక్కి లాగుతున్న షణ్ముఖరావు కనిపించారు.

ఎంత దుఃఖాన్ని ఉగ్గబట్టుకుని ఉన్నాడో పాపం.. అతని ముఖం కమిలిన మామిడిపండులా కనిపిస్తోంది.

నాలో ఆవేశం పెల్లుబికింది. మరేమీ ఆలోచించకుండా కూర్మయ్యను రెండు చేతులతో లాగి పక్కకు తోసేశాను.

'తాగేసి వచ్చి భార్య పై చేయి చేసుకుంటున్నావా? అదీ నీ పిల్లల ముందేనా? సిగ్గు లేదా? నువ్వసలు మనిషివేనా?' అంటూ కోపంగా అరిచాను.

అతను కూడా తగ్గలేదు. పిచ్చిపిచ్చిగా అరుస్తూ నన్ను కిందకు తోసేసి కొట్టడానికి మీదకు వచ్చి చేయి ఎత్తాడు.

వెంటనే నా వెనుక ఉన్న గ్రామస్తులు ఒక్కసారిగా అతన్ని పట్టుకుని బయటకు లాగి తీసుకెళ్లారు.

'అతనెవరనుకున్నావురా? స్కూలు మాస్టారు. పిల్లలు చదువుతున్నారా? లేదా? అని తెలుసుకోవడానికి మీ ఇంటికి వచ్చాడు. అంతేగానీ నిన్ను కొట్టడానికి కాదు. మాస్టారు మీదకే కలబడతావా? బుద్ధుందా? ఆయన అన్నదాంట్లో తప్పేముంది?' అంటూ అతనికి వివరించారు.

కొద్దిసేపటికి కూర్మయ్యకు విషయం అర్థమైంది. తన తప్పు ఒప్పుకుంటూ నా చేతులు పట్టుకున్నాడు.

అవమానంతో, బాధతో బిత్తర చూపులు చూస్తున్న రామలక్ష్మి అక్కడే నిలబడిపోయింది. గ్రామస్తులు ఒక్కొక్కరుగా వచ్చి గుమిగూడారు.

'ఏమీ అనుకోకండి సార్.. ఇవేవీ మనసులో పెట్టుకోకండి. మూగోడు వాడు. ఆ అమ్మాయి మీద అనుమానం. రోజూ తాగేసి వచ్చి ఇలా గొడవ చేస్తుంటాడు. ఆ అమ్మాయి మంచిది. ఏ పాపమూ ఎరగదు. మేము ఎన్నో రకాలుగా చెప్పి చూశాం. అయినా వినిపించుకోడు. మూర్ఖుడు. వీడి వల్ల భార్యా పిల్లలు నలిగిపోతున్నారు.' అని గ్రామస్తుల్లో ఒకరు చెప్పారు.

షణ్ముఖ, ప్రమీల ఒక మూలన కూర్చుని అందరినీ అమాయకంగా చూస్తున్నారు.

'సమస్య అర్థమైంది.. పరిష్కారం వెతకాలి.' నా మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది.

'జరిగింది మరిచిపోవడానికి ఇది చిన్న అవమానమా? ఈ విషయం నలుగురికీ తెలిస్తే నాకెంత అవమానం? నేను ఈ విషయాన్ని అంత తేలిగ్గా వదలను. పోలీసులకు ఫిర్యాదు చేస్తాను. ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసినందుకు కనీసం ఆరు నెలలు జైలు శిక్ష పడుతుంది.' ఆవేశంగా అన్నాను.

'అయ్యా సూర్యం మాస్టారు.. మీకు పుణ్యం ఉంటుంది. అంత పని చేయకండి. వాడు చేసింది తప్పే. ఒప్పుకుంటున్నాం కదా.. దయచేసి వాడిపై కంప్లైంట్ ఇవ్వకండి.' అంటూ ఊరి సర్పంచ్, మరికొందరు పెద్దలు బుజ్జగించే ప్రయత్నం చేశారు.

'అంటే మీ ఊరి పరువు కోసం నేను అవమానం భరించాలా? ఇదేనా మీరు చెప్పే న్యాయం?' అని ప్రశ్నించాను.

'బాబ్బాబు.. అలా అనకండి. పెద్ద మనసుతో వాడిని క్షమించమని అడుగుతున్నాం అంతే.' అంటూ ఊరి సర్పంచ్ గడ్డం పట్టుకుని మరీ వేడుకున్నాడు.

'సరే.. మీరంతా ఇంతగా అడుగుతున్నారు కాబట్టి నాదొక షరతు.' కొంచెం గంభీరంగా అన్నాను.

'ఏంటి సార్ అది?' అని అడిగారు.

'అతను రేపటి నుంచి మందు మానేయాలి. నా కోసం కాదు.. అతని కుటుంబం కోసం. ఒకవేళ తాగి వచ్చినా ఎవరి జోలికీ వెళ్లకూడదు. ముఖ్యంగా తన భార్య జోలికి అసలు వెళ్లకూడదు. పిల్లలను ప్రతిరోజూ దగ్గరుండి చదివించాలి. జాగ్రత్తగా చూసుకోవాలి.

పది రోజులు గడిచిన తర్వాత నేను మళ్లీ వస్తాను. విచారిస్తాను. ఇప్పుడు చెప్పిన మార్పులన్నీ అతనిలో కనిపించాలి. లేదంటే ఖచ్చితంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తాను. ఈ విషయం అతనికి అర్థమయ్యేలా చెప్పండి.' అని అన్నాను.

అప్పుడు నా మాటలకు గ్రామస్తులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

సైగల ద్వారా కూర్మయ్యకు విషయమంతా వివరించారు. అతనికి పూర్తిగా మత్తు దిగిపోయింది. నా కాళ్లపై పడి ఏడుస్తూ క్షమించమని వేడుకున్నాడు.

'మీ షరతులన్నింటికీ కూర్మయ్య ఒప్పుకున్నట్టే. అయినా అవన్నీ అతని మంచికే కదా.. అంతా మంచే జరుగుతుంది. చాలా సమయం అయింది. మీరు బయలుదేరండి సార్.' అని గ్రామస్తులు అన్నారు.

అక్కడి నుంచి బయలుదేరి ఇంటికి చేరేసరికి రాత్రి పదకొండు అయ్యింది.

వారం రోజులు గడిచాయి.

షణ్ముఖరావులో చాలా మార్పు వచ్చింది. అన్ని సబ్జెక్టుల్లోనూ చురుగ్గా, చలాకీగా తయారయ్యాడు. మార్కుల్లో తన మొదటి స్థానాన్ని తిరిగి సాధించాడు. ఉపాధ్యాయులందరి చేత 'శభాష్' అనిపించుకున్నాడు.

'నాన్న మునుపటిలా లేదు సార్. చాలా మారాడు. తాగుతాడు

తరువాయి 16 లో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# వెలుగుపూల దారిలో..

5వ పేజి తరువాయి

కానీ తాగిన రోజు ఎవరినీ ఏమీ అనకుండా ఒక మూలన కూర్చుంటాడు. అమ్మ జోలికి అసలు వెళ్లడం లేదు. ఇంట్లో ఇప్పుడు అంతా బాగుంది సార్.' అని ఒకరోజు గోవిందరావు మాస్టారుతో షణ్ముఖరావు చెప్పిన మాటలు విని నాకు ఎంతో సంతృప్తిగా అనిపించింది.

ఊహించినట్టుగానే షణ్ముఖరావు పదో తరగతి పరీక్షలు బాగా రాశాడు. ఆరు వందల మార్కులకు గాను ఐదు వందల ఎనభై మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. అలాగే నూజివీడు ట్రిపుల్ ఐటీ సీటు కూడా సంపాదించుకున్నాడు.

ఆనందంతో రామలక్ష్మి తన కొడుకును ట్రిపుల్ ఐటీ కాలేజీలో చేర్పించింది. ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం తన కొడుకుతో ఇప్పుడు వచ్చి తీసుకుని వెళ్లింది.

'సూర్యా సార్.. షణ్ముఖ స్కూలుకు వచ్చాడు. మిమ్మల్ని కలిశాడా?' అని గోవిందరావు మాస్టారు వచ్చి అడగడంతో గత ఆలోచనల నుంచి బయటకి వచ్చాను.

'కలిశాడు సార్.. ఇప్పుడే మాట్లాడాను.' అని సాలోచనగా అన్నాను.

'ఆరోజే గనక మనం వాళ్ల ఇంటికి వెళ్లకపోయి ఉంటే.. మీరు అలా సమయస్ఫూర్తిగా హెచ్చరించి ఉండకపోతే.. నిజంగా షణ్ముఖ పరిస్థితి దారుణంగా ఉండేది. ఏదేమైనా అతనికీ, అతని తల్లికీ ఎంతో మేలు జరిగింది. రియల్లీ, హి ఈజ్ లక్కీ ఫెలో సర్.' అన్నాడు గోవిందరావు మాస్టారు.

'అవున్సార్.. మనిషికి ఉన్న సప్తవ్యసనాల్లో ఈ తాగుడు అత్యంత ప్రమాదకరమైనది. ఇది అనేక రూపాల్లో మానవ జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తుంది. అందుకు షణ్ముఖ జీవితం ప్రత్యక్ష ఉదాహరణ.


ఇది మనం చూసిన, మనకు తెలిసిన ఒక షణ్ముఖరావు కథ మాత్రమే. మనకు తెలియకుండా ఎక్కడెక్కడో మొగ్గ దశలోనే రాలిపోతున్న విద్యా కుసుమాలు ఎన్నో ఉన్నాయి.' అని బాధగా నిట్టూర్చాను.


ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



జీవిత చరమాంకంలో జానకమ్మకు తను పుట్టి పెరిగిన ఊరిని, ఆ బాల్య జ్ఞాపకాలను కళ్లారా ఒక్కసారైనా చూడాలనే బలమైన కోరిక కలిగింది. రాఘవరావుకు కూడా వృద్ధాప్య భారంతో పాటు తీవ్రమైన నడుము నొప్పి ఉండటం వల్ల అంతటి సుదీర్ఘ ప్రయాణం చేయడం ఎంతో శ్రమతో కూడుకున్న పని. అయినా భార్య కళ్లల్లో సంతోషం చూడటం కోసం ఆయన ఆ కష్టాన్ని లెక్కచేయకుండా ప్రయాణానికి సిద్ధమయ్యారు.

ఎంతో కష్టపడి ఒక పాత కారును అద్దెకు మాట్లాడి, జానకమ్మకు ఎక్కడా నొప్పులు కలగకుండా వెనుక సీటులో తలగడలు సర్ది ఎంతో జాగ్రత్తగా ఆమెను పుట్టినూరికి తీసుకువెళ్లారు. ఊరు చేరుకోగానే జానకమ్మ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. ఆమెను నెమ్మదిగా నడిపిస్తూ, ఆమె చిన్నప్పుడు ఆడుకున్న పెద్ద చింతచెట్టును, ఈత నేర్చుకున్న చెరువు గట్టును, అక్షరాలు దిద్దిన వీధి బడిని దగ్గరుండి చూపించారు. నడుము నొప్పితో ప్రతి అడుగులోనూ నరకం కనిపిస్తున్నా, రాఘవరావు ముఖంపై చిరునవ్వు చెరగనీయకుండా భార్యకు ఊతంగా నిలిచారు. పాత ఇరుకు సందుల్లో ఆమె నడవలేనప్పుడు ఎంతో ఓపికగా చేతులు పట్టుకుని నడిపించారు. జానకమ్మ తన చిన్ననాటి స్నేహితురాలి ఇంటిని చూసి భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు, ఆమెను గట్టిగా హత్తుకుని ఓదార్చారు. భార్య కోరికను తీర్చడంలో దొరికిన ఆ తృప్తి ముందు తన శారీరక వేదన చాలా చిన్నదని రాఘవరావు భావించారు. ఆ జ్ఞాపకాల ప్రయాణం వారి మధ్య ఉన్న ప్రేమానురాగాలను మరింత దృఢం చేసింది.





కథ

# ఒకరికొకరు

సి.హెచ్. ప్రతాప్, 98660 71785

గోదావరి తీరాన పచ్చని పొలాలు, కొబ్బరి తోటల మధ్య ఉన్న అచ్యుతాపురం గ్రామంలో రాఘవరావు, జానకమ్మ దంపతులు నివసిస్తున్నారు. రాఘవరావు పూర్వీకులు సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. ఆయన తండ్రి కష్టపడి చదివించడంతో ప్రభుత్వ కార్యాలయంలో చిన్న ఉద్యోగం సంపాదించి, ముప్పై ఏళ్ల పాటు నిజాయితీగా సేవ చేసి పదవీ విరమణ చేశారు. జానకమ్మ సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన పాతకాలపు గృహిణి, భర్త అడుగుజాడల్లో నడుస్తూ పొదుపుగా సంసారాన్ని ఈడ్చింది. సమాజంలో తమకంటూ ఒక గౌరవం ఉన్నా, ఆర్థికంగా ఎప్పుడూ ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే ఉన్నారు.


తమ ఒక్కగానొక్క కొడుకు కార్తీక్ భవిష్యత్తు కోసం ఆ దంపతులు తమ సుఖాలను పూర్తిగా త్యాగం చేశారు. కార్తీక్ హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో బి.టెక్ చదవడానికి అయ్యే భారీ ఖర్చుల కోసం రాఘవరావు పాత సైకిల్‌పైనే తిరుగుతూ ప్రతి రూపాయి పొదుపు చేశారు. జానకమ్మ తన ఆరోగ్య సమస్యలను సైతం దాచిపెట్టి, మందులకు అయ్యే ఖర్చును తగ్గించి కొడుకు హాస్టల్ ఫీజులకు పంపేది. తమకున్న కాస్త ఉమ్మడి భూమిని, జానకమ్మ పెళ్లినాటి బంగారు ఆభరణాలను అమ్మి, చివరకు పదవీ విరమణ తర్వాత వచ్చిన పెన్షన్ డబ్బులను కూడా కుదవబెట్టి కొడుకుని విదేశాలకు పంపారు.

కార్తీక్ ప్రయోజకుడై అమెరికాలో స్థిరపడ్డాడు, అక్కడే ఒక ఉన్నత ఉద్యోగం చేస్తూ ఒక ఆధునిక భావాలు గల అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. మొదట్లో పండగలకు, పుట్టినరోజులకు క్రమం తప్పకుండా ఫోన్లు చేసిన కొడుకు, కాలక్రమేణా అక్కడి సంస్కృతికి అలవాటుపడి క్రమంగా మాట్లాడటం తగ్గించేశాడు. కనీసం తల్లిదండ్రుల అనారోగ్యాల గురించి, వారి క్షేమసమాచారాలు అడగడం కూడా పూర్తిగా మానేశాడు. తాము సర్వస్వం ధారపోసి పెంచిన కొడుకు తమను పూర్తిగా విస్మరించాడనే నిజాన్ని, సమాజం ముందు పడుతున్న అవమానాన్ని జీర్ణించుకోవడం ఆ వృద్ధ దంపతులకు ఎంతో మానసిక వేదనను మిగిల్చింది.

ఒకరోజు జానకమ్మకు ఒక్కసారిగా తీవ్రమైన గుండెనొప్పి, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలతో పక్షవాతం పాక్షికంగా ప్రభావం చూపి మంచం పట్టింది. వయసు పైబడటం, మానసికఒత్తిడి తోడవడంతో ఆమె శరీరం పడిపోయింది. ఆందోళనతో వణికిపోతున్న చేతులతో రాఘవరావు అర్ధరాత్రి వేళ కొడుకు కార్తీక్‌కు ఫోన్‌చేశారు.

అటువైపు నుండి 'మాకు ఇక్కడ ఆఫీసులో చాలా అత్యవసరమైన పనులున్నాయి, ప్రతి చిన్న విషయానికి ఫోన్‌చేసి ఇబ్బంది పెట్టకండి, అక్కడ ఎవరైనా నర్సును పెట్టుకోండి, డబ్బులు పంపిస్తాను' అంటూ విసుగ్గా ఫోన్ పెట్టేశాడు.

ఆ మాటలు విన్న జానకమ్మ కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. గుండె కోతతో ఆమె 'మనం పెంచి పెద్ద చేసిన రక్తమేనా ఇలా మాట్లాడింది? ఈ వయసులో మనకు దిక్కెవరు?' అంటూ ఏడవడం ప్రారంభించింది. రాఘవ రావు భార్య చేతిని తన చేతుల్లోకి తీసుకుని, కన్నీళ్లు తుడిచారు.



రాఘవరావు భార్యను ఓదారుస్తూ 'జానకీ, మనం కొడుకును చదివించాం, వాడి కాళ్ల మీద వాడు నిలబడేలా చేశాం. ఒక తండ్రిగా, తల్లిగా మన బాధ్యతను మనం నెరవేర్చాం. వాడు మనల్ని వదిలేశాడని మనం ఎందుకు కృంగిపోవాలి? ఒకప్పుడు పెళ్లై ఈ ఇంటికి వచ్చినప్పుడు నువ్వు, నేను మాత్రమే ఉన్నాం. ఇప్పుడు మళ్లీ మనమిద్దరమే మిగిలాం. మన జీవిత ప్రయాణం నీతోనే మొదలైంది, నీతోనే ముగుస్తుంది. మనకు ఒకరికొకరు ఉన్నామనే ధైర్యం చాలదా? నువ్వు అధైర్యపడితే నేను ఒంటరివాడిని అయిపోతాను' అంటూ ధైర్యం చెప్పారు. ఆ మాటలు జానకమ్మ గుండెకు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చాయి.

ఆ రోజు నుంచి వారిద్దరూ ఒకరికొకరు మరింత తోడుగా మారారు. రాఘవరావు వంటగదిలోకి వెళ్లి భార్యకు సహాయం చేయడం ప్రారంభించారు. జానకమ్మకు మందులు వేయడం, ఆమె తల దువ్వడం వంటి పనులన్నీ ఆయనే దగ్గరుండి చూసుకునేవారు.

జానకమ్మ కూడా తన బాధను మర్చిపోయి, భర్త ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం మొదలుపెట్టింది. వయసు నిండిన ఆ శరీరాల్లో ఒకరినొకరు కాపాడుకోవాలనే సంకల్పం కొత్త శక్తిని నింపింది. మునుపెన్నడూ లేని విధంగా రాఘవరావు ప్రతి ఉదయం జానకమ్మ చేయి పట్టుకుని పెరట్లోని తులసికోట చుట్టూ మెల్లగా నడిపించేవారు. జానకమ్మకు ఇష్టమైన కీర్తనలను మొబైల్‌లో పెట్టి, ఆమెకు తలస్నానం చేయించి తడి తుడుస్తుంటే వారి మధ్య ముప్పై ఏళ్ల నాటి అనురాగం మళ్లీ చిగురించింది. రాఘవరావుకు ఇష్టమైన పచ్చళ్లను జానకమ్మ ఒంటిచేత్తోనైనా ఎంతో రుచిగా చేసి వడ్డించేది. సాయంత్రం వేళల్లో ఇంటి ముందర ఉన్న అరుగుపై కూర్చుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ నవ్వుకునేవారు. కొడుకు గురించిన ప్రస్తావన వస్తే, 'వాడు ఎక్కడున్నా చల్లగా ఉండాలి' అని దీవించి ఆ విషయాన్ని అక్కడితో వదిలేసేవారు.

ఒకరోజు అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా వర్షం పడుతుండగా రాఘవరావుకు తీవ్రమైన మోకాళ్ల నొప్పులు వచ్చి కదలలేని స్థితికి చేరుకున్నారు. ఆ వయసులో, ఆ చీకటిలో ఎవరిని పిలవాలో తెలియకపోయినా జానకమ్మ అధైర్యపడలేదు. తనే స్వయంగా వంటింట్లోకి వెళ్లి, పొయ్యి వెలిగించి, ఆముదం వేడిచేసి భర్త కాళ్లకు ఎంతో ఓపికగా మర్దనా చేసింది. నొప్పి తగ్గే వరకు ఆయన తలపై నిమురుతూ పక్కనే కూర్చుంది. అలాగే మరో సందర్భంలో, జానకమ్మకు కంటి ఆపరేషన్ అయినప్పుడు కంటికి నలుసుపడకుండా, ఆమెకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రాఘవరావు తల్లిలా చూసుకున్నారు. జానకమ్మకు అన్నం తినిపించడం నుంచి, సమయానికి కంటి చుక్కల మందువేయడం వరకు అన్ని పనులూ ఆయనే స్వయంగా చేశారు. ఆమె నడుస్తుంటే ఎక్కడ పడిపోతుందోనని తన చేతిని గట్టిగా పట్టుకుని నీడలా వెంటే నడిచారు.

పండగలు వచ్చినప్పుడు ఊరంతా కొడుకులు, కోడళ్లతో కలకలలాడుతుంటే వీరు మాత్రం ఒకరికొకరు కొత్తబట్టలు ఇచ్చుకుంటూ ఆ ఇంట్లోనే పాత ఫొటోలను చూసుకుంటూ ఒకరినొకరు సంతోష పెట్టుకునే వారు. తోటలో పూసిన

(మిగతా 5వ పేజీలో)

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# ఒకరికొకరు

(కథ-4వ పేజీ తరువాయి)

పూలను కోసి జానకమ్మ జడలో రాఘవరావు తురుముతుంటే, ఆమె ముఖంలో కనిపించే ఆనందం వారి వృద్ధాప్య భారాన్ని పూర్తిగా తుడిచేసేది. ఒకరికి జ్వరం వస్తే మరొకరు రాత్రంతా నిద్రపోకుండా కాపలా కాస్తూ, కేవలం మందుల వల్లే కాకుండా తమ మధ్య ఉన్న అచంచలమైన ప్రేమ, ఆత్మీయతలతోనే ఒకరినొకరు త్వరగా కోలుకునేలా చేసుకునేవారు. ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చినప్పుడు ఒకరికొకరు ఊతకర్రలుగా మారి కిలోమీటరు దూరం నడుచుకుంటూ వెళ్లేవారు. చలికాలంలో రాఘవరావు వణుకుతుంటే జానకమ్మ శాలువా కప్పి వేడి కాఫీ అందిస్తే, ఎండకాలంలో ఆమె అలసిపోతే ఆయన తాటిముంజలు తెచ్చి ప్రేమగా తినిపించేవారు. బాహ్య ప్రపంచం తమను ఒంటరిని చేసినా, అంతర్గతంగా వారు నిర్మించుకున్న ఈ ప్రేమానురాగాల కోట వారిని ఎల్లప్పుడూ రక్షిస్తూనే వచ్చింది.

ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ, వారు తమ శేషజీవితాన్ని సమాజానికి ఉపయోగపడేలా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలోని పేద పిల్లలకు ఉచితంగా చదువు చెప్పడం ప్రారంభించారు. జానకమ్మ పిల్లలకు కథలు చెప్తుంటే, రాఘవరావు వారికి అక్షరాలు నేర్పించేవారు. ఇల్లు ఎప్పుడూ పిల్లల నవ్వులతో, కోలాహలంతో నిండిపోయేది. కొడుకు లేని వెలితిని ఆ పిల్లల ప్రేమే దూరం చేసింది. శారీరక బలహీనతలు, వృద్ధాప్య సమస్యలు ఇబ్బంది పెడుతున్నా, ఒకరి కళ్లల్లోని నవ్వును మరొకరు చూస్తూ ఆ వేదనను మర్చిపోయేవారు.

పిల్లలు కూడా వీరిని సొంత తాతయ్య, అమ్మమ్మలుగా భావించి ఎంతో ఆత్మీయంగా హత్తుకునేవారు. సాయంత్రం వేళల్లో ఆ చిన్నారులు తెచ్చే గుప్పెడుపూలు, వారు చూపే నిష్కల్మషమైన ప్రేమే ఆ వృద్ధ దంపతులకు సంజీవనిలా పనిచేసేది. చదువుతో పాటు పిల్లలకు మంచి సంస్కారాన్ని, నైతిక విలువలను నేర్పుతూ ఆ దంపతులు గ్రామంలో అందరికీ ఆదర్శంగా నిలిచారు. పండగ రోజుల్లో ఆ పిల్లలంతా వృద్ధ దంపతుల చుట్టూ చేరి కోలాహలం చేస్తుంటే, తమకు కొడుకు లేడనే బాధ వారి మనసు దరిచేరలేదు. సమాజ సేవలో దొరికిన ఈ తృప్తి వారి ఆరోగ్యాలను సైతం మెరుగుపరిచింది. ఒకరికొకరు ధైర్యం చెప్పుకుంటూ, తోటివారి జీవితాల్లో వెలుగులు నింపడంలోనే నిజమైన ఆనందం ఉందని వారు గ్రహించారు. ఆ నిరుపేద బాలల భవిష్యత్తుకు పునాదివేస్తూ, వృద్ధాప్యం అనేది శాపం కాదు, అది అనుభవాల సారాన్ని పంచే ఒక సుందరమైన అధ్యాయమని వారు నిరూపించారు.



జీవిత చరమాంకంలో జానకమ్మకు తను పుట్టి పెరిగిన ఊరిని, ఆ బాల్య జ్ఞాపకాలను కళ్లారా ఒక్కసారైనా చూడాలనే బలమైన కోరిక కలిగింది. రాఘవరావుకు కూడా వృద్ధాప్య భారంతో పాటు తీవ్రమైన నడుము నొప్పి ఉండటం వల్ల అంతటి సుదీర్ఘప్రయాణం చేయడం ఎంతో శ్రమతో కూడుకున్న పని. అయినా భార్య కళ్లల్లో సంతోషం చూడటం కోసం ఆయన ఆ కష్టాన్ని లెక్కచేయకుండా ప్రయాణానికి సిద్ధమయ్యారు.

ఎంతో కష్టపడి ఒక పాత కారును అద్దెకు మాట్లాడి, జానకమ్మకు ఎక్కడానొప్పులు కలగ కుండా వెనుక సీటులో తలగడలు సర్ది ఎంతో జాగ్రత్తగా ఆమెను పుట్టినూరికి తీసుకు వెళ్లారు. ఊరు చేరుకోగానే జానకమ్మ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. ఆమెను నెమ్మదిగా నడిపిస్తూ, ఆమె చిన్నప్పుడు ఆడుకున్న పెద్ద చింతచెట్టును, ఈత నేర్చుకున్న చెరువు గట్టును, అక్షరాలు దిద్దిన వీధి బడిని దగ్గరుండి చూపించారు. నడుము నొప్పితో ప్రతి అడుగు లోనూ నరకం కనిపిస్తున్నా, రాఘవరావు ముఖంపై చిరునవ్వు చెరగనీయకుండా భార్యకు ఊతంగా నిలిచారు. పాత ఇరుకు సందుల్లో ఆమె నడవలేనప్పుడు ఎంతో ఓపికగా చేతులు పట్టుకుని నడిపించారు. జానకమ్మ తన చిన్ననాటి స్నేహితురాలి ఇంటిని చూసి భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు, ఆమెను గట్టిగా హత్తుకుని ఓదార్చారు. భార్య కోరికను తీర్చడంలో దొరికిన ఆ తృప్తి ముందు తన శారీరక వేదన చాలా చిన్నదని రాఘవరావు భావించారు. ఆ జ్ఞాపకాల ప్రయాణం వారి మధ్య ఉన్న ప్రేమానురాగాలను మరింత దృఢం చేసింది.

జీవితం చరమాంకానికి చేరుకున్న తరుణంలో కూడా ఒకరి చేతిని మరొకరు గట్టిగా పట్టుకుని, తమ పాతఅనుభవాలను, మధురస్మృతులను తలచుకుంటూ కూర్చున్న ఆ వృద్ధదంపతులు ఎంతో ప్రశాంతంగా కనిపించారు. తిరుగు ప్రయాణంలో అలసటతో తన భుజంపైన వాలి విశ్రాంతి తీసుకుంటున్న భార్య వైపు చూస్తూ గంభీరమైన స్వరంతో రాఘవరావు అనునయంగా అన్నారు

'జానకీ, పిల్లలు మనల్ని వదిలేశారని బాధపడటం అమాయకత్వం. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు, ఒకరిపై ఆధారపడి బతకడం కంటే మనల్ని మనం నమ్ముకోవడం మిన్న. జీవితం అంటేనే ఒకరికొకరు తోడుగా, అండగా నడవడం. నువ్వు నా పక్కన నిలబడితే నాకు ఈ విశాల ప్రపంచంతో ఏమాత్రం పనే లేదు. మన మధ్య ఉన్న స్వచ్ఛమైన ప్రేమ, పరస్పర నమ్మకం ముందు ఏ ఒంటరితనము నిలవలేదు. మన శేష జీవితాన్ని ఎవరిపైనా, ఏ ఒక్కరి సాయంపైనా ఆధారపడకుండా, సమాజంలో ఎంతో గౌరవంగా, ఒకరికొకరం సర్వస్వమై బతికి చూపిద్దాం. సుఖదుఃఖాలను సమానంగా పంచుకుంటూ ప్రశాంతంగా సాగిపోవడమే మన జీవిత సాఫల్యం.'

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఈ వారం కథ

# అమ్మకు మొదటి ఉత్తరం




ప్రియమైన అమ్మకు, రాస్తున్న మొదటి ఉత్తరం,
అమ్మా, సిగ్గుపడుతున్నాను ఇది నీకు రాసే మొదటి ఉత్తరమైనందుకు. హాస్టల్ లైఫ్ లో కొన్ని వందల ఉత్తరాలు ఇంటికి రాసినా, అవన్నీ నాన్న ని సంబోధిస్తూ రాసినవే.వాటిలో నీ గురించి చాలా మాట్లాడుకున్నా,అవన్నీ పరోక్షంగానే.బహుశా నిన్ను నాన్న నీడగానే భావించి ఉంటాను.లేకపోతే అదే ఉత్తరం నీకు రాసి,నాన్న బాగోగులు అడిగి ఉండేవాణ్ణి కదా ఒక్కసారైనా.
తర్వాత్తర్వాత సెల్ ఫోన్లు జేబుల్లోకి వచ్చాక,జాబులు రాయడమే లేదు.ఇప్పుడైనా రాయాలనుకున్నది ఒక్కసారి నీతో నేరుగా మాట్లాడాలనిపించి... నీ ఒడి లో పడుకుని నీ మొహం చూస్తూ మాట్లాడే సావకాశం లేక.
నీకు ఒకసారైనా 'ఐ లవ్ యూ' చెప్పానా అని ఆలోచిస్తే ఒక్క ఉదంతమూ లేదు.బహుశా మాటలు వచ్చిన తొలినాళ్లలో చెప్పానేమో గానీ గుర్తే లేదు.ఇప్పుడు చెప్పడానికి గొంతు పెగలడం లేదు..అంత పెద్ద ప్రేమ ముందు, ఇంత చిన్న ప్రేమ తేలిపోతున్నట్టు అనిపిస్తుంది.అయినా నాదేమీ తక్కువ ప్రేమ కాదులే.నాకు జ్వరం వస్తే నీ కంట్లో గిర్రున నీళ్లు తిరగొచ్చు,కానీ అంతకన్నా ఎక్కువ నా మనసు ముక్కలైపోదూ నీ కన్నీళ్లు చూసి.
చెప్పనా పోనీ ' ఐ లవ్ యూ' అని.
అయినా అలా చెప్పడం చిన్నపిల్లల చేష్ట కాదూ! నిన్ను తలచినంతనే నా కళ్ళలో మెరిసే మెరుపు పట్టి ఇవ్వదా నా అమ్మ కూచితనం.
నీకు తెలుసా! ఇప్పటికీ అమ్మ కూచినే.నాన్న నాపై కోప్పడితే అప్రయత్నంగా అడ్డం వచ్చేదానివి కదా! నాది అక్కడ తప్పో, ఒప్పో తెలీకపోయినా నా డిఫెన్స్ లాయర్ అయిపోయేదానివి కదా!ఇప్పటికీ మా ఆవిడ తో గొడవపడితే నువ్వుంటే బాగుండు అనుకుంటాను..నీ వెనక ధీమా గా దాక్కోవచ్చని.ప్రపంచంలో అందరూ నాది తప్పు అన్నా, నువ్వు మాత్రం వెనకేసుకొస్తావని. నాన్న నీ హీరో అయితే నేను నీ సూపర్ హీరో. తప్పే చెయ్యను. తిరుగే ఉండదు.
నీ మీద కోపం వచ్చిన అంశాలు మాత్రమే ఇప్పుడు చెప్తానేం.అందులో మొదటిది నా చిన్నప్పుడు టైఫాయిడ్ జ్వరం వస్తే,నువ్వు చేసిన సేవల కన్నా ఆ తర్వాత చేసిన నిర్వాకం అస్సలు నచ్చలేదు. నీకూ, నాకూ, బహుశా నాన్నకి కూడా ఎంతో ఇష్టమైన నీ కురుల్ని తలనీలాల మొక్కు తీర్చుకున్నావు.ఎంత కోపం వచ్చిందో తెలుసా. ఇంకోసారి నీకు సర్ప్రైజ్ చేద్దామని నీ పుట్టిన రోజుకి నా పిగ్గి బ్యాంక్ ఇచ్చాను. రూపాయి రూపాయి లెక్కబెడితే ఐదు వందలు వచ్చాయి.ఆరోజుల్లో అది చాలా ఎక్కువ.చక్కగా చీరె కొనుక్కొంటావని భావించాను. నువ్వు మాత్రం సింహాచలం దేవుడిని దర్శించి,అక్కడున్న యాచకులకు ఇస్తూ పోయావు.
ఏమంటాను మరి.
ఇప్పుడు అసలైన కోపం చెప్తాను.అసలు నీ మీద ఫిరాయింపుల నిషేధ చట్టం అమలు చెయ్యాలి.నా పెళ్లవగానే ఎంతలా ప్లేటు ఫిరాయించావు?కోడలు రాకముందే ఆమె కోసం సౌకర్యంగా ఉండేలా అంత చిన్ని ఇల్లునే మార్పులతో తీర్చిదిద్ది ఉంచావు.ఆ క్రెడిట్ నాకే ఇచ్చి మాట్లాడేవు కానీ తర్వాత ఏం చేశావు.నీ కోడలికి, మనవళ్ళకి డిఫెన్స్ లాయర్ అయిపోయావు.ఏదో నావైపు ఉన్నట్లు ఫీల్ అవుతున్నాను కానీ వాళ్ళతో గొడవలో ఒక్కసారైనా నా వైపు నిలబడ్డావా? షేమ్ ఆన్ యూ అమ్మా.
సరేలే.ఇలా ఎంతసేపు రాసినా తరగవు. వెయ్యి పేజీల గ్రంథాలే తయారవుతాయి.కాబట్టి ఒకటి చెప్పి ముగిస్తాను.నువ్వు నాకు చెప్పకుండా నిద్రలోనే వెళ్ళిపోయి రెండేళ్లు అవుతుంది. కానీ నువ్వు పక్కన లేవన్న ధ్యాసే ఉండడం లేదు నాకు. పొలమారితే నువ్వు తలంచావనుకుంటాను.కలలో కనబడితే నిజమేనని సంతోషిస్తాను. జ్వరమొస్తే నా నుదిటిపై నీ చేతి స్పర్శను ఫీల్ అవుతాను.
అమ్మ తోడు.నమ్ము.
బేలగా చూడకు.నువ్వు లేవని నేనేం బాధ పడడం లేదు. కన్నీళ్లు నిండి నాకు తెలియకుండానే కళ్లను మసకబారుస్తున్నాయి.కానీ నిజం.. ఎప్పుడూ అమ్మ.. తోడేగా.
ఇట్లు, మీ పెదబాబు.

**డా. డి వి జి శంకర రావు, మాజీ ఎంపీ,**
**విజయనగరం. 9440836931**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

● కథ



# జ్యోతిర్మయం

రాజు యెదుగిరి, 9963485370

ఆరోజు శుక్రవారం. సాయంత్రం కాస్త ఊరట, వారాంతం వచ్చింది అనే సంతోషం కిషోర్ మొహంలో అస్సలు కనిపించట్లేదు. అప్పటివరకు లాప్టాప్‌లో తల పెట్టి పనిలో మునిగిపోయిన కిషోర్ గోడకు తగిలించిన గడియారం వంక చూసాడు. సాయంత్రం ఐదు గంటలు అయినట్టు చూయించింది గడియారం. లాప్టాప్ షట్ డౌన్ చేసి ఆఫీస్‌లో లాగ్ అవుట్ అయిపోయి ఎప్పటిలాగే రూంకి బయలుదేరాడు.

కిషోర్ హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాలేజీ ప్లేస్మెంట్‌లో జాబ్ రాకపోవడంతో చివరికి ఒక చిన్న సాఫ్ట్వేర్ కంపెనీలో చేరాడు. నెల ఖర్చులు అన్నీ పోను తన సంతోషాలకు మిగలకుండా మళ్ళీ వచ్చే నెల జీతం కోసం ఎదురుచూసేంత చిన్న ఉద్యోగం అది. కానీ అతను ఎప్పుడూ నామూషి ఫీల్ అవ్వలేదు. మొదట్లో హాస్టల్లో ఉండేవాడు. తెలిసిన స్నేహితుని ద్వారా వేరే రూంకి షిఫ్ట్ అయ్యాడు.

కిషోర్ ఉండే అపార్ట్మెంట్ పక్కనే ఒక బస్తి ఉంటుంది. దాదాపు ఆ అపార్ట్మెంట్ని ఆనుకొనే ఉంటుంది అది. ఇంకా చెప్పాలంటే అక్కడి సగం బస్తీని ఆక్రమించి, అక్కడి జనాన్ని తరిమికొట్టి కట్టిన అపార్ట్మెంట్ అది.

కిషోర్ లోకల్ బస్సులో అతను ఉండే ఏరియాకి చేరుకున్నాడు. సమయం రాత్రి ఏడు గంటలు కావొస్తోంది. అతను బస్సు దిగ్గానే చిన్నగా వర్షం మొదలైంది. వెళ్ళేవాడు అక్కడే ఆగి వర్షం తగ్గాక వెళ్దాం అని బస్టాప్‌లో నించున్నాడు.

---

"రోజు బిర్యానిలు, పిజ్జాలు అంటే నేను ఎక్కడి నుండి తెచ్చేది.. నాకేమైనా వేలకు వేలు జీతం వస్తుందా... అయినా నిన్న మీకు అవి తెచ్చి ఇచ్చాను చూడు నాది బుద్ధి తక్కువ." చిన్న గుడిసె లాంటి రేకుల ఇంట్లోంచి పెద్దగా కేకలు వేస్తోంది జ్యోతి.

జ్యోతి నిరుపేద అమ్మాయి. రెండేళ్ల క్రితం భర్త తాగి తాగి మద్యానికి బానిస అయి ఆర్నెళ్ళు మంచాన పడి చివరికి ఒకరోజు కన్ను మూసాడు. జ్యోతికి ఇద్దరు పిల్లలు. తన భర్త ఉన్నప్పుడు తనకి సుఖం లేదు, ఇప్పుడు అంతకన్నా లేదు. తన కడుపు మాడ్చుకొని పిల్లల కడుపు నింపిన రోజులు ఎన్నో. చిన్న వయసులో పెళ్లి, పిల్లలు అనే అతి పెద్ద బాధ్యత తనకి ఇప్పుడు భారంగా సాగుతోంది.

జ్యోతి తను ఉండే బస్తీ పక్కనే ఉన్న అపార్ట్మెంట్లో పని చేస్తూ ఉంటుంది. ఆ అపార్ట్మెంట్ లోనే కిశోర్ ఉంటున్నాడు. ఇండ్లల్లో పనులు చేస్తూ, అక్కడ మిగిలిపోయినవి ఏవైనా ఉంటే తెచ్చి పిల్లకిచ్చేది. పిల్లలను అక్కడే దగ్గరలో ఉన్న గవర్నమెంట్ స్కూల్లో వేసింది.

---

వర్షం కాస్త తగ్గడంతో మెల్లిగా తన ఫ్లాట్ వైపుగా అడుగులు వేశాడు కిషోర్. అపార్ట్మెంట్‌కి వెళ్ళాలంటే కిషోర్, జ్యోతి ఇళ్ళు దాటే వెళ్ళాలి.

కిషోర్ నడుస్తూ జ్యోతి ఉండే ఇంటి దగ్గరికి చేరుకోగానే జ్యోతి మాటలు వినిపించసాగాయి. జ్యోతి అంటే కిషోర్‌కి చెప్పలేనంత ఇష్టం. ఆ విషయం అతనికి తప్ప ఇంకెవరికి తెలీదు, అతనూ ఎవరికి చెప్పలేదు. చెప్పడానికి ఇష్ట పడలేదు.

జ్యోతి చాలా అందంగా ఉంటుంది. చామంచాయ రంగులో ఎప్పుడు మెరిసిపోయే మొఖం, నడుము కింది దాక వాలు జడ. పేదింటి మిస్ యూనివర్స్‌లా ఉంటుంది తను.

కిషోర్, జ్యోతిని మొదటిసారిగా చూసింది అక్కడే. ఆ బస్తీ లోనే. ఒకసారి ఎప్పుడో జ్యోతితో అన్నాడు కిషోర్, "చూస్తుంటే వయసులో చాలా చిన్న పిల్లలా ఉన్నావు, చదుకోవచ్చుగా, ఎందుకు నీకు ఈ పనులు." అని

దానికి జ్యోతి నవ్వి "స్కూల్‌కి వెళ్ళే పిల్లలు ఉండగా నేను ఇప్పుడు మళ్ళీ స్కూల్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కి వెళ్తే చూడ్డానికి అంత బాగోదేమో." అంది.

"పిల్లలా?" కిషోర్ మొహంలో ఆశ్చర్యం.

"ఇద్దరు." అంది జ్యోతి.

"మీకు పెళ్ళి అయిందా?" నీకు అనే ఏకవచనం నుండి మీకు అనేశాడు కిషోర్ తనకి తెలీకుండానే.

"పెళ్లి కాకుండా పిల్లలు ఎలా పుడతారు, మతుండే మాట్లాడుతున్నారా?" ముఖంలో చిరాకు.

"అయ్యో నా ఉద్దేశం..." అంటూ ఏదో చెప్పబోయి చెప్పకుండానే 'సారీ' అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు కిషోర్.

అప్పటిదాక తనని, తనకు తెలియకుండానే ప్రేమిస్తూ సరైన సిట్యువేషన్ కోసం ఎదురు చూస్తూ ఉన్న కిషోర్‌కి ఒకేసారి పెద్ద బండ రాయి గుండెల మీద పడ్డట్టుగా అనిపించింది.

పెళ్లి అయింది అనేదే ఆశ్చర్యం అంటే పిల్లలు కూడా ఉన్నారని అన్నప్పుడు ఆశ్చర్యంతో పాటు తన మీద తనకే చిరాకు వేసింది. 'మంచిదే ఇంకా విషయం చెప్పలేదు.' అని తనలో తానే అనుకొని ఆ ప్రేమని మధ్యలోనే వదిలేయడానికి సిద్ధపడ్డాడు.' కానీ వదిలేసుకోడానికి అదేమైనా వ్యామోహమా? ప్రేమ. అలా ఎలా వదిలేస్తారు ఎవరైనా? అంత తేలిక?' తనకు తానే మళ్ళీ ప్రశ్నించుకున్నాడు. బుర్ర లోంచి జ్యోతిని మర్చిపోడానికి ప్రయత్నించాడు కానీ మనసులోంచి ఆ పేరుని, ఆ అమ్మాయిని తీయలేకపోయాడు.

---

తెలీకుండానే ఏదో ఆలోచిస్తూ తన ఫ్లాట్‌కి చేరుకున్నాడు కిషోర్.

మరుసటి రోజు జ్యోతి ఎప్పటిలాగే అపార్ట్‌మెంట్లో పని చేయడానికి వచ్చింది.

"కిషోర్ బాబు.. కిషోర్ బాబు..." గట్టిగా అరుస్తూ తలుపు తట్టింది జ్యోతి.

హఠాత్తుగా నిద్రలేచి పరుగున వెళ్ళి తలుపు తీసాడు కిషోర్.

"ఏంటి బాబు, పది గంటలు కావొస్తోంది ఇంకా పడుకునే ఉన్నారు. ఇవ్వాళ ఆఫీస్‌కి వెళ్ళడం లేదా.." లోపలికి వస్తూ అంది జ్యోతి.

"ఇవ్వాళ శనివారం." చెప్పాడు కిషోర్.

"అయ్యో, అవునుకదూ." సరిదిద్దుకుంది జ్యోతి.

"అవును రాకేష్ ఎక్కడ? కనిపించట్లేదు." బకెట్‌లో నీళ్ళు పోసుకొని వచ్చి ఇల్లు తుడుస్తూ అడిగింది.

"నిన్న రాత్రి వాళ్ళ ఊరికి వెళ్ళాడు ఏదో పనుందని!" బదులిచ్చాడు కిషోర్.

"అవునా..!" అంటూ తన పని తాను చేసుకుపోతుంది జ్యోతి.

మనసులో జ్యోతికి ఎప్పుడో గుడి కట్టేసుకున్నాడు కిషోర్. దాదాపు సంవత్సరం నుంచి తనని ప్రేమిస్తున్నాడు కానీ ఎప్పుడూ తన ప్రేమ విషయం జ్యోతికి చెప్పలేదు. రోజు తనని చూస్తూ ఉండేవాడు అంతే. ప్రేమ ఇంకా పెరిగిపోయింది. ఎలాగైనా ఈరోజు తన ప్రేమ విషయం జ్యోతికి చెప్పాలి అని నిశ్చయించుకున్నాడు. 'కానీ, ఎలా?' అనే ప్రశ్న అడ్డొస్తోంది. చెప్పనివ్వకుండా అడ్డు పడుతుంది. ధైర్యం తెచ్చుకుని చెప్పడం మొదలెట్టాడు.

"జ్యోతి.." సన్నటి గొంతుతో పిలిచాడు కిషోర్.

"ఏంటి బాబు?" పని చేసుకుంటూనే అంది జ్యోతి.

"నీకు... నీకు.. ఒక విషయం చెప్పాలి.." తడబడ్డాడు.

"ఏంటి బాబు?" అడిగింది జ్యోతి, కిషోర్ వైపు చూస్తూ.

"నాకు నువ్వంటే ఇష్టం జ్యోతి. చాలా రోజులనుండి నిన్ను ప్రేమిస్తున్నాను. నీ మనసు, మంచితనం, అమాయకత్వం, నీ రూపం నన్ను నీకు దాసోహం చేసుకున్నాయి."



"నేను నిన్ను ప్రేమిస్తున్నాను జ్యోతి, నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. మనం పెళ్ళి చేసుకుందామా?" ధైర్యం తెచ్చుకొని తన ప్రేమ విషయం చెప్పాడు కిశోర్.

కిషోర్ మాటలు విన్న జ్యోతి క్షణం పాటు మనిషి కాలేకపోయింది. కాసేపటి వరకు అసలు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాలేదు.

"ఏంటి మీరనేది..?" ఆశ్చర్యపోతూ అడిగింది.

"అవును జ్యోతి, నువ్వంటే నాకు చాలా ఇష్టం నేను నిన్ను పెళ్లి చేసుకోవాలి అనుకుంటున్నాను!"

"కానీ బాబు మీరెక్కడ. నేనెక్కడ! అయినా నాకు పెళ్లి అయ్యి మొగుడు చచ్చి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఈ విషయం మీక్కూడా తెలుసు, ఆట పట్టించట్లేదు కదా నన్ను?" జ్యోతి కాస్త భయపడింది.

"పిల్లల్ని కూడా నేను బాగా చూసుకుంటాను.. మంచి కాన్వెంట్‌లో చేర్పించి చదివిద్దాం!" కిశోర్ మధ్యలో కలుగచేసుకున్నాడు.

"మన ఇద్దరం ఇలా మాట్లాడుకుంది ఎవరైనా వింటే పది మంది పది రకాలుగా అనుకుంటారు! ఇంక ఈ విషయం ఇక్కడే మర్చిపోండి." తేల్చేసింది జ్యోతి.

"నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలి అనుకుంటున్నాను జ్యోతి. ఎవరు ఏమనుకున్నా నాకు అనవసరం! నాకు నువ్వు. నువ్వే ముఖ్యం. కేవలం నీ అభిప్రాయం చెప్పు చాలు!" అన్నాడు కిషోర్.

"నాకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదు." టెన్షన్ పడుతూ అంది జ్యోతి. ఒళ్ళంతా చెమటతో తడిచిపోయింది.

"సమాజం గురించి వదిలెయ్ జ్యోతి, ఇంకా మా అమ్మానాన్న అంటావా వాళ్ళని నేను ఒప్పిస్తాను! నువ్వు ఒప్పుకుంటే చాలు!"

చాలా సేపటి దీర్ఘాలోచన తరువాత జ్యోతి ఒక నిర్ణయానికి వచ్చినట్లు ఆమె ముఖ కవళికలు చెప్పకుండానే చెప్పాయి.

"నాకు చిన్నతనంలో ఆ తాగుబోతు ఎదవకి ఇచ్చి పెళ్లి చేసారు. పెళ్లి అయెప్పుడు నాకు పదహారేళ్లు. కట్నం ఇచ్చే స్థోమత లేక నన్ను ఆ ఎదవకి ఇచ్చి కట్టబెట్టాడు మా నాన్న."

"ఇన్నిరోజులు నువ్వు అందంగా ఉంటావు అంటూ వెంటపడేవాళ్ళనే చూసాను కానీ మొదటిసారిగా నిన్ను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటావా అని అడిగేవాళ్ళని ఇప్పుడే చూస్తున్నా!" కన్నీళ్ళు చెంపలమీదుగా కిందకి జారాయి.

"నాకు తెలుసు జ్యోతి నువ్వు ఎంత బాధపడుతున్నావో. అయినా పెళ్లి అంటే రెండు మనసులు కలవాలి. అంతస్తు, చదువు, కులం ఇంకేవో కాదు."

"నాకు నువ్వంటే చాలా ఇష్టం, ఎంతగానో ట్రై చేశాను.. నిన్ను మర్చిపోడానికి. కానీ నావల్ల అస్సలు కాలేదు."

చీర కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ కిషోర్ వైపు తలెత్తి చూసింది జ్యోతి. చనువు తీసుకొని దగ్గరికి వచ్చి జ్యోతిని తన చేతులతో ఇంకాస్త దగ్గరకి చేర్చుకోబోయాడు కిషోర్.

"నేనింకా నా అభిప్రాయం చెప్పలేదు." అంది జ్యోతి కిషోర్ తన దగ్గరికి రావడం చూసి.

"అప్పుడప్పుడు కళ్ళు కూడా మనతో మాట్లాడతాయి జ్యోతి. నువ్వు చెప్పకపోతేనేం? నీ కళ్ళు స్పష్టంగా చెప్తుంటే." ఆమె కళ్ళని తీక్షణంగా చూస్తూ అన్నాడు కిషోర్.

ఆ క్షణం ఆమె ముఖం జ్యోతిర్మయంగా వెలిగిపోయింది. నవ్వి, కిషోర్ని కౌగిలించుకుని అతని ఒడిలో ఒదిగిపోయింది.

◆◆

# అద్దెకి ఆకాశం

సౌమ్య నిట్టల, 99858 51181

హైదరాబాద్ లాంటి నగరం లో నెలకి యాభై వేల ఆదాయం. ఎదుగుతున్న ఇద్దరు పిల్లలున్న కుటుంబం. ఇలాంటి పరిస్థితుల్లో, ఇంకో ఐదు వేలు నెలసరి ఖర్చు అంటే ఆలోచించాల్సిందే. శ్రీధర్ కి ఆ ఆగత్యం వచ్చింది ఇప్పుడు. ఇది ఎవర్నీ పిలిచి చర్చించలేని విషయం. ఎందుకంటే ఎవరికీ అర్ధం కాదు. వద్దనే అంటారు.

విషయం ఏంటంటే, శ్రీధర్ ఉండే ఇండిపెండెంట్ హౌస్ లో మేడ మీద బాచిలర్ల వాటా ఖాళీ అవుతోంది. అప్పటి వరకూ అక్కడ ఉంటూ పోటీ పరీక్షల కి ప్రిపేర్ అవుతున్న ఇద్దరు అబ్బాయిలకి పోస్టింగులు వచ్చాయట. వాటా అంటే పెద్ద వాటా ఏమీ కాదు. మేడ ని ఖాళీ గా ఎందుకు వదిలేయడం అని ఓ వైపు చిన్న గదులు రెండు వేశారు. పక్కన ఓ బాత్రూం. తాము ఉంటున్న మొదటి అంతస్తు లోని నాలుగు గదుల వాటా తో సహా ఈ వాటా కూడా అద్దెకి తీసుకోవాలని శ్రీధర్ ఉద్దేశం.

ఇల్లు గల వాళ్ళు డెబ్బయి లలో ఉన్న దంపతులు. ఒక ఆడపిల్ల వేరే ఊళ్ళో కాపురం చేసుకుంటోంది. కొడుకు ని అమెరికా పంపి చదివిస్తున్నారు. ఇంకా చేతికి అంది రాలేదు అతను. పైగా అతన్ని అమెరికా పంపడం కోసం చేసిన అప్పులు ఈ అద్దెల నుంచే రావాలి వాళ్ళకి కూడా.

ఈ దంపతులు గ్రౌండ్ ఫ్లోర్ లో ఉంటారు. ఇలాంటి ఇళ్ళల్లో కార్ ఉన్న వాళ్ళు రారనే ధీమా తో పార్కింగ్ కి ఇచ్చే జాగా లో ఓ రెండు గదులు వేశారు. అక్కడ ఓ మొగుడూ పెళ్ళాం ఉంటారు. వారి పిల్లలు హాస్టల్ లో ఉంటారు అందుకే ఈ ఇల్లు సరిపోతుంది.

మొదటి అంతస్తు లో శ్రీధర్ వాళ్ళ వాటా నాలుగు గదులు. ఇంటి ముందు నాలుగు బై నాలుగు చుక్కల ముగ్గు నాలుగు వైపుల బోర్డర్లు మాత్రమే పట్టేంత ఖాళీ జాగా ఉంటుంది. కాకపోతే వంటింటి వైపు కొంచెం జాగా ఎక్కువ వదిలారు. అక్కడ తులసి కోట, బట్టలు ఆరేసుకొనే తీగలు, వాషింగ్ మెషీన్, పనమ్మాయి అంట్లు తోమే జాగా వదిలేస్తే ఇంక ఏ స్థలమూ మిగలదు. తులసి కోట చుట్టూ ప్రదక్షిణ చెయ్యడం సినిమాలలో చూడాల్సిందే.

శ్రీధర్ పిల్లలు ఇంకా చిన్న వాళ్ళు. కూతురు మొదటి సంతానం. ఇంకా తొమ్మిది నిండలేదు దానికి. రెండో వాడికి ఇప్పుడు ఆరు. భార్య హేమ హౌస్ వైఫ్. శ్రీధర్ ది అంత ప్రొమోషన్లకి ఆస్కారం లేని చిన్న వ్యాపారి దగ్గర ఉద్యోగం.

ఎక్కువ ఆశలు, ఎక్కువ కోరికలు, పోల్చుకోడాలు లేకుండా ఉంటే హాయి గా వెళ్లిపోయే జీవితం. కొంచెం మనసు ఉంటే చిన్న చిన్న ఆనందాలకి కూడా ఆస్కారం ఉండే జీవితం. శ్రీధర్ ఇప్పటి వరకూ ఏది సాధించినా సాధించక పోయినా ఇది సాధించాడు. ఓ తండ్రి,భర్త అయిన మగవాడు మానసికంగా ఆరోగ్యవంతుడూ, చెడు అలవాట్లు లేని వాడూ, ఒకింత రస హృదయుడూ అయితే యాభై వేల లో పదిహేను వేల అద్దె, ఇంటి ఖర్చులు తీసెయ్యగా కూడా బ్రహ్మాండంగా జీవించచ్చు అని చుట్టుపక్కల వాళ్ళు కూడా అనుకొనేలా జీవిస్తున్న వాడు.

ఇందులో శ్రీధర్ ఒక్కడిదే గొప్ప కాదు. అతని అనపాయిని హేమ ది ఇందులో సగం ఘనత.

ఆరోగ్యకరమైన దాంపత్యాలని గమనిస్తే, ఇద్దరూ ఒకే లా ఆలోచించేవారు కొందరైతే, తమ భాగస్వామి గుణాలకి వ్యతిరేక ధ్రువాల్లో ఉంటూ, ఒకరినొకరు నిరంతరం సవాల్ చేస్కుంటూ ఇద్దరూ ఓ భూమధ్య రేఖ మీద కి వస్తూ ఉండటం ఇంకో రకం. ఉదాహరణకి ఒకరు ఖర్చు చేసే వారైతే రెండో వాళ్ళు ఖచ్చితంగా అందుకు విరుద్ధంగా మారతారు. ఒకరు భోళా అయితే మరొకరు తెలివి గల వాళ్ళయి ఉంటారు, లేదా అలా తయారవుతారు. శ్రీధర్ లోని స్వాప్నికుడిని హేమ లోని యదార్ధవాది ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంది. అప్పుడప్పుడూ అతను తీసుకొనే అందమైన ...కానీ ఆచరణాత్మకం కాని నిర్ణయాలకు ఎదురు నుంచుంటుంది.

ఇప్పటికే తమతో సమానంగా సంపాదిస్తున్న వారి కన్నా కొంచెం ఎక్కువ ఉంటుంది వీరి ఇంటి ఖర్చు. రోజూ ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు ఏవో ఒకటి తేవాల్సిందే. పిల్లలకి చిరుతిళ్ళు ఓ రోజు. ఇంకో రోజు 'మా ఆఫీసులో చీరలు తెచ్చాడు ఒకాయన' అని ఐదొందలు ఎక్కువైనా తనకి నచ్చే వి తీస్కొచ్చేయడం. ఈ ఖర్చు ని బ్యాలెన్స్ చెయ్యడానికి హేమ ఇంట్లోనే పీకో ఫాల్ బ్లౌజ్ కుట్టేసుకోవడం నేర్చుకుంది. పెట్రోల్ ఖర్చు చూస్కోకుండా బండి మీద డ్రైవ్ అని పిల్లల్ని ఓ సారి, తనని ఓ సారి అలా తిప్పుకొస్తాడు. ఇవన్నీ జీవితం లో రుచులు అంటాడు. నిజమే. కానీ అలా అలా ఒక్కో రూపాయి చూస్కోకపోతే ఎలా అంటే రేపు పిల్లలూ మనం పెద్దవాళ్ళం అయిపోతే ఇలాంటి సరదాలు అనుభవించలేదే అని బాధపడ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కూడదు కదా మరి .. అంటాడు. తనకి తెలుసు అది నిజమే అని. కానీ తాను ఇలా ఉండకపోతే ఇంకా ఖర్చులమారి అయిపోతాడు. అందుకే స్ట్రిక్ట్ గానే ఉంటుంది హేమ. శ్రీధర్ అందుకు తలవంచుతాడు కూడా.

ఈ మేడ వాటా విషయం లో మాత్రం విషయం తెగడం లేదు. అసలు ఆ వాటా ఖాళీ అవుతోంది అని తెలిసినప్పటి నుంచి 'తీసుకుందాం తీసుకుందాం' అని మొదలు పెట్టాడు శ్రీధర్. హేమ కి ఆశ్చర్యం వేసింది. చిన్న చిన్న దుబారాలు చూసింది కానీ ఇలా అమాంతంగా నెలకి ఐదు వేల అదనపు భారం అని తెలిసీ ఇంతలా ఎందుకు పట్టుబడుతున్నాడు శ్రీధర్?

అప్పటికీ అతన్ని అడిగింది కూడాను.

"మనకి నాలుగు గదులు సరిపోతున్నాయి కదా... ఇప్పుడు ఆ పైన రెండు గదులు ఎందుకు?"

"అబ్బే... నాకసలు ఆ రెండు గదుల తో సంబంధం లేదు!"

"మరి ఐదు వేలు అద్దె పోస్తోంది ఎందుకు? శ్రీధర్... మనకి ఇద్దరు పిల్లలు... మర్చిపోయావా?"

"వాళ్ళిద్దరికోసమే..."

"పిల్లలు పెద్దవాళ్లయ్యి, చేతికి అంది వస్తే సొంతిల్లు కట్టుకోవచ్చు... అప్పుడు చూసుకుందాం లెండి ఇవన్నీ"

"అన్నేళ్ళయ్యాక భూమి ధరలు ఇంకా పెరుగుతాయి, కట్టుకున్నా ఇలాంటి అగ్గిపెట్టే కట్టుకోగలం, అప్పుడు కూడా ఇలాంటి మేడ కి నోచుకోము"

"మేడా? అందుకా పైన వాటా కావాలంటోంది? అంత డబ్బు పోసేంత ఏముంది ఆ మేడ లో?" విసుగ్గా అంది హేమ.

అంతే, ఆమె దగ్గరగా వచ్చి కూర్చుండి పోయాడు శ్రీధర్. అతని మొహం లో వాదులాట తాలూకు చికాకంతా పోయింది. "ఇప్పుడు సరైన ప్రశ్న అడిగావు" అని ఆమె చేతిని తన చేతిలో కి తీసుకున్నాడు.

"నా చిన్నప్పుడు మాకొక మేడ ఉండేది. మేడంటే ఏంటను కున్నావు? మన లాంటి మధ్య తరగతి వాళ్ళకి ఓ స్వర్గపు ముక్క. వేసవొస్తే టేబిల్ ఫాన్ పెట్టుకొని చక్కగా చుక్కల కింద నిద్రపోయేవాళ్ళం నలుగురం. అమ్మ వడియాలు, ఒరుగులు పెట్టేది. గంజి పెట్టుకుని చీరలారేసుకొనేది. వానా కాలం లో ఒక్క సారి మాత్రం తడవనిచ్చేవారు ఇంట్లో. దీపావళి కి మేము తెచ్చుకొనే జానాబెత్తెడు టపాకాయలు అయ్యాయి అనిపించాక మేడ మీదకెళ్తే ఆకాశం లో తారాజువ్వలు, బాణాసంచా అంతా ప్లానిటేరియం లో లా చూసేవాళ్ళం! మేడ అంటే మొక్కలు ... పూల మొక్కలు, పళ్ళ మొక్కలు... టమాటా, పచ్చి మిర్చి, కొత్తిమీర... అన్నీ ఇష్టంగా పెంచుకొనేవారు అమ్మా, నాన్నా! చలి కాలం లో మధ్యాహ్నం వేళ వచ్చే ఎండ వేడిమి కి కూర్చొనే వారు.

ఇప్పుడు డి విటమిన్ లోపం అంటున్నారు... అమ్మ స్నానం చేయించి సూర్యుడికి నమస్కారం చేసుకొని రమ్మనేది రోజూ. ప్రతీ సాయంత్రం పదిహేను నిముషాల పాటు ప్రకృతి వేసే 'సూర్యాస్తమయం' షార్ట్ ఫిల్మ్ చూసే వాడ్ని నేను.

ఇవన్నీ మన పిల్లలకి తెలియకుండా పోతున్నాయి. వాళ్ళ స్కూల్ కూడా ఓ బిల్డింగే. గ్రౌండ్ అన్న మాటే ఉండట్లేదు ఏంటో. నువ్వు తలంటు పోసుకొని తలారబెట్టుకుంటే చూడాలని ఉంది. నీ తో కూర్చొని టీ తాగాలని ఉంది. పిల్లల బర్త్ డే పార్టీ కి ఎక్కడో ఫంక్షన్ హాల్ తీసుకోనవసరం లేదు. సంక్రాంతి కి గాలి పటాలు ఎగరేసుకోవచ్చు!"

పదేళ్ళ సాహచర్యం లో తాను కనీసం ఊహించలేని ఎన్నో ఆనందాల్ని తనకి చూపించాడు తన భర్త. గుక్క తిప్పుకోకుండా మేడ గురించి మాట్లాడుతుంటే ఇంకా తాను చూడవలసినవి ఉన్నాయా అనిపించింది హేమ కి. అతని మాటలకి ఆమె దగ్గర వాదనలేమీ లేవు. ఆలోచిస్తూ కూర్చుంది.

శ్రీధర్ ఆమె కి మరింత దగ్గరగా జరుగుతూ అన్నాడు "ఈ ప్రపంచం లో రకరకాల తండ్రులు, భర్తలు ఉంటారు. కొందరు పిల్లలకి ఆస్తులిస్తారు. కొందరు పిల్లలకి కడుపు నిండా చదువులు చెప్పిస్తారు. కొందరు ఏదో విధంగా ఓ ఇల్లు కట్టేస్తారు. నేను అవేమీ చెయ్యలేను. అందుకు నేనెప్పుడూ బాధపడలేదు. కానీ నేను చూసిన చిన్న చిన్న ఆనందాల్ని నా కుటుంబానికి కూడా చూపించాలన్నది ఒక్కటే నా పట్టుదల. హేమా... నీకు తెలీనిది ఏముంది... మన నగరం లో ఎంత చిన్న ఇంటికైనా ఎంత డిమాండ్ ఉంటుందో... పైన ఇంకెవరో వచ్చే లోపే మనం తీసుకుంటాం అని చెపుదాం ప్లీజ్..." గడ్డం పట్టుకొని బ్రతిమాలుతున్నాడు శ్రీధర్.

హేమ కాదనలేకపోయింది.

మధ్య తరగతి సంసారాల్లో కొరవడేది ఆర్థిక స్వాతంత్రం. ఓ కుటుంబ పెద్ద తన కుటుంబాన్ని ఎలా నిర్వహించుకోవాలో అది అతని ఒక్కడి చేతిలో ఉండదు. పోనీ ఆ కుటుంబం చేతిలో కూడా ఉండదు. అతని ఇంటి పెద్దలు కూడా ఆ వ్యవహారాల్లో కలగచేస్కుంటారు. కుటుంబం తో సంబంధం లేని చుట్టుపక్కాలూ కూడా వారి అభిప్రాయాలూ, సలహాలూ ఇవ్వక మానరు.

అందరి ఉద్దేశాలు మంచివే. మధ్య తరగతి జీవితాలు ఒక చిన్న అత్యవసర ఖర్చు వస్తే చితికిపోయి అప్పులపాలవ్వటానికి ఆట్టే సమయం పట్టదు. డబ్బు అనే అరుదైన వనరు ని పొరపాటున కూడా అవసరాలకి మినహా దేనికీ ఖర్చు చేయకుండా తాము జాగ్రత్త పడి, తమకి తెలిసిన వారందర్నీ జాగ్రత్త పరిచే వార్దెన్లు అందుకే చుట్టూ ఉంటారు.

ఇప్పటి వరకూ శ్రీధర్ కుటుంబం లో జోక్యం కలిగించుకొనే అవకాశం వారికి రాలేదు. కానీ ఈ మేడ మీద వాటా సంగతి అతను ఇంటి వాళ్ళకి చెప్పిన దగ్గర్నుంచీ కలకలం మొదలైంది. ముందు గా అతన్ని వారించింది ఎవరో కాదు -

స్వయంగా ఇంటి వాళ్ళే.

"శ్రీధర్, నువ్వు మాకు కూడా కొడుకు లాంటి వాడివే. మా వాడు ఇలా ఇంకో వాటా తీస్కుంటానంటే మేము చూస్తూ ఊరుకుంటామా? నీకు అంతగా డబ్బు ఎక్కువైంది అనుకో... ఏ చీటీ నో వేసుకుంటే అక్కరకొస్తుంది కదా రేపు, ఆలోచించు" అన్నారు ఓనర్ బాబాయి గారు.

హేమ కి చెప్పినట్టు ఆయనకి తన మనసులో మాట వివరించలేదు గా .. అందుకే నవ్వుతూ "మీరు భయపడకండి... మా పదిహేను వేలతో పాటు పై వాటా ఐదు వేలు కలిపి ఎప్పటిలానే టైం కి ఇచ్చేస్తాను" అన్నాడు ఆయనకి నమ్మకం కలిగిస్తూ.

ఆయన ఏదో చెప్పలేక ఇబ్బంది పడుతూ చివరికి బయట పడ్డాడు. "అది కాదు శ్రీధర్... వాళ్ళు బాచిలర్లు కాబట్టి వాళ్ళు ఐదు వేలకి బేరమాడుకున్నారు. వాళ్ళ తర్వాత వచ్చే వాళ్ళకి మేము ఆరున్నర వేలు చెబ్దామనుకున్నాం..."

శ్రీధర్ కి తెలుసు.. ఐదు వేలంటేనే గొడవ చేసిన హేమ ఆరున్నర వేలకి అస్సలొప్పుకోదని.

బాధ తో ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు.

అది గమనించిన ఓనర్ పిన్ని గారు "అన్నీ పెరిగాయి కదా నాయనా... మా వాడు కూడా ఇంకా అమెరికా లో కుదురుకోలేదు.. మాకూ ఇదొక్కటే ఆదాయం కదా..."

మధ్య తరగతి ఎకానమీ లో మరో పోకడ - పారదర్శకత్వం. అందరి జీవితాలు అందరికీ తెలుసు... ఇంచుమించుగా. ఏమీ అనలేం. అర్థం చేస్కోవడం తప్పించి.

ఈ బాధ నుంచి తెప్పరిల్లేవాడేమో కానీ ఇంటి పక్కన ఒక శ్రేయోభిలాషి "పోనీ నీదేమీ ఓవర్ టైం లాంటివి చేసే అవకాశం ఉన్న జాబ్ కాదు కదా...." అన్నాడు. నెల ఖాతా రాసుకొనే కిరాణా షావుకారు "మనకి ఆదాయం పెరిగే మార్గం లేనప్పుడు పొదుపు గా ఉండటం ఒక్కటే మార్గం సార్" అని గుర్తు చేసాడు. వీధి చివరి గుడిలో పూజారి ఒకలా నవ్వాడు తీర్థం ఇచ్చేటప్పుడు. ఇలా అందరూ తమ తమ అభిప్రాయాన్ని రకరకాలుగా వెల్లడించి శ్రీధర్ గాయాన్ని మాననివ్వలేదు.

అతని బలహీనత ని వేలెత్తి చూపించినట్టు అనిపించింది.

ఓ రోజు రాత్రి హేమ దగ్గర బాధ పడ్డాడు శ్రీధర్.

"ఏంటి నా జీవితం? ఏదో పాజిటివిటీ తో అమాయకత్వం తో నెట్టుకొచ్చేస్తున్నానా ఇన్నాళ్లూ? నేను పెద్ద జీతాలకి ప్రయత్నాలు చెయ్యక కాదు కదా. ఇచ్చిన జీతానికి ఎంప్లాయి రక్తమాంసాలు పిండేసి, కుటుంబం తో ఉండే సమయాన్ని లాగేసుకొని, ఇంట్లో వాళ్ళ మీద చికాకు పడేలా చేసే ఉద్యోగాలు వద్దనుకున్నాను... అది కూడా ఓ పది వేల పుణ్యానికి. జీవితం ఏదో ఒకటే ఇస్తుంది ఏంటో. డబ్బైనా, కుటుంబం తో సమయమైనా. నేను రెండోదే ఎంచుకున్నానని గర్వ పడ్డా ఇన్నేళ్ళూ. ఇప్పుడనిపిస్తోంది... వాళ్ళే కరెక్ట్. ఇంత చిన్న ఖర్చు కూడా భరించలేని నేను... ఆర్థికంగా ఓడిపోయాను హేమా."

విసుగ్గా లేచి వెళ్ళిపోయాడు శ్రీధర్. హేమ కి అనిపించింది. ఇలాంటి గొడవ జరిగాక మేడ ఉంటే అక్కడికే వెళ్ళేవాడు అని. వేదాంతంగా నవ్వుకుంది ఈ ఊహకి.

శ్రీధర్ తో చూసి 'హేమ అదృష్టవంతురాలు' అనుకునే వారికి పెళ్ళికి ముందు హేమ పరిస్థితి తెలీదు.

తన తండ్రి అకస్మాత్తుగా చనిపోయాక తల్లి చుట్టాల సహకారం తో బాధ్యత తీర్చుకోడానికి తన కి సంబంధాలు వెతకడం మొదలుపెట్టింది. తమ్ముడు ఇంకా చిన్న వాడు.

హేమ వరసగా పెళ్ళి చూపుల కి వరులని కలుస్తున్న సమయం అది. ఒక అబ్బాయి 'సో అండ్ సో కంప్యూటర్ కోర్సు చేసేయ్... నీకూ ఉద్యోగం వేయించేస్తాను మా కంపెనీ లో' అంటూ ఏకపక్షంగా తన జీవితాన్ని కూడా ప్లాన్ చేసాడు. ఇంకో అబ్బాయి 'నేనేమీ మాట్లాడను, మీరూ మీరూ మాట్లాడుకొని చెప్తే పెళ్లి చేసుకుంటాను' అని నిర్లిప్తంగా అనేశాడు. ఇంకో అబ్బాయి ఏమీ మాట్లాడలేదు. అతనికి అసలు అక్కడికి రావడమే ఇష్టం లేదని అందరికీ తెలుస్తూనే ఉంది. తాను ఇవన్నీ గమనిస్తున్నా, ఏమీ బైటికి చెప్పలేని పరిస్థితి.

అమ్మ కి ఇంకో సమస్య గా మారటం ఇష్టం లేక ఎవరైనా సరే అని మనసులోనే తీర్మానించుకుంది హేమ. అయినా ఏంటో ఎవరికీ తను నచ్చట్లేదు. ఏ సంబంధమూ కుదరట్లేదు.

ఇలాంటి తరుణం లో శ్రీధర్ వాళ్ళ సంబంధం వచ్చింది. తనకి ఇప్పటికీ గుర్తు. శ్రీధర్ తన తల్లి, తండ్రి, చెల్లెలి తో సహా వచ్చాడు. నలుగురూ ఫ్రెండ్స్ లాగా ఒకరితో ఒకరు ఉండటం గమనించింది హేమ. మాట్లాడుకొమ్మని ఇద్దర్నీ వదిలేశారు ఎప్పటిలాగే. వరస పెళ్ళి చూపుల వల్ల కలిగే నిర్వేదం లో ఉంది హేమ.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత శ్రీధర్ గొంతు వినిపించింది.

"ఎడమ చేతి చందమామ కుడి చేతి చందమామ ఒకే లాగా ఎలా వచ్చాయండి బాబూ మీకు?"

తాను పెట్టుకున్న గోరింటాకు ని చూస్తూ ఆశ్చర్యంగా అడిగాడు శ్రీధర్. అప్పటి వరకూ ఎటో చూస్తున్న హేమ మొదటి సారి అతని వైపు చూసింది. ఎగతాళి గా అంటున్నాడా? అలా అనిపించలేదు. కొంటె గా అంటున్నాడా? అదీ లేదు. కళ్ళు పెద్దవి చెయ్యడం వల్ల గోలీ కాయల్లా కనిపిస్తున్నాయి. వాటిలో స్వచ్ఛమైన అమాయకత్వం కనిపించింది హేమ కి. నవ్వొచ్చింది. మొదటి సారి అనుకుంటా పెళ్ళి చూపుల్లో నవ్వింది.

"చిన్న సైజు గాజు ని అచ్చు లాగా వాడాను"

ఓ పెద్ద పజిల్ సాల్వ్ అయినట్టు ఫీలయ్యాడు శ్రీధర్. "ఓహ్, భలే చిట్కా. మా అమ్మకీ, చెల్లికీ కూడా చెప్తాను ఈ సారి".

అక్కడి నుంచి వాళ్ళ కబుర్లు ఓ అరగంట సేపు గలగలా పారాయి. తన జీతం (అప్పటికి ముప్ఫయి ఐదు వేలే), ఇంటి పరిస్థితుల గురించి చెప్పాడు. చెల్లి కి పెళ్ళి చెయ్యాలి, కానీ అందుకు కొంత ఆస్తి వెన్నుదన్నుగా ఉంది, పూర్తిగా తన జీతం మీదే ఆధారపడనక్కర్లేదు. హేమ కుటుంబానికీ, హేమ కీ 'నో' చెప్పే వెసులుబాటు లేకపోయినా చులకనగా చూడని మొదటి మగవాడు శ్రీధర్. తన గురించి అడిగి తెలుసు కున్నాడు. అతనికి చెప్పేటప్పుడు తన ఇష్టాయిష్టాలే మొదటి సారిగా తెలిసొచ్చాయి హేమ కి. చందమామ, చల్ల గాలి, వాన, మల్లె పూలు, మామిడి పళ్ళు - శ్రీధర్ మాటల్లో వచ్చిన ఈ పదాల్ని విన్నాక ఇతని తో ఉంటే జీవితం లో ఓ తడి ఉంటుంది, శుష్కత్వం ఉండదు అనిపించింది. హేమ కి అప్పుడు తెలిసొచ్చింది - ఆ ముందు సంబంధాలన్నీ ఎందుకు కుదర్లేదో.

మొదటి సారి కోరుకుంది - ఈ సంబంధం కుదిరితే బాగుండు అని. మనసులో అన్నవరం సత్యనారాయణ స్వామికి మొక్కేసుకుంది కూడా. సరిగ్గా మూడు నెలలకి పెళ్ళి తర్వాత మొదటి సారి అన్నవరానికే వెళ్ళి వ్రతం చేసుకొని మొక్కు తీర్చుకున్నారు నవ దంపతులు.

ఈ పదేళ్ళు తన నిర్ణయం సరైనదే అని ఋజువు చేస్తూనే ఉన్నాడు శ్రీధర్. కానీ ఈ రోజు... శ్రీమంతుడైన మగవాడు కూడా ఇవ్వలేని ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని సాధ్యం చేసిన తన భర్త ఓడిపోయానని భావించటాన్ని హేమ భరించ లేకపోయింది.

ఆఫీసు నుంచి ఏం తీసుకురాకుండా ఇంటికొచ్చాడు ఆ రోజు శ్రీధర్. అతని మనసు మనసులో లేదు. ఇంటాయన పలకరించాడు. ఎప్పుడూ ఆనందంగా తిరిగి పలకరించి ఏమైనా కావాలా అని అడిగి, కొంచెం సేపు మాట్లాడి పైకొచ్చేవాడు. ఆ రోజు మొహం తిప్పుకున్నంత పని చేసాడు. ఇంటాయన మాత్రం మాట కలుపుతూ "పైన ఇల్లు ఇచ్చేశాం అయ్యా, ఏమనుకోవద్దు" అన్నాడు.

ఏదో చేజారిపోయిన భావన కలిగింది శ్రీధర్ కి. బండి పార్క్ చేసి పైకి వెళ్ళాడు. ఇల్లు లాక్ చేసి ఉంది. భృకుటి ముడి పడింది.

ఎక్కడికైనా వెళ్తే ఫోన్ చేస్తుంది హేమ. మామూలు గా అయితే కిందికెళ్ళి అడిగేవాడే ... ఈ రోజెందుకో మొహం చెల్లట్లేదు. హేమ సెల్ ట్రై చేస్తే రింగ్ టోన్ వినిపిస్తోంది. ఆ రింగ్ టోన్ ఎక్కడి నుంచి వస్తోందా అని ధ్వని వస్తున్న దిక్కు వైపు అడుగులు వేస్తున్నాడు. సందు తిరిగితే పైకెళ్ళే మెట్లు. ఒక్కోటి ఎక్కుతుంటే రింగ్ టోన్ కి దగ్గరవుతున్నాడు.

మెట్లు ముగిసాయి.... ముందుకెళ్తే మేడ. కొత్తవాళ్ళు దిగారని సాయం చెయ్యటానికి వచ్చిందేమో అని చూస్తే అక్కడి దృశ్యం చూసి నోరెళ్లబెట్టేసాడు శ్రీధర్...

సూర్యాస్తమయ వేళ ... మేడ మధ్య లో రెండు కుర్చీలు .... మధ్య లో టీ పాయ్ మీద రెండు కప్పులూ, ఓ ఫ్లాస్క్ ... . పిల్లలు మేడంతా పరుగులు తీస్తూ ముట్టించుకొనే ఆట ఆడు కుంటున్నారు ... మూల గా ఓ కొత్త మొక్క తో ఓ కుండీ ... .. ఓ గంజి పెట్టి ఆరేసిన చీర .... వీటన్నిటి మధ్య నవ్వుతూ హేమ.

పెళ్ళి చూపుల్లోలాగే గోలీ కాయ కళ్ళేసుకొని చూస్తున్న శ్రీధర్ ని చూసి నవ్వుకుంది హేమ. అతని దగ్గరికెళ్ళి అతని చెయ్యి పట్టుకొని కుర్చీల దగ్గర కి తీసుకొచ్చింది. ఇంకా మాటల్లేవు శ్రీధర్ కి.

టీ పోసి ఇచ్చింది కప్పులో. ఎదురుగా అతను చెప్పినట్టు ప్రకృతి సమర్పించే లఘు చిత్రం మొదలైంది. ఒక్కో అంగుళం అస్తమిస్తున్న సూర్యుడు, ఊదా, కాషాయం, ఎరుపు, నీలం వీటి షేడ్స్ లో వింత వింత 'వన్నెలు' పోతున్న ఆకాశం, ఎయిర్ షో లో విమానాల్లాగా ఓ ఫార్మేషన్ లో ఇంటికి తిరిగి వెళ్తున్న పక్షులు .... ఇవన్నీ చూస్తున్నాడు శ్రీధర్.

హేమ వైపు తిరిగాడు.

"ఎలా?"

"మీరు అప్పుడప్పుడూ ఇచ్చే డబ్బు నా దగ్గర కొంత దాచి పెట్టాను. ఎప్పుడైనా మీకు ఏదైనా కొని పెడదామని. ఇంతకన్నా మంచిది మార్కెట్ లో ఏదీ కనిపించలేదు".

"ఓహో ... ఎంత దాచావేంటి?"

"ఓ నెల పాటు ఈ వాటా మనదయ్యేంత"

"నెల గడిచాక?"

"అప్పుడు చూద్దాం"

ఇద్దరూ నవ్వుకున్నారు.

యదార్థ వాది అయిన హేమ ఈ నిర్ణయం తీసుకునే ముందు లెక్కేసుకుంది. ఆరున్నర వేల లో తాను అద్దెకు తీసుకున్నది .. రెండు గదులు, కొన్ని చదరపు అడుగుల మేడ, పిల్లలకీ, తనకీ ఆరుబయట గుండెల నిండా ఊపిరి తీసుకొనే స్థలం ... అన్నిటినీ మించి శ్రీధర్ ఆనందం. అలా అనుకున్నప్పుడు ఆరున్నర వేలు చౌక బేరంగానే అనిపించింది హేమ కి.

శ్రీధర్ మేడ గురించి వర్ణించేటప్పుడు ఓ ముఖ్యమైన విషయం చెప్పనే లేదు. మహానగరం లో భూమైనా సులువుగా దొరుకుతుంది కానీ ఆకాశం దొరకడం అసాధ్యం. అందుకే చేతిలో వేడి టీ తో, పక్కన మనసెరిగిన సహచరితో, ఆనందంగా ఆడుకుంటున్న పిల్లల మధ్య ... ముఖం నిండా తృప్తి తో మెరిసే కళ్ళతో హక్కుగా తాను ఓ నెలకి అద్దెకు తీసుకున్న ఆకాశాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నాడు శ్రీధర్.

(ఈనాడు ఆదివారం 2.8.2026)

కథ

# జన్మభూమి

ములుగు లక్ష్మీమైథిలి

“రవీ! పండుగకు ఇంటికి వస్తున్నావా?” అంటూ పట్నంలో ఉద్యోగం చేస్తున్న కొడుకుకు ఫోన్ చేసి అడిగాడు తండ్రి వెంకటేశం.

“హలో నాన్నా! మీరు అందరూ ఎలా ఉన్నారు? నాకు ఒక్క సంక్రాంతి పండుగ రోజున మాత్రమే సెలవు ఇస్తారు. ఆ ఒక్క రోజు కోసం ఇంటికి రాలేను. మీరే హైదరాబాద్ వచ్చేయండి. అయినా ఆ పల్లెటూరిలో ఏముంటుంది? అందుకే నువ్వు, అమ్మ, చెల్లి ఇక్కడికే రండి, నేను సిటీ మొత్తం చూపిస్తాను” అంటూ చెప్పాడు రవి.

“మేము బాగానే ఉన్నాము. నువ్వు ఎలా ఉన్నావురా? వేళకు భోజనం చేస్తున్నావా? నీకు ఒక్కరోజే శలవని చెప్పావు కదా. అంతవరకు బాగానే ఉంది. కానీ నువ్వు పుట్టిన ఊరు కన్నతల్లి లాంటిది. పల్లెటూరు అని తేలిగ్గా తీసి పారేయకురా. ఆ మట్టిని నమ్ముకుని బతుకుతున్నవాళ్ళం. ఆ భూమితల్లి ఇచ్చిన పంటల వల్లనే మనం నాలుగు మెతుకులు తింటున్నాము. ఈ రోజు నువ్వు మంచి కంపెనీలో పెద్ద ఉద్యోగంలో ఉన్నావంటే... ఈ నేలతల్లే కారణం తెలుసా?” అంటూ చెప్పాడు వెంకటేశం.

“నేను బాగున్నాను నాన్నా!. టైముకు భోజనం చేస్తున్నాను. పల్లెటూరని ఏదో సరదాగా అన్నాను క్షమించండి నాన్నా! నువ్వు ఇంకా ఈ వయసులో కష్టపడటం చూడలేక అలా అన్నాను. అంతేకాని మన ఊరంటే నాకు చాలా ఇష్టం, గౌరవం కూడా.”

“సరే... సరే ఫర్వాలేదు కానీ... ఇంతకూ శలవు తీసుకుని అయినా వస్తున్నావా? లేదా ఆ విషయం చెప్పు” అంటూ మరోసారి అడిగాడు వెంకటేశం.

“ఈ రోజే మా ఆఫీసులో లీవ్ అడుగుతాను. పండక్కి మన ఊరికి తప్పకుండా వస్తాను. అమ్మ చేతి వంటలు, పిండివంటల రుచి చూసి తీరాల్సిందే. మరో రెండు రోజులు ఎక్స్‌ట్రా లీవ్ పెట్టుకుని మరీ వస్తాను. అప్పుడే అమ్మకు, చెల్లికి చెప్పకండి నాన్నా! సడెన్‌గా వచ్చి చెల్లిని సరదాగా ఆట పట్టిస్తాను. ఉంటాను నాన్నా!” అంటూ ఫోన్ పెట్టేసి ఆఫీసుకి బయలుదేరాడు రవి.

................

కొద్ది రోజుల తర్వాత అనుకోకుండా తుఫాన్ రావడంతో భారీ వర్షాలు కురిసాయి. ఆ ఊరిలో రైతులు పండించిన పంటలన్నీ వాననీటిలో మునిగిపోయాయి. మరికొందరు రైతులు ఆరబెట్టుకున్న ధాన్యమంతా వాననీటిలో తడిసిపోయింది. టివిలో సైక్లోన్ న్యూస్ చూస్తున్న రవికి, తన ఊరిలో కూడా పంటనష్టం జరిగిందని తెలియగానే తండ్రి గురించి ఆలోచన వచ్చింది.

పంట మునిగిపోయిందనే దిగులుతో తన తండ్రి ఎక్కడ అతని ప్రాణాలమీదకు తెచ్చుకుంటాడోనని భయపడుతూ, ఆఫీసు పని పక్కన పెట్టి వెంటనే తండ్రికి ఫోన్ చేసాడు. ఇంట్లో ఎవరు ఫోన్ లిఫ్ట్ చేస్తారో, ఎలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందోనని ఊపిరి బిగబట్టి అరగంట పాటు ఎదురుచూసాడు రవి.

మరో అరగంట తర్వాత అవతలివైపు నుంచి తండ్రి గొంతు వినబడటంతో గుండెలో వణుకు తగ్గిపోయి రిలాక్స్ అయ్యాడు రవి.

“నాన్నా! నాన్నా! ఎలా ఉన్నారు? మీరు, అమ్మ, చెల్లెలు అందరూ క్షేమంగా ఉన్నారు కదా! గంట నుంచి మీకు ఫోన్ చేస్తున్నాను. మీ దగ్గర నుంచి రిప్లై లేకపోయేసరికి ఎంత గాబరా పడ్డానో తెలుసా! తుఫాన్ వల్ల మన ఊరిలో పంటలు మునిగిపోయాయని టివి న్యూస్‌లో చూసాను” అంటూ కంగారుగా అడిగాడు రవి.

“అవును రవీ! నాతో పాటు చాలా మంది రైతులు పంటలు నష్టపోయారు. కష్టపడి పండించిన పంటంతా వరద పాలైందిరా” అంటూ బాధ పడుతూ చెప్పాడు తండ్రి వెంకటేశం.

“అయ్యో నాన్నా! ఎంత కష్టం వచ్చింది. మీరు బాధపడవద్దు. అమ్మ, చెల్లి, మన ఊరివాళ్ళు జాగ్రత్తగా ఉండండి. మీకు నేను ఉన్నాను. మీరు అధైర్య ఉండండి. నేను రేపు ఉదయం బయలుదేరి వస్తున్నాను.” అంటూ తండ్రికి ధైర్యం చెప్పాడు రవి.



................

మరుసటి రోజు రవి తనతో పాటు ఇద్దరు ఫ్రెండ్స్‌ను తీసుకుని ఆ ఊరికి కారులో బయలుదేరాడు. ఊరిలోకి అడుగు పెట్టిన వెంటనే, తన కంప్యూటర్ సాయంతో రియల్ టైమ్ డేటాతో నష్టపోయిన రైతుల సంఖ్య,

పంటల రకాలు, నష్టపోయిన విస్తీర్ణం వంటి వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు సేకరించి ప్రభుత్వానికి పంపించి, నష్టపోయిన పంటల ఫోటోలు, వీడియోలు తీసి వ్యవసాయ అధికారులకు అందించాడు రవి.

ఇలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు గ్రామాలను ఎలా ఆదుకోవాలనే ఆలోచనతో, సమాచార సేకరణ సులభతరం చేసే విధానాన్ని కంప్యూటర్‌లో చూసి తెలుసుకునే ప్రయత్నంతో తాను యన్.జి.ఓ నడుపుతున్న విషయాన్ని తండ్రికి వివరంగా చెప్పాడు రవి.

తుఫాన్ చేసిన నష్టం గురించి కొంతమంది ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పంట నష్టపోయిన రైతులకు తక్షణం నష్టపరిహారం ఇప్పించేలా ఏర్పాటు చేసాడు రవి.

పంట నష్టపోయిన రైతులలో తన తండ్రి కూడా ఉన్నాడు. తడిసిపోయిన ధాన్యాన్ని కూడా సగానికి పైగా ధర పలికేలా చేసి... వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకు వచ్చేలా చేసాడు.

తాను కూడా తండ్రితో పాటు మరికొందరు రైతులకు కూడా ప్రస్తుత అవసరాల కోసం కొంత ఆర్థిక సహాయం చేసాడు రవి.

"ఓకే రవీ! మేము సిటీకి బయలుదేరుతాము" అంటూ రవి స్నేహితులు అడగటంతో "థాంక్యూ ఫ్రెండ్స్! నాకు చాలా హెల్ప్ చేసారు" అంటూ వారికి ఆనందంగా సెండాఫ్ ఇచ్చాడు రవి.

పల్లెలోని రైతులు అందరూ రవి చేసిన సహాయానికి ఎంతో సంతోషించారు.

సంక్రాంతి పండుగ రానే వచ్చింది. అందరి జీవితాలలో వెలుగులు నిండాయి. పండుగ రోజున రైతులందరూ వెంకటేశం ఇంటికి వెళ్ళి,

"రవీ! నువ్వు అందరిలాగే పట్నం వెళ్ళాక మమ్మల్ని మరిచిపోయావనుకున్నాము. ఎవరెవరో వచ్చి వానకు తడిసిపోయిన పంటలను చూసి... అక్కడ నిలబడి ఫోటోలకు ఫోజులు ఇచ్చి వెళ్ళిపోయారు కానీ, నువ్వు దగ్గరుండి మమ్మల్ని అన్ని విధాలా ఆదుకున్నావు. ఇది మాకు నిజమైన సంక్రాంతి పండుగ" అంటూ రవికి కృతజ్ఞతలు తెలిపారు పల్లె ప్రజలు.

అవును రవీ! నువ్వు మన పంటతల్లి ఋణమే కాదు, నువ్వు పుట్టిన పల్లె ఋణం కూడా తీర్చుకున్నావురా!నీ తండ్రిని అయినందుకు ఎంతో గర్వపడుతున్నాను. నువ్వు రావటం ఏ మాత్రం ఆలస్యం అయినా, పంటలతో పాటు మా జీవితాలు కూడా వరదనీటిలో మునిగిపోయేవి. అంతే కాకుండా నీ చెల్లెలితో పాటు ఈ ఊళ్ళో పిల్లల చదువుల ఖర్చులు కూడా నువ్వే చూసుకుంటున్నావని అమ్మాయి చెప్పింది.

ఈ రోజు ఈ ఊరిలో నిజమైన సంబరాల సంక్రాంతి పండుగ శోభ నీవల్లే వచ్చింది. మా జీవితాల్లో వెలుగులు నింపేందుకు వచ్చిన రవి కిరణానివి. నీలాంటి యువత అప్పుడప్పుడూ... ఇలా జన్మభూమిని ఆపదలో ఉన్నప్పుడు ఆదుకుంటే చాలు" అంటూ రవి భుజం మీద ప్రేమగా చేయి వేసి చెప్పాడు వెంకటేశం ఆనందబాష్పాలతో.

నాన్నా! నేను ముందు రైతుబిడ్డను. మీతో పాటు ఇక్కడ ఉన్న వారందరూ నా వాళ్ళే. మీరంతా దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు. ఇలాంటి సమయంలో మీలాంటి వారు ఆత్మహత్యలు చేసుకుంటూ పోతే, ప్రజల ఆకలి తీర్చేదెవరు?

చివరికి రైతులను, పొలాలు, ఎద్దులు, ఆవులను మన తర్వాత తరాల వారు మ్యూజియంలో చూడాల్సి వస్తుంది.

**"ఓకే రవీ! మేము సిటీకి బయలుదేరుతాము" అంటూ రవి స్నేహితులు అడగటంతో "థాంక్యూ ఫ్రెండ్స్! నాకు చాలా హెల్ప్ చేసారు" అంటూ వారికి ఆనందంగా సెండాఫ్ ఇచ్చాడు రవి.**

ఈ దేశంలో భూమిపై పగలనక, రేయనక శ్రమించి, చెమటోడ్చి మీరు పండించే పంటలను మీరే, కేవలం మీరు మాత్రమే పండించగలరు.

అలాగే తమ కుటుంబాన్ని విడిచిపెట్టి గడ్డ కట్టించే మంచుకొండల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శత్రుమూకల నుంచి మన దేశసరిహద్దులను కాపలా కాస్తున్న సైనికులు మాత్రమే దేశాన్ని కాపాడగలరు. అందుకే 'జై జవాన్, జై కిసాన్" అన్నారు.

అలాగే ఒక బాధ్యత గల పౌరుడుగా ఎప్పుడూ ఈ జన్మభూమి కోసం, మీ కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అంటూ మరోసారి అందరిలో ఆత్మవిశ్వాసం నింపుతూ తల్లిదండ్రుల వైపు, గ్రామప్రజల వైపు చూస్తూ వినయంగా నమస్కరించాడు రవి. ■

- నీకు పూర్తిగా అన్యాయం చేయడానికి నీ శత్రువులు, మిత్రులు కలసి పనిచేస్తారు. ఒకరు నిన్ను తిడుతుంటే, మరొకరు ఆ కబుర్లు నీకు మోసుకువస్తుంటారు. - మార్క్‌ట్వైన్

- డబ్బుతో స్నేహితుల్ని సంపాదించడం సులభమే కానీ, డబ్బు లేకుండా వారిని సంపాదించుకోవడం అసలైన గొప్పతనం. - క్రిష్టఫర్ బావిస్టర్

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

*sunmagvaartha@gmail.com*

కథాకళి FEED ME A STORY

మల్లాది వెంకట కృష్ణమూర్తి

# ప్రేమయాత్ర

ఇంటర్ ఫస్టియర్ చదివే అతనికి ఇంకొన్ని వారాల్లో పదిహేడు వస్తుంది. ఆ వయసులో శరీరంలోని హార్మోన్స్ ఉత్పత్తి వల్ల మానసిక, శారీరక అవసరమైన కోరిక పుడుతుంది. ఆ సమయంలో టీనేజర్ ప్రేమలో పడతాడు. అతని ప్రేమయాత్ర మొదలవుతుంది.

అతను తన క్లాస్‌మేట్ వాల్గంటితో ప్రేమలో పడ్డాడు. క్లాస్‌లోని ఇరవై ఏడుమంది అమ్మాయిల్లో వాల్గంటే అతన్ని ఎందుకు ఆకర్షించింది? ఇది సమాధానం లేని ప్రశ్న. ఎవరు ఎవరితో ఎందుకు ప్రేమలో పడతారనే దానికి ఇదమిత్థమైన కారణం పడ్డవాడితో సహా ఎవరూ చెప్పలేరు. దానికి 'కెమిస్ట్రీ' అనే ఆధునిక జవాబు స్థిరపడింది.

ఆమె తనని ప్రేమిస్తోందా అనే ప్రశ్న అతన్ని తొలచసాగింది. వాల్గంటి అతని మీద ఎలాంటి ప్రత్యేక ఆసక్తిని చూపించలేదు. ప్రేమయాత్రలో ఒకరు తమ ప్రేమని తెలియచేస్తే, రెండోవారు దాన్ని అంగీకరించాలి. అప్పుడు అది కొనసాగుతుంది. తిరస్కరిస్తే ఆ ప్రేమయాత్ర అంతటితో ముగుస్తుంది.

అతనికి తన ప్రేమని ఆమెకి తెలియచేయాలని ఉంది. కాని ఆ ధైర్యం చేయలేకపోయాడు. టీచర్‌కి చెప్తే? తిరస్కరిస్తే? తనని చెడ్డవాడిగా భావిస్తే లాంటి భయాలు అతనిలో కలిగాయి.

క్లాస్‌లోకి రాగానే ఆమె వచ్చిందా అని చూస్తాడు. కనపడకపోతే 'అసలు ఇవాళ వస్తుందా?' అనే అనుమానం అతన్ని బాధిస్తుంది. ఆమె వస్తే ఆనందం కలుగుతుంది. ఆమె ఎదురు పడినప్పుడు రెండు మూడు సార్లు చిరునవ్వులు నవ్వాడు. ఆమె అతనివైపు చూడకపోవడంతో అది గమనించలేదు. ఆమెకి తన ప్రేమ గురించి ఎలా తెలియచేయాలో అతనికి తోచలేదు. మధ్యవర్తి ఆలోచన వచ్చింది. కాని మిత్రుడి దగ్గర మాటలు నోట్లోంచి బయటికి రాలేదు.

ఓరోజు వాల్గంటి లంచ్‌లో కాలేజీ బయట బండి దగ్గర పానీపూరీ తింటూ కనిపించింది. అతను కూడా వాటిని తిన్నాడు. మొదటిసారి ఆమెతో మాట్లాడాడు.

''నీ డబ్బు కూడా నేను పే చేస్తాను.'' అతను చెప్పాడు.

''ఒద్దు.'' ఆమె జవాబు చెప్పింది.


తన డబ్బు చెల్లించి ఆమె వెళ్ళిపోయింది.

చివరికి అతను ఆమెకి ఉత్తరం ద్వారా తన ప్రేమని తెలియచేయాలని అనుకున్నాడు. నోట్ బుక్‌లోంచి ఓ కాగితం చింపి రాశాడు.

'డియర్ వాల్గంటి,

నువ్వు నాకు ఎందుకు నచ్చావ్ అని అడక్క. నా దగ్గర జవాబు లేదు. కాని నువ్వు నాకు బాగా నచ్చావు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు క్లాస్‌కి రాకపోతే నాకు చాలా డల్‌గా ఉంటుంది. నీకు నా ప్రేమని తెలియచేయకుండా ఉండలేకపోతున్నాను. ఐ లవ్ యు వెరీ మచ్...''

తర్వాత ఏం రాయాలో తెలీలేదు. దాన్ని మడిచి జేబులో ఉంచుకున్నాడు. ఆ ఉత్తరం ఎప్పుడు ఆమెకి ఇద్దామా అని తహతహగా ఉంది. అది అతని జేబులోనే ఉంది. అంతా చూస్తుండగా దాన్ని ఆమెకి ఇవ్వలేకపోతున్నాడు. ఆమె ఒంటరిగా చిక్కడం లేదు.



ఆమె తనని ప్రేమిస్తోందా అనే ప్రశ్న అతన్ని తొలచసాగింది. వాల్గంటి అతని మీద ఎలాంటి ప్రత్యేక ఆసక్తిని చూపించలేదు. ప్రేమయాత్రలో ఒకరు తమ ప్రేమని తెలియచేస్తే, రెండోవారు దాన్ని అంగీకరించాలి.

●●●

మర్నాడు ఓ సంఘటన జరిగింది. క్లాస్‌లోని టీచర్ ఓ విద్యార్థితో చెప్పాడు.

''నువ్వు ప్రిన్సిపాల్ దగ్గరకి వెళ్ళు. ఆయన పిలుస్తున్నారు.''

''దేనికి సర్?'' అతను లేచి నించుని అడిగాడు.

''తిరిగి వచ్చాక నువ్వే దానికి జవాబు చెప్పు.'' ఆయన చెప్పాడు.

అతను వెళ్ళిన పావుగంట తర్వాత వచ్చాడు. అతని మొహం వాడిపోయి ఉండటం అంతా గమనించారు. అతను తలవంచుకొని కూర్చున్నాడు. టీచర్ అతన్ని ఎందుకని అడగలేదు. అతనూ చెప్పలేదు. తర్వాత తోటి విద్యార్థులకి ఆ విషయం తెలిసింది. తమ క్లాస్‌మేట్ మరో క్లాస్ అమ్మాయికి ప్రేమలేఖని రాస్తే ఆమె దాన్ని తన తండ్రికి చూపించింది. ఆయన దాంతో ప్రిన్సిపాల్ దగ్గరకి వచ్చాడు. ఆవిడ ఆ ఉత్తరం చూసి మండిపడి, వెంటనే అతని తల్లితండ్రులని పిలిపించి వారి ముందే నానా చివాట్లు వేసింది.

''ఇంకోసారి ఇలా జరిగితే టీసీ ఇచ్చి పంపిస్తాను.'' హెచ్చరించింది.

''ఇష్టం లేకపోతే ఉత్తరం చింపేయాలి కదా?'' కొందరు చెప్పారు.

''నోటితో చెప్తే అంత దూరం వచ్చేది కాదుగా.'' మరికొందరు చెప్పారు.

అతను తన జేబులోని లేఖని చింపి డస్ట్ బిన్‌లో పడేశాడు. ఆ తర్వాత తన ప్రేమని వాల్గంటికి తెలియచేసే ప్రయత్నాన్ని విరమించుకోవడంతో అతని ప్రేమయాత్రకి అంతరాయం కలిగింది. ప్రేమ ఉధృతి మాత్రం తగ్గలేదు. ప్రేమలో పడి దాన్ని వ్యక్తం చేయకపోవడం ఎంత దుర్భర పరిస్థితి అనేది అతనికి అర్థమైంది.

త్వరలోనే ఇంటర్ ఫస్టియర్ చివరికి వచ్చింది. విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంగా పరీక్షలయ్యాక వాళ్ళ ప్లాన్స్ గురించి చెప్పుకుంటున్నారు. అతనికి మాత్రం సంతోషంగా లేదు. ఆఖరి క్లాస్ అయ్యాక అతను కాలేజీ ఆవరణలోంచి బస్ స్టాప్‌కి వెళ్ళాడు.

అక్కడ వాల్గంటి, మరికొందరు అమ్మాయిలు, అబ్బాయిలు నిల్చుని ఉన్నారు. అతన్ని చూడగానే వాల్గంటి చిరునవ్వు నవ్వింది. అతనూ బదులుగా నవ్వాడు.

''కాఫీ తాగుదామా? కేఫ్‌కి వెళ్దాం రా.'' ఆమె అతని దగ్గరికి వచ్చి చెప్పింది.

''కేఫ్‌కి?'' తడబడుతూ అడిగాడు.

''అవును. ఐ థింక్ ఐ ఫెల్ ఇన్ లవ్ విత్ యు.''

ఆమె నవ్వింది. ఆ బస్ స్టాప్ నుంచి ''24/7 కేఫ్'' కి అతని చేతిని పట్టుకుని నిర్భయంగా నడిచింది.

●

'ఫన్‌డే'లో ప్రచురితమయ్యే ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.
kathakalisakshi@gmail.com

14 వ పేజీలో..
26-7-2026 సంచిక 'కథాకళి'కి పేరు సూచించిన పాఠకుల పేర్లు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# పరిపాలకుడికి అత్యాశ ఉండకూడదు

**రాజర్థాతురుడైనచో నెచట ధర్మంబుండు నేరీతి నా**
**నా జాతిక్రియ లేర్పడున్ సుఖము మాన్యశ్రేణికెట్లబ్బు రూ**
**పాజీవాళికి నేది దిక్కు ధృతి నీ భక్తుల్ భవత్పాద నీ**
**రేజంబుల్ భజియింతు రే తెఱగునన్ శ్రీకాళహస్తీశ్వరా!**

ప్రజలను పరిపాలించే రాజుకి ధనం మీద అత్యాశ కలిగి ఉంటే, అతనిలో సత్ప్రవర్తనం ఎలా ఉంటుంది. రకరకాల వర్ణాల వారి పనులు ఏవిధంగా జరుగుతాయి. గౌరవనీయ స్థానంలో ఉన్నవారి మనస్సులకు ప్రశాంతత ఎలా ఉంటుంది? నీ భక్తులు ధృతిమంతులై నీ చరణ కమలాలను ఎలా సేవిస్తారు..? అని ధూర్జటి మహాకవి 'శ్రీకాళహస్తీశ్వర శతకము' లో చెప్తున్నాడు.

మంచి నడవడిక, ధర్మానికి బద్ధుడైన రాజులు చాలా అరుదుగా కనిపిస్తారు. డబ్బు మీద అత్యాశ కలిగిన రాజులే ఎక్కువమంది ఉంటారు. 'ప్రభుర్ధనపరాయణః' పరిపాలకుడైన రాజుకి డబ్బు మీదే వ్యామోహం ఉంటుంది అనేమాట అందుకే వ్యాప్తిలోకి వచ్చింది. డబ్బు మీద వ్యామోహం ఉన్న ప్రభువుల పరిపాలనలో ధర్మం మొదలైన మంచి గుణాలకు అవకాశం ఉండదు. 'యథా రాజా తథా ప్రజా' అన్న చందాన ప్రజలంతా ప్రభువునే అనుసరించి, మోసాలు చేస్తూ డబ్బు సంపాదిస్తుంటారు.

'అర్థాతురాణాం నగురుర్నబన్ధుః' డబ్బు మీద వ్యామోహం ఉన్నవాళ్లకి గురువు, బంధువు అనే తేడాలు ఉండవు. ఎంత అధర్మం చేసైనా సరే డబ్బు సంపాదించడమే లక్ష్యంగా జీవిస్తారు. ధర్మానికి విఘాతం కలుగకూడదంటే రాజు అత్యాశాపరుడై ఉండకూడదు. అప్పుడే ఆ రాజ్యంలోని అన్ని వర్ణాల వాళ్లు తమ విధులను చక్కగా నిర్వహించగలుగుతారని ఈ పద్యం చెప్తోంది.

దిలీప మహారాజు గురించి కాళిదాసు 'రఘువంశం' కావ్యంలో 'త్యాగాయ సంభృతార్థానాం..సత్పాత్రదానం కోసమే ధనం పోగుచేసేవారు..' అంటే.. తన ప్రజలలో అర్హులైన వారికి దానం చేయడం కోసమే ధనాన్ని సముపార్జించేవాడని చెప్తాడు. పరిపాలించే రాజుకి ఉండవలసిన లక్షణం అది. దిలీప మహారాజు తరవాత వచ్చిన ఆ వంశపు రాజులందరూ సత్పాత్రదానం కోసం మాత్రమే ధనం ఆర్జించారు. రాముడి పరిపాలనలో ప్రజలంతా సుఖశాంతులతో ఉన్నారు కనుకనే నేటికీ 'రామరాజ్యం' అనే పేరు నిలబడిపోయింది.



భారతదేశంలో ఉన్న సంపదలు చూసి దురాశపడిన విదేశీయులు ఈ దేశం మీద దండెత్తి వచ్చి, అత్యాశతో ధనాన్ని దోచుకుపోయారు. ఆ ధనం కోసం ఎంతోమంది ప్రజలను హింసించారు. ప్రపంచ విజేత అని పేరుపొందిన గ్రీకు వీరుడు అలెగ్జాండర్ తన చివరి కోరికగా తన రెండుచేతులనూ పైకి పెట్టి సమాధి చేయమన్నాడు. 'మనం ఎంత సంపాదించినా మన వెంట ఏదీ రాదు మనం ఖాళీ చేతులతో వెళ్తాము' అనే విషయాన్ని ప్రపంచానికి తెలియజేసేందుకు గాను తన చేతులను ఆ విధంగా ఉంచమన్నాడని చరిత్ర చెప్తోంది.

రావణాసురుడు..తన దగ్గర ఉన్న సంపదతో సంతృప్తి చెందలేదు. ఇంకా ఇంకా కావాలనుకున్నాడు. కుబేరుడి మీద యుద్ధం చేసి, సంపదలతో పాటు పుష్పక విమానాన్ని కూడా అపహరించాడు. రావణాసురుడు అత్యాశతో ఇంత సంపాదించాడు. ఆ అత్యాశతోనే చేసిన పనుల వలన వంశనాశనానికి కారకుడయ్యాడు.

ధనాశకు దుర్యోధనుడు ఉత్తమ ఉదాహరణ. పాండురాజు సంపాదించిన సంపదలను కౌరవులకు, పాండవులకు సమానంగా పంచారు. రాజసూయ యాగం చేసే సమయంలో పండితులకు, విప్రులకు, అవసరంలో ఉన్నవారికి దానం చేయడం కోసం అందరు రాజులను జయించి, ధనం సంపాదించారు. రాజసూయ యాగం పూర్తి కాగానే అర్హులైనవారందరికీ ఆ సంపదలను దానం చేశారు. అది చూసి దుర్యోధనుడు ఈర్ష్య చెందాడు. ఎలాగైనా సరే పాండవుల సంపదలు అపహరించాలనుకున్నాడు. శకుని సహాయంతో పాండవులతో మాయా జూదం ఆడాడు. అందులో పాండవులు సకల సంపదలు పోగొట్టుకున్నారు. ఒప్పందం ప్రకారం పదమూడు సంవత్సరాల పాటు అరణ్యఅజ్ఞాత వాసాలు పూర్తి చేసి తిరిగి వచ్చారు. అనుకున్న ప్రకారం తమ రాజ్యాన్ని తమకు ఇవ్వమని కోరారు. ధనంపై వ్యామోహం ఉన్న దుర్యోధనుడు అందుకు నిరాకరించాడు. కనీసం ఐదుగురికి ఐదు ఊళ్లు ఇమ్మన్నారు పాండవులు. 'వాడి సూది మొన మోపినంత భూమిని కూడా ఇవ్వను' అన్నాడు అత్యంత ధనాశాపరుడైన దుర్యోధనుడు. చివరకు చేసేది లేక పాండవులు కౌరవులతో యుద్ధం చేశారు. పదకొండు అక్షౌహిణీల సైన్యం ఆ యుద్ధంలో మరణించారు. తన అత్యాశతో మొత్తం వంశనాశనానికి కారకుడయ్యాడు దుర్యోధనుడు. అందుకే 'సంతృప్తిని మించిన ధర్మం లేద'ని పెద్దలు చెప్తారు.

- డా. పురాణపండ వైజయంతి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
8 09 ఆదివారం, ఆగస్టు 2026

నిజం నిలకడగా నివాసం ఉండాల్సింది- మనిషి హృదయంలో... పైపై పెదవులపై కాదు.
☛ శరత్ చంద్రుడు






కథ

# అమ్మ చెప్పింది

సాయంత్రం ఇంటి గంట కొట్టగానే చాలా మంది పిల్లలు ఇళ్లకు వెళ్లిపోయారు. కొంతమంది పిల్లలు మాత్రం బడి చుట్టూ ఉంటే జాగాలో ఆడుకుంటున్నారు. బడి ముందర ఉండే జామ చెట్టు కింద కూర్చుని, వాళ్ల అమ్మ వస్తుందని ఎదురుచూస్తూ కూర్చున్నాడు గౌతమ్. ఇంతలో కొంతమంది పెద్ద తరగతుల పిల్లలు జామచెట్టు, సపోటా చెట్లు ఎక్కి పచ్చి పిందెలను తెంపి, కొరికి వగరుగా ఉన్నాయని పడేస్తున్నారు. కొందరు చెట్ల కొమ్మలు పట్టుకుని ఊగుతూ, కొమ్మలు విరిచి పడేస్తున్నారు. పూలమొక్కలు తొక్కి, మొగ్గలు కోసి పాడుచేస్తున్నారు. అంతా చూస్తున్న గౌతంకి వాళ్ల అమ్మ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. వాళ్ల దగ్గరకి వెళ్లి 'అన్నా..! ఎందుకు చెట్లను విరిచి పాడుచేస్తున్నారు. వాటికి కూడా ప్రాణముంటుంది తెలుసా. పాపం అవి బాధ పడతాయి' అన్నాడు చేతులూపుతూ...

'మాకు తెలుసులే. వేలెడంత లేవు. నువ్వు మాకు నీతులు చెప్తావా. పోరా...పోయి నీ పని చూసుకో పో' అని ఎగతాళిగా నవ్వి, కావాలని ఒక చిన్న మొక్కను వేళ్లతో సహా పెరికి పారేసాడు నవీన్. మిగతా వాళ్లు పగలబడి నవ్వారు. వాళ్లంతా ఐదో తరగతి చదువుతున్నారు. తను చెప్తే వాళ్లు వినలేదు సరికదా, తనని తిడుతున్నారు. ఇపుడు ఏం చేయాలి అనుకుంటూ, తనకి వచ్చిన ఆలోచనని అమలుపరచడానికి వెళ్లాడు. నేరుగా హెడ్ మాస్టర్ కరుణాకర్ సార్ గది దగ్గరకి వెళ్లాడు. చిన్న పిల్లాడు తన గదికి రావడం ఆయనకి ఆశ్చర్యం కలిగించింది 'గౌతమ్...ఏంటి ఇలా వచ్చావు...!' అన్నాడాయన.

హెడ్ మాస్టర్ కళ్లల్లోకి సూటిగా చూస్తూ 'సార్. మరేమో అక్కడ పెద్ద అన్నా వాళ్లు చెట్లను పాడుచేస్తున్నారు. జామచెట్టుఎక్కి కొమ్మలు విరిచేస్తున్నారు. పూల చెట్లు తొక్కేస్తున్నారు. చెట్లకు ప్రాణముంటుంది తుంచకూడదు అని చెప్తే నన్ను కోప్పడుతున్నారు' అంటూ తాను చూసిందంతా చూసినట్లు ధైర్యంగా చెప్పాడు.

'శెభాష్ గౌతమ్. ఇప్పుడే మనం వెళ్లి చెట్లను పాడుచేసినందుకు వాళ్లకు తగిన శిక్ష వేసి, బుద్ధి చెపుదాం. చెట్లకు ప్రాణముంటుందని నీకు ఎవరు చెప్పారు?' వాడి అమాయకమైన మాటలకి ముచ్చటేసి అడిగాడు హెడ్ మాస్టర్.

'మా అమ్మ చెప్పింది సార్' అన్నాడు కళ్లు చక్రాల్లా తిప్పుతూ. గౌతమ్ చేయి పట్టుకుని చెట్లు ఉన్న దగ్గరికి వెళ్లాడు హెడ్ మాస్టర్.


గౌతమ్ చెప్పినట్లే అక్కడ పెద్దపిల్లలు చెట్ల మీదికి ఎక్కి, కొమ్మలు విరిచేస్తున్నారు. వాళ్లు తుంచి పారేసిన మొగ్గలు, కొమ్మలు ఆటస్థలంలో పడివున్నాయి. హెడ్ మాస్టర్ రావడంతో పిల్లలందరూ చెట్లమీది నుంచి దూకి పారిపోవడానికి ప్రయత్నించారు. కొంతమంది పిల్లలు అప్పటికే వెళ్లిపోయారు. ఇంతలో గౌతమ్ వాళ్ల అమ్మ వసుధ స్కూల్ దగ్గరకు వచ్చింది. గౌతమ్ తనకి చెప్పిన విషయాలు ఆమెకి చెప్పి, గౌతమ్‌ని మంచి మార్గంలో నడిపిస్తున్నారు అని ఆమెని ప్రశంసించాడు. పక్కరోజు పొద్దున గౌతమ్‌తో పాటు ఆమెని కూడా స్కూలుకి రమ్మని చెప్పాడు.


మర్నాడు గౌతంతో పాటు, వాళ్ల అమ్మ కూడా స్కూల్‌కి వచ్చింది. అసెంబ్లీ ప్రారంభమై, ప్రార్థనా గీతం పూర్తికాగానే గౌతమ్‌ని స్టేజి మీదకి రమ్మని పిలిచాడు హెడ్ మాస్టర్. గౌతమ్ స్టేజి మీదకు వెళ్లగానే, పిల్లలందరికీ గౌతమ్‌ని చూపిస్తూ 'ఈ చిన్నారి విద్యార్థి గౌతమ్. రెండో తరగతి చదువుతున్నాడు. నిన్న కొందరు పెద్దపిల్లలు బడిలో ఉన్న చెట్లను పాడుచేస్తుంటే చూసి, వాళ్ల దగ్గరికి వెళ్లి చెట్లను పాడుచేయకూడదు అని చెప్పాడు. వాళ్లు వినకపోయేసరికి, ధైర్యంగా నా దగ్గరకు వచ్చి, వాళ్లు చేసిన పనిని నాకు చెప్పాడు. నిన్న గౌతమ్‌ని తిట్టిన వాళ్లు నిలబడండి. మీరెవరో నాకు తెలుసు' అన్నాడు హెడ్ మాస్టర్ కరుణాకర్ ఐదోతరగతి పిల్లలు కూర్చున్న వైపు చూసి. ఇక తప్పదు అన్నట్లు నిలబడ్డారు కొందరు పిల్లలు. వారంతా ముందురోజు చెట్లను తుంచి, పాడుచేసినవాళ్లు. వాళ్ల చేత గౌతమ్‌కి సారీ చెప్పించాడు హెడ్ మాస్టర్.

చెట్లు మనకి చాల రకాలుగా ఉపయోగ పడతాయి. ఆహారాన్ని, ఆహ్లాదాన్ని ఇస్తాయి. ఇళ్లు కట్టుకోవడానికి కలపను ఇస్తాయి. చాలారకాల పక్షులు, కీటకాలు, కొన్ని రకాల జంతువులకు ఆశ్రయాన్నిస్తాయి. ముఖ్యంగా జీవులన్నింటికీ ప్రాణవాయువుని ఇచ్చి, మన ప్రాణాలను నిలబెడతాయి చెట్లు. అటువంటి చెట్లను పాడుచేయడం తప్పు. ఇంకోసారి ఎవరైనా చెట్ల పైకి ఎక్కి, పిందెలు కోయడం, కొమ్మలు విరిచేయడం, మొగ్గలను తుంచడం లాంటివి చేస్తే వాళ్లను తప్పకుండా శిక్షిస్తాను.

చెట్లను కాపాడమని చెప్పిన గౌతమ్‌కి ఓ చిరు బహుమతి అంటూ గౌతమ్ చేతికి ఒక మంచి పెన్ను ఇచ్చాడు హెడ్ మాస్టర్ కరుణాకర్. పిల్లలందరూ చప్పట్లు కొట్టారు. మంచి విషయాలు నేర్పుతున్న గౌతమ్ వాళ్ల అమ్మను కూడా హెడ్ మాస్టర్, ఇతర టీచర్స్ ప్రశంసించారు.


రోహిణి వంజారి, 9000594630





దిగువన కనిపిస్తున్న ముగ్గురు చిన్నారులు ఇక్కడున్న చిలుక, కుందేలు, కుక్కపిల్ల దగ్గరకు ఈ గజిబిజి దారిగుండా ఎవరూ ఎలా చేరుకుంటారో ఆ దారి కనుక్కోండి!

దారి కనుక్కోండి!



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# పంచ భూతాలు



సాయంకాలం తాతయ్య వరండాలో కూర్చుని పుస్తకం చదువుతున్నాడు. ఇంటి ఆవరణలో మనవళ్లు కృతిన్, అద్విక్, అభి, విహాన్ ఆడుకుంటున్నారు. వాళ్లలో ఇద్దరు ఆరో తరగతి, మరో ఇద్దరు ఏడో తరగతి చదువుతున్నారు. అందరూ కలిసి తాతయ్య దగ్గరకు వెళ్లారు.

"రా.. తాతయ్యను కాస్త ఆట పట్టిద్దామా!" అని నవ్వుతూ అన్నాడు కృతిన్.

"అవున్నా! వీడియో గేమ్స్ ఎక్కువ ఆడొద్దంటాడు" అన్నాడు అద్విక్.

"నిన్న బర్గర్, పిజ్జా తినమంటే.. 'ఇవి ఆరోగ్యానికి మంచివి కావని చెప్పాడు'' అన్నాడు అభి.

"మొన్న నాన్నతో కలిసి మార్కెట్ నుంచి వస్తుంటే, నా చేతిలో ఉన్న ప్లాస్టిక్ కవర్ చూసి 'ఇంట్లో నుంచి వేరే కవర్ తీసుకెళ్లొచ్చు కదా' అన్నాడు" అని గుర్తు చేశాడు విహాన్.

నలుగురూ ఒకరినొకరు చూసుకుని సైగ చేసుకుని నవ్వుకున్నారు. "తాతయ్యను ఒక ప్రశ్నతో ఇరికిద్దాం!" అని నిర్ణయించుకున్నారు.

"తాతయ్యా.. 'భూతం' అంటే దెయ్యం కదా?" అని అభి అడిగాడు.

తాతయ్య చిరునవ్వుతో తల ఊపాడు.

వెంటనే విహాన్ అడిగాడు, "మరి 'పంచభూతాలు' అంటే..?"

తాతయ్య పుస్తకం మూసి, పిల్లల వైపు చూస్తూ అన్నాడు.. "సంస్కృతంలో 'భూతం' అంటే కేవలం దెయ్యం మాత్రమే కాదు. 'ఉన్నది', 'ప్రాణి' అనే అర్థాలూ ఉన్నాయి. భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశం.. ఈ ఐదింటినే పంచభూతాలు అంటారు."

"అయితే మేము అడిగిన భూతం వేరే కదా!" అని సందేహంగా అడిగాడు అద్విక్.

తాతయ్య నవ్వాడు.

"అవును. ఇప్పుడు నేను చెప్పే పంచభూతాలు మీ జీవితాల్లో తిరుగుతున్నవి. అవి కనిపించవు.. కానీ నెమ్మదిగా మంచి అలవాట్లను దూరం చేస్తాయి."

పిల్లలందరూ ఆసక్తిగా వింటున్నారు.

"మొదటి భూతం.. [illegible] ఫుడ్. రుచిగా ఉంటుంది కానీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.

రెండో భూతం.. వీడియో గేమ్స్‌కు బానిస కావడం. ఆటలు ఆడొచ్చు, కానీ సమయానికి హద్దు ఉండాలి.

మూడో భూతం.. ప్లాస్టిక్ అధికంగా ఉపయోగించడం. అది ప్రకృతికి హాని చేస్తుంది.

నాలుగో భూతం.. క్రమశిక్షణ లేకపోవడం. సమయానికి చదవకపోవడం, నిద్రపోకపోవడం, మాట వినకపోవడం అన్నీ ఇందులోకే వస్తాయి.

ఐదో భూతం.. దుబారా ఖర్చులు. అవసరం లేని వాటికి డబ్బు ఖర్చు చేస్తే, అవసరమైనప్పుడు ఇబ్బందులు వస్తాయి."

కొద్దిసేపు నిశ్శబ్దం అలుముకుంది.

కృతిన్ మెల్లగా "తాతయ్యా.. ఈ భూతాలు నిజంగా మన చుట్టూ ఉన్నాయే! మరి ఎలా?" అన్నాడు.

"అవును", అని తాతయ్య చిరునవ్వుతో "ఈ భూతాలను తరిమేయడానికి మంత్రాలు అవసరం లేదు. మంచి అలవాట్లు ఉంటే చాలు" అన్నాడు.

అభి "ఇకపై జంక్ ఫుడ్ మానేస్తాను."

"నేను వీడియో గేమ్స్ జోలికి వెళ్లకుండా ప్రయత్నిస్తాను" అన్నాడు అద్విక్.

"నేను ప్లాస్టిక్ కవర్లు వాడను" అన్నాడు విహాన్.

"నేను అవసరం లేని ఖర్చులు చేయను" అన్నాడు కృతిన్.

తాతయ్య వాళ్ల నలుగురినీ ప్రేమగా దగ్గరకు తీసుకుని, "అదే నాకు కావాల్సిన సమాధానం. ఒక్కొక్కరు ఒక్కో మాట ఇచ్చారు. కానీ అందరూ అన్నీ పాటిస్తే ఇంకా మంచిది" అన్నాడు.

"అలాగే తాతయ్య" అన్నారంతా.

వాళ్ల కాన్ఫిడెన్స్ చూసి.. "ఇప్పుడర్థమయ్యిందా? చెడు అలవాట్లే అసలు భూతాలు. వాటిని మంచి అలవాట్లతోనే జయించాలి" అన్నాడు.

ఆ రోజునుంచి ఆ నలుగురు మనవళ్లు ఆ ఐదు భూతాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. మంచి అలవాట్లతో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడం మొదలుపెట్టారు.

**- ఓట్ర ప్రకాష్ రావు**

వెలుగు దినపత్రిక

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ABN ఆంధ్రజ్యోతి

balajyothy
బాలజ్యోతి

# శ్రమ విలువ

ఆనందయ్య అనే ఒక కుమ్మరి తాత ఉండేవాడు. ఆయన మట్టి బొమ్మలు, కుండలు ఎంతో నైపుణ్యంతో చేసేవాడు.

ఒకరోజు ఉదయం ఆనందయ్య తన మనవడు వాసును పిలిచి "రాబోయే వేసవికి ఊరిలో బడి కోసం అతి పెద్ద నీళ్ళ రంజన్ తయారుచేద్దాం. దానిని చూసి ఊరి పిల్లలంతా సంతోషపడాలి" అని చెప్పాడు. అందుకు సరే అన్నాడు వాసు.

మరుసటి రోజు తాతా మనవళ్ళు కలిసి ఊరి చివర ఉన్న చెరువు దగ్గరకు వెళ్ళి, మెత్తని బంకమట్టిని తీసుకొచ్చారు. ఆ సమయంలో చెరువు కట్ట దగ్గర నివసించే రాజు అనే కుర్రాడు కూడా మట్టిని మోయడంలో తాతకు సాయం చేశాడు. తానూ ఆ రంజన్ నిర్మాణంలో పాలుపంచుకోవాలనుకున్నాడు. మట్టిని శుభ్రంచేసి, నీళ్లు చిలకరించి మెత్తగా చేసే క్రమంలో రాజు తొందరపాటు వల్ల మట్టి బురదగా మారింది. దాంతో ఆనందయ్య "రాజూ! నీకు ఇంకా ఈ పనిలో ఓపిక, నైపుణ్యం రాలేదు. నువ్వు పక్కనే ఉండి చూడు, లేకపోతే శ్రమంతా వృథా అవుతుంది" అని మందలించి పక్కకు తప్పించాడు. ఆ మాట రాజు మనసులో తీవ్రంగా గుచ్చుకుంది.

"చెరువు నుండి మట్టి మోసుకొచ్చింది నేను. తాత నా శ్రమను గుర్తించకుండా, అందరిముందూ నన్ను పనికిరానివాడిగా తీసి పారేశాడు" అనే ఆవేదన చెందాడు. క్రమంగా రాజు మనసులో ఆక్రోశం గూడు కట్టుకుంది.

వేసవి వచ్చేసరికి ఆనందయ్య రంజన్ తయారుచేశాడు. రంజన్‌ను కాల్చి, దానిపై అందమైన నెమళ్ళు, పువ్వుల బొమ్మలు వేసి సిద్ధం చేశాడు. బడి ప్రాంగణంలో రంజన్‌ను ప్రదర్శనకు ఉంచినప్పుడు పిల్లలంతా చప్పట్లు కొడుతూ ఆనందయ్యను, వాసును పొగుడుతుంటే రాజు కోపం కట్టలు తెంచుకుంది.



'నేను మోసుకొచ్చిన మట్టితోనే ఇది తయారైంది. కానీ నన్నెవరూ గుర్తించడం లేదు!' అనే భావోద్వేగం క్షణికావేశంగా మారింది. "నా చేతిలో ఉన్న ఈ చిన్న రాయితో దీన్ని క్షణంలో లేకుండా చేయగలను!" అంటూ, పిల్లలు వారించేలోపే రాయితో ఆ రంజన్ మీద బలంగా కొట్టాడు.

రంజన్ వంద ముక్కలైంది!

తాత కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. ఆవేశం తగ్గగానే, పగిలిన ముక్కలను, తాత బాధాకరమైన ముఖాన్ని చూసి రాజుకు తాను చేసిన తప్పు తెలిసి వచ్చింది. తల దించుకున్నాడు.

అప్పుడు ఆనందయ్య రాజు దగ్గరకు వచ్చి "రాజూ! రంజన్ తయారీకి అవసరమైన మట్టి మోయడంలో నీ శ్రమ కూడా ఉంది. నిజమే. కానీ దాన్ని ఆరబెట్టి, రూపం ఇచ్చి, రంగులు అద్ది ఈ రంజన్‌గా మార్చడానికి నాకు ఏడాది పట్టింది. నీ శ్రమకు గుర్తింపు రాలేదనే ఆవేశంలో, రాయితో కొట్టి నా ఏడాది శ్రమను నాశనం చేయడానికి నీకు ఒక్క క్షణం కూడా పట్టలేదు. నిర్మించడంలోని కష్టాన్ని గుర్తించకుండా... నాశనం చేయడం వల్ల, నీ శ్రమకు కూడా విలువ లేకుండా పోయింది కదా! శ్రమ విలువ తెలిస్తే అలా చేసేవాడివి కాదు" అన్నాడు. దాంతో నిర్మించడానికి ఎంతో ఓపిక, కష్టం, సమయం కావాలి. నాశనం చేయడానికి ఒక్క క్షణం చాలని తెలుసుకుని రాజు తాత కాళ్ళపై పడి క్షమాపణ అడిగాడు.

**- డా.పోతగాని సత్యనారాయణ**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# శ్వేతాశ్వం

• దేగల అనితాసూరి



పిల్లల కథ

కుండిన రాజ్యం రాజు ప్రతాపవర్మకు కాంచనవల్లి ఒకతే కూతురు. ఆమెకు అన్ని విద్యలూ నేర్పాడు. తనకు కొడుకులు లేరని తెలిస్తే, పొరుగు రాజ్యాల రాజులు ఎక్కడ దండెత్తి వస్తారోననే భయంతో తనకు ఏకైక కుమారుడు ఉన్నట్లు, అతడి పేరు కాంచనవర్మ అని లోకాన్ని మభ్యపెట్టసాగాడు.

కాంచనవల్లి తరచుగా మగవేషంలో వనవిహారానికి, దేశాటనకు వెళుతూ వుండేది. అలా ఒకసారి తన భటులు, మగవేషం ధరించిన కొందరు చెలికత్తెలతో వనవిహారానికి వెళ్ళినప్పుడు ఒక పచ్చగడ్డి బయలులో గడ్డిమేస్తున్న మేలుజాతి శ్వేతాశ్వం కనిపించింది.

దాన్నిచూసి ముచ్చటపడిన కాంచనవల్లి– తన భటులకుచెప్పి, అశ్వశాలకు తరలించింది. ఆరాత్రి ఎంతసేపటికీ ఉదయం అడవి నుంచి తెచ్చిన శ్వేతాశ్వం మీది ఆలోచనలే కలుగుతుండటంతో ఒకసారి చూడాలని అశ్వశాలకు వెళ్ళింది. కాని, అక్కడ గుర్రానికి కట్టిన తాడు మాత్రమే ఉంది తప్ప, గుర్రం కనిపించలేదు. అశ్వశాల కాపలాదారును అడిగితే, వణికిపోతూ తాను జాగ్రత్తగానే కాపలా ఉన్నానని, కానీ గుర్రం ఎలా మాయమైందో తెలియలేదని చెప్పాడు. యువరాణి మర్నాడు తగిన చర్యలు తీసుకోవచ్చుని, తన మందిరానికి తిరిగివచ్చి నిద్రపోయింది.

ఉదయాన్నే అశ్వశాల కాపలాదారు పరుగు పరుగున వచ్చి, గుర్రం అశ్వశాలలోనే ఉందని చెప్పాడు. కాంచనవల్లి వెళ్ళి గుర్రాన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఆరోజు రాత్రి ఎవరికీ చెప్పకుండా చీకటిపడగానే అశ్వశాల దగ్గర రహస్యంగా కాపుకాసి గుర్రాన్నే పరికిస్తూ ఉండగా ఉన్నట్టుండి ఎవరూ లేని సమయంలో శ్వేతాశ్వం ఒక అందమైన రాజకుమారుడిగా మారి ఆకాశంలోకి ఎగిరెళ్ళిపోయాడు. ఆశ్చర్యంతో ఇదంతా గమనించిన కాంచనవల్లి మర్నాడు సాయంత్రమే గుర్రాన్ని తనమందిరంలో కట్టేయించింది. చీకటివేళకి గుర్రం మనిషిగా మారే సమయంలో పెద్ద పంజరంలో ఎగరనివ్వకుండా బంధించి 'ఎవరు నువ్వు?' అని అడిగింది.

దానికతను గిర్రున తిరుగుతూ, 'నేను మాళవరాజ్య యువరాజును. ఒక గంధర్వకాంత అడవిలో విహరిస్తుండగా, తనను చూసినందుకు ప్రతిరాత్రి మనిషిగా మారి ఆకాశంలో గిరికీలు కొట్టమని, పగలు శ్వేతాశ్వంగా బతకమని నన్ను శపించింది' అని చెప్పాడు. అతని కథ విని విచారించిన కాంచనవల్లి, శాపవిమోచనం గురించి అడిగింది.

'ఊరికి ఉత్తరాన ఉన్న శ్మశానంలో ఒకరాత్రి నిద్రచేసిన అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే నాకు శాపవిమోచనం కలుగుతుందని గంధర్వకాంత చెప్పింది. అలాంటి అమ్మాయి కోసం ప్రతిరోజూ ప్రయత్నిస్తున్నాను. కానీ, భయంవల్ల ఎవరూ సాహసించడం లేదు' అని చెప్పి వాపోయాడు రాజకుమారుడు.

అప్పుడు కాంచనవల్లి నవ్వి 'త్వరలోనే నీకోరిక నెరవేర్చుతాను' అని పలికి తన మందిరంలోనే అశ్వాన్ని వుంచి కాపలాదారుల్ని పెట్టింది.

మరునాటి రాత్రి యువరాణి కనిపించక రాజు, రాణి కంగారు పడ్డారు. సైనికులు నలుదిక్కులా వెదకడానికి వెళ్ళారు.

తెలతెలవారుతుండగా కాంచనవల్లి తానే గుర్రంపైన కోటలోకి ప్రవేశించింది. అదిచూసి రాజు 'రాత్రంతా ఏమైపోయావు' అని కంగారుగా అడిగాడు. ఆమె నేరుగా శ్వేతాశ్వం దగ్గరికెళ్ళి 'ఈ గుర్రాన్ని పెళ్ళికొడుకులా అలంకరించండి. రాత్రికి నేను పెళ్ళాడుతాను' అని చెప్పి, తన మందిరానికి వెళ్ళి వివాహానికి కావలసిన ఏర్పాట్లలో మునిగిపోయింది.

అందరూ అయోమయంతో పెళ్ళిసన్నాహాలు పూర్తిచేశాక, చీకటివేళ పీటమీద నిలబడ్డ గుర్రం రాజకుమారుడిగా మారాడు. వెంటనే కాంచనవల్లి తన మెడలో తాళి కట్టి శాప విమోచన పొందమని చెప్పగానే, రాజకుమారుడు ఆమె మెడలో తాళి కట్టాడు. అప్పుడు కాంచనవల్లి, తాను రాత్రంతా ఈ యువరాజుని శాపవిముక్తుడిని చేసి పెళ్ళాడాలని సంకల్పించుకుని, శ్మశానంలో ఒంటరిగా గడిపి వచ్చానని చెప్పింది.

యువరాజుకి శాపవిముక్తి కలిగి మరెపుడూ అశ్వంగా మారలేదు. మాళవ రాజ్యంతో పాటు కాంచనవల్లితో కలిపి కుండిన రాజ్యాన్ని కూడా కలుపుకుని చాలాకాలం హాయిగా పరిపాలన సాగించాడు.

## హితవచనం

**అకృత్యం నైవ కర్తవ్యం ప్రాణత్యాగేపి సంస్థితే**
**న చ కృత్యం పరిత్యాజ్యమేష ధర్మః సనాతనః**

**ప్రాణం పోయే పరిస్థితి ఎదురైనా, చేయరాని పని చేయకూడదు. చేయతగిన పని చేయడం మానకూడదు. ఇదే సనాతన ధర్మం.**

## కిసుక్కు

'మీరు రోజూ ఇదే ట్రెయిన్‌లో ప్రయాణిస్తుంటారా అంకుల్?' టికెట్ కండక్టర్‌ని అడిగాడు బుడుగు.

'పన్నెండేళ్ళుగా ప్రయాణిస్తూనే ఉన్నా... ఇదే కదా నా డ్యూటీ' చెప్పాడు టికెట్ కండక్టర్.

'అబ్బో! పన్నెండేళ్ళ నుంచే! ఇంతకీ ఏ ఊరికి వెళుతున్నారు అంకుల్?' అడిగాడు బుడుగు.

# అల్లరి

ALLARI




## కనుక్కోండి



పై బొమ్మ సరైన నీడ ఏదో కనుక్కోండి.

- నూతిలో పాము. నూరు వరహాలిచ్చినా బయటికి రాదు?
  - నాలుక
- శాస్త్రం చెన్నప్ప. నేల గీరప్ప. మూల నక్కప్ప?
  - పార
- స్నానం చేస్తే తడవదు. పొయ్యిలో వేస్తే కాలదు?
  - నీడ

## రంగులేయండి



చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.

## చెప్పుకోండి

# కనకక్క తెలివి

**నూనూగు** మీసాలు వచ్చిన కొడుక్కి పెళ్లి చేయాలని అనుకుంది కనకక్క. పొరుగూర్లో పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలు దండిగా ఉన్నారని తెలుసుకుని.. పట్టుచీర కట్టుకుని బయలుదేరింది. ఊరంతా తిరిగాక ఒక ఇంట్లోని సంబంధం నచ్చింది. వారికి కవల పిల్లలు– ఇద్దరూ ఆడపిల్లలే! ఎటు చూసినా ఇద్దరూ నచ్చారు కనకక్కకి. 'ఎలా చేద్దామబ్బా!?' అని ఆలోచించి ఓ నిర్ణయం తీసుకుంది. ఒక పళ్లెంలో కత్తెర, సూది పట్టుకురమ్మని ఒక అమ్మాయికి చెప్పింది. మెత్తటి అడుగులు వేసుకుంటూ ముందరికి వచ్చిన ఆ అమ్మాయితో.. ''నీకు సూది ఇష్టమా? కత్తెర ఇష్టమా?'' అని అడిగింది. ''కత్తెర అంటే ఇష్టం. ఎందుకంటే ఎక్కడివక్కడ కత్తిరించి పారేయవచ్చు'' అని చెప్పింది ఆ అమ్మాయి. మరో అమ్మాయిని కూడా పళ్లెం తీసుకొని రమ్మంది కనకక్క. ఆ తెచ్చిన అమ్మాయితో.. ''ఈ రెండిటిలో ఏదంటే నీకిష్టం?'' అని అడిగింది. ''సూదంటే ఇష్టం. ఎందుకంటే విడిపోయిన వాటిని కలుపుతుంది కదా!?'' అని బదులిచ్చింది. 'మొదటి పిల్ల మనుషుల్ని విడదీస్తుంది. రెండోపిల్ల మనుషుల్ని రాబట్టుకుంటుంది' అనుకుని.. రెండో అమ్మాయిని ఖాయం చేసుకున్నది కనకక్క.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు



## పెద్దల మాట



ఏ విషయం గురించైనా సరే.. కేవలం తెలుసుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. కోరుకున్నది సాధించాలంటే.. నిరంతరం ప్రయత్నించాల్సిందే!

- మహాత్మా గాంధీ.

## టంగ్ ట్విస్టర్స్



Annie
ate eight
Arctic
apples

## పూరించండి



c_k_



ch_co_ate

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.

## పద్యం - భావం

**వాన కురియకున్న వచ్చును క్షామంబు**
**వాన గురిసెనేని వరద పాఱు**
**వరద కఱవు రెండు వరుసతో నెఱుగుడి**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం:** వర్షాలు లేకపోతే ఆ దేశాన్ని కరువు కాటకాలు పీడిస్తాయి. వర్షాలు ఉన్నట్లయితే.. వరదలు ముంచేస్తాయి. అంటే.. ప్రకృతిలో ఈ రెండూ వెంట వెంట రావడం సహజమే!

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# నెమలీక

## మనమంతా ఒక్కటే

- కూచిమంచి నాగేంద్ర, 9182127880



యమునా నదీ తీరంలో వున్నా ఓ చిన్న వనం అది. అక్కడ పెద్ద పెద్ద చెట్లుతో పాటు దానిమ్మ, బత్తాయి, నారింజ, జామ లాంటి మొక్కలు వున్నాయి. అప్పుడే సాయం సంధ్యా సమయం అవుతోంది. పక్షులు ఒక్కొక్కటిగా గూటికి చేరుకుంటున్నాయి. మందారం అనే పిచ్చుక చెదిరిన తన గూడు సరి చేసుకుంటోంది.

పక్కనే కొమ్మ మీద వున్న కాకి "ఓ మందారం ఎప్పుడు ఏదో పనేనా ఒక్కసారైనా మాతో మాట్లాడేది ఉందా!" అంది.

"ఎందుకు మాట్లాడను చీకటి పడుతోంది అని గూడు బాగు చేసుకుంటున్నా!" అంది.


"ఆ పొట్టి ముక్కుతో ఏం పనిచేస్తావులే" అంది కాకి వెటకారంగా.

ఆ పక్క నున్న ముసలి గద్ద "కాకమ్మా ఎవరి అవసరాన్ని బట్టి ఈ సృష్టిలో శరీరాలు ఏర్పడ్డాయి. మందారం చిన్నది కనుక దాని ముక్కు కూడా చిన్నదే. అదే ఆ కొంగని చూడు చేపలు పట్టేందుకు వీలుగా పొడవైన మెడ అలాగే పొడవైన ముక్కు. ఇక ఈ చిలుకమ్మ కాయలు పండ్లు కోరికేందుకు వీలుగా దాని ముక్కు వంకరగా కొనదేరి వుంటుంది" అంది.

"ఏమిటీ ముక్కుల గోల" అంటూ కాకి వంక చూసిన వడ్రంగి పిట్ట.. అదా సంగతి, కాకమ్మ ముక్కుకి ముక్కెర పెట్టింది. అందుకే ముక్కు గురించి మాట్లాడడం మొదలు పెట్టింది" అంది.

అన్ని పక్షులు కాకి వంక చూసాయి. కాకి మరింత వయ్యారం పోతూ ముక్కు అటు ఇటు తిప్పింది. ఆ హడావిడిలో దాని ముక్కెర కిందనున్న పుల్లల మద్యన పడి పోయింది. అయ్యో అని కాకి బాధ పడడం చూసి, మందారం ఆ పుల్లల మద్యన దూరి ఆ ముక్కెర తెచ్చి ఇచ్చింది. నిన్ను అనవసరంగా మాటలన్నాను, నన్ను క్షమించు మందారం. నేనైతే ఆ పుల్లల మద్యన దూరలేను" అంది కాకి.

"ఒకరికి ఒకరు సహాయం చేసుకోవడంలో మనమంతా ఒకటే" అంది ముసలి గద్ద. అన్నీ సంతోషించాయి.



### తేడాలు

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో కొన్ని తేడాలున్నాయి. అవి ఏంటో, ఎక్కడున్నాయో కనిపెట్టండి.



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# రాజుగారి పొగడ్త

బాల కథ

నరెద్దుల రాజారెడ్డి
9666016636

కళింగ రాజ్యాన్ని వీరసేన అనే మహారాజు పరిపాలించేవాడు. తనకు పొగడ్త అంటే చాలా ఇష్టం. అలా తనను పొగిడేవారికి తగినంత ధన సహాయం చేసి పంపేవాడు. శిక్షలు తగ్గించేవాడు. ఒకసారి రాజ్యంలో దొంగతనం చేస్తూ ఇద్దరు దొంగలు దొరికారు వారిని మహారాజు ముందు నిలబెట్టారు. వీళ్ళకు వంద కొరడా దెబ్బలు కొట్టమని రాజు ఆదేశించాడు. ఆ ఇద్దరి దొంగల ముఖాల్లో ఆందోళన భయం అస్సలు కనపడలేదు. రాజుకు ఆశ్చర్యం వేసింది 'నేను ఇంత పెద్ద శిక్ష వేసినా కూడా మీ ముఖాల్లో భయం కనపడలేదు కారణం తెలుసుకోవచ్చా' అనడిగాడు మహారాజు.

'మహారాజా! మీరు మహా సంపన్నులు పైగా అమోఘమైన పేరు ప్రఖ్యాతులు గలవారు. అన్ని రాజ్యాల రాజులకంటే మహా తెలివిగలవారు. మీలాంటి గొప్ప రాజు పాలిస్తున్నటువంటి ఈ రాజ్యంలో పుట్టడం మేం చేసుకున్న అదృష్టం మీ చేతుల మీదుగా వేసే ఎటువంటి శిక్షనైనా మేం ఆనందంగా స్వీకరిస్తాం మహాప్రభో ' అన్నాడు అందులో ఒకడు.


ఈ ప్రశంసకు మహారాజు ముగ్ధుడై 'మహా మంత్రి..! వీళ్ళకు కొరడా దెబ్బలు కాకుండా మంచి ప్రవర్తన కలిగేలా హితవు నేర్పి సాగనంపండి' అంటూ రాజు వారికి శిక్ష లేకుండా చేయగానే దొంగలు ఆనందించారు 'మీరు పొగడ్తలకు పొంగిపోతూ కొన్ని పొరబాట్లు చేస్తున్నట్టు అనిపిస్తోంది, వాళ్ల మాటలకు వినే దొంగలు కాదు ఆలోచించండి' అంటూ జాగ్రత్త పరిచింది మహారాణి.

'ఎవర్ని ఎలా శిక్షించాలో ఎలా పరీక్షించాలో నాకు బాగా తెలుసు. మీరు మందిరానికి వెళ్లి విశ్రాంతి తీసుకోండి' అని కోపగించుకున్నాడు మహారాజు. మహారాణి మందిరానికి వెళ్ళింది.

• • •

ఒకసారి రాజ్యాన్ని పరిశీలించడానికి మంత్రిని వెంటబెట్టుకొని వెళ్లాడు మహారాజు. రాజును చూడగానే ప్రజలందరూ నమస్కరించడం కాళ్లకు దండం పెట్టడం చేశారు " మహారాజుకు జై జై " అంటూ స్వాగతం పలికారు. వీరసేన మహారాజు పొంగిపోయాడు. 'ప్రజలకు నాపైగల అభిమానం చెప్పలేనంతగా ఉంది. వారి ప్రశంసలకు నా ఆనందానికి అవధుల్లేకుండా పోయింది' అంటూ మహారాజు సంతోషపడ్డాడు. వెంటనే మంత్రిని పురమాయించి 'రాజ్యంలో ప్రతి ఇంటికి వెళ్ళి చేతికి కొంత ధనంతో పాటు ఒక బంగారు ఆభరణం కూడా ఇచ్చిరండి' అని చెప్పి పంపుతాడు.

మహారాజు చెప్పినట్టుగా చేసి తిరిగి రాజమందిరానికి చేరుకున్నాడు మంత్రి. 'ప్రభు మనం ఇచ్చిన కానుకలు అందరూ స్వీకరించారు కానీ ఒక్కడు మాత్రం తిరస్కరించాడు' అని చెప్పాడు మంత్రి



'వెంటనే అతన్ని ప్రవేశపెట్టండి' అని కోపంతో అన్నాడు మహారాజు. సైనుకులు వెంటనే అతన్ని ప్రవేశపెట్టారు.

'నీ పేరేమి?' అని అడిగాడు మహారాజు. 'నా పేరు పాపన్న..' అన్నాడు. అతను 'ఈ మహారాజు పంపిన కానుకనే తిరస్కరిస్తావా? ఎంత ధైర్యం నీకు?' అని గర్జించినట్టు అడిగాడు మహారాజు. 'నేను నా కష్టార్జితాన్ని నమ్ముకుంటాను. కష్టపడకుండా వచ్చిన దాన్ని అనుభవించాలని అనుకోను. నన్ను క్షమించండి మహారాజా' అన్నాడు పాపన్న.

చిరుమువ్వలు

'ఎంత కండకావరం ఇతనికి!. వంద కొరడా దెబ్బలు కొట్టి, కానుకలు ఇచ్చి పంపండి ససేమిరా అంటే కారాగారంలో బంధించండి' అని కోపంగా ఆదేశించాడు మహారాజు. రాజు చెప్పినట్టే కొన్ని రూకలు ఇచ్చి పంపాడు మంత్రి.

• • •

కొద్దిరోజులు గడిచాయి. వేటకు అడవికి వెళ్లాలని మహారాజు నిర్ణయించుకున్నాడు. సైన్యాన్ని వెంటబెట్టుకొని బయలుదేరాడు. 'మహారాజా మీరు చాలా ధైర్యవంతులు తెలివిగలవాళ్ళు వేటాడటంలో నైపుణ్యం గల వాళ్లు కాబట్టి మేము అందరం కోన దిక్కుకు వెళతాం మీరు చిట్టడివికి వెళ్ళండి కచ్చితంగా జయించగలరు' అని సైన్యాధికారి చెప్పగానే మహారాజు పొంగిపోయాడు, అలాగేనంటూ బయలుదేరాడు. సైన్యం ఒకపక్క, రాజు మరోపక్క వెళ్లారు. మధ్యాహ్నం దాటిపోయింది. ఎండ వేడిమి ఎక్కువైంది. కనుచూపుమేరా ఎక్కడ నీటి జాడ కనిపించలేదు. మహారాజుకు గొంతు తడి ఆరిపోయింది. ఆ సమీపంలో సైన్యం కోసం ఎదురుచూశాడు. ఎక్కడా కనిపించలేదు. మహారాజులో భయం మొదలైంది. ప్రాణభయం పట్టుకుంది. కొద్ది దూరం వెళ్ళాడు. ఓపిక నశించింది. నీరసంతో అక్కడే కూలబడ్డాడు.

సమీపంలో కట్టు కొడుతున్న పాపన్న మహారాజును గుర్తించి తన భుజాలపై మోసుకుని వైద్యుని దగ్గరకు చేర్చాడు. కాసేపటికి మెళుకువ వచ్చిన మహారాజు 'నన్ను వైద్యుని దగ్గరకు చేర్చిన ఆ ధర్మాత్ముడు ఎవరు?' అని అడగ్గానే పాపన్నను చూపించారు మంత్రి. 'నన్ను క్షమించు పాపన్న నువ్వింత మంచివాడవని నిజాయితీ పరుడని గ్రహించక శిక్ష విధించాను. అవమానపరిచాను. నన్ను క్షమించు' అన్నాడు మహారాజు.. ఆ మాటకు పాపన్న గట్టిగా నవ్వి 'మహారాజా.. ఒక మనిషిని ప్రశంసించడం అనేది అంత సులువు కాదు. దాని వెనుక ఒక గొప్ప పని వుండాలి. లేదా గొప్ప సహాయత వుండాలి. కీర్తి ప్రతిష్ఠలు కావాలి. కానీ మీరు కేవలం పొగడ్తకే పొంగిపోయి ధనం మొత్తం దానం చేసారు. మీరు ప్రాణాపాయ స్థితిలో వున్నప్పుడు నిన్ను చూడ్డానికి ఒక్కరూ కూడా రాలేదు. మీ బలహీనతను సొమ్ము చేసుకున్నారు. అది మీరు గ్రహించలేకపోయారు. పొగడ్తలకు పొంగిపోకూడదు. ఎద్దేవాలకు తల వంచకూడదు' అని అన్నాడు పాపన్న.

'నా కళ్ళు తెరిపించావు పాపన్న బాగా బుద్ధి వచ్చింది' అంటూ పశ్చాత్తాపం చెందాడు మహారాజు. పాపన్న సహాయానికి మనస్ఫూర్తిగా అభినందించాడు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# బుడత



## బాలల కథ

### చలి - పులి



నల్లమల అడవుల్లోని పులి రాజుకు ఈమధ్య రాత్రి అయ్యిందంటే భయంతో వణుకు పుడుతుంది. కారణం శీతాకాలంలో పుట్టే చలిని తట్టుకోవడం తన వల్ల కావడం లేదు. ఆ విషయం అన్ని జంతువులకు తెలిసింది. 'వృద్ధాప్యం దగ్గర పడుతుండడం వల్ల శరీరం భరించలేకపోతుండవచ్చు' అని కొన్ని జంతువులు అన్నాయి. మరికొన్ని జంతువులేమో 'ప్రకృతి మనకు అన్నింటిని తట్టుకునే శక్తి ఇచ్చింది కదా! ఎందుకు భయపడుతుందో!' అని వ్యంగ్యం చేశాయి.

మంత్రి నక్క "పులి రాజు గారికి చలి బాధ నుండి బయటపడే ఉపాయం చెప్పిన వారికి మంచి బహుమతి ఇస్తామని" ప్రకటన చేసింది.

ఆ ప్రకటన విన్న జంతువులు ఒక్కొక్కటి వచ్చి తమ ఉపాయాన్ని తెలియజేశాయి. మొదట తమ దగ్గరలో పుట్టను పెట్టుకున్న చీమలు వచ్చి "మాకు లాగా మీరు కూడా ఒక పుట్టను నిర్మించుకోండి" అని సలహా ఇచ్చాయి.

తన వల్ల కాదని తిరస్కరించింది. మరికొద్ది సేపటికి గబ్బిలం వచ్చి "మేము కొండ గుహల్లో తల దాచుకుంటాము అక్కడ చలివేయదు. మా గుహలోకి రండి" ఆహ్వానించింది. ఇదేదో బాగుందని పరిశీలనకు వెళ్ళింది పులి. అక్కడ వెచ్చగా ఉంది. కానీ భరించలేని కంపు వాసన మరియు కటిక చీకటి ఉంది. ఉండలేక బయటకు వచ్చేసింది. కొద్దిసేపటికి పిచ్చుక వచ్చి "మేము కట్టుకున్నట్లు ఒక గూడు కట్టుకోండి వెచ్చగా ఉంటుంది" అని చెప్పింది. నిజమే ఈ ఉపాయం బాగుంది. అని నిర్మించుకోవడానికి ప్రయత్నించింది. కానీ తన వల్ల కాలేదు పులికి. పిచ్చుకనే నిర్మించమని కోరగా మీరు పట్టేంత పెద్దగా తయారు చేయడం నా వల్ల కాదంది పిచ్చుక. మరికొద్ది సేపటికి తాబేలు వచ్చింది. "పైకి నీరు చల్లగా ఉన్నా లోపల వెచ్చగా ఉంటుంది. నీటిలో చలి వేయదు. నీటిలో ఉండండి" అని సలహా ఇచ్చింది. 'ఎంతసేపని నీటిలో ఉండాలి. బయటకు వస్తే అంతకంటే చలి ఎక్కువ పుడుతుంది. అది సాధ్యం కాదు' అని దాన్నీ తిరస్కరించింది పులి.

మరుసటి రోజు చిరుత ఏదో కనుక్కున్న దానిలా వెలిగిపోతున్న మొహంతో వచ్చింది. "మనుషులు చెట్లు నరకడం వల్ల అడవి తరిగిపోయింది.ఇక్కడ ఆహారం దొరకక అడవి బయటకు వెళ్లాను. అక్కడ ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు ఇలా చాలా జంతువులు ఉన్నాయి. ఒక మేక పిల్లను తిని బుక్తాయాసం వచ్చి పక్కనే మెత్తగా వరిగడ్డి వాము కనిపించగా. అక్కడే పడుకున్నాను. అసలు చలే కనిపించలేదనుకో" అని ఉత్సాహంగా చెప్పింది చిరుత. "అయితే అక్కడ చలివేయదా? వెళదాం పద" అంది పులి. "వద్దు రాజా అక్కడ మనుషులు ఉన్నారు. నన్ను చూసి తరిమి తరిమి కొట్టారు. మనల్ని చంపేస్తారు" అంది చిరుత. "మరి ఎలా" అసహనంగా అంది పులి. "వరి గడ్డి తెచ్చుకుంటే సరిపోతుంది" అంది చిరుత. మంత్రి నక్కను వరి గడ్డి తెప్పించే పని చూడమని ఆదేశించింది పులి.

'ఇదేం కర్మరా బాబు' అనుకొని గడ్డివామును చూపించమని చిరుతను కోరింది నక్క. మరికొన్ని జంతువులను వెంటపెట్టుకొని బయలుదేరింది.


వెళుతూ వెళుతూ ఉండగా రాత్రి అయ్యింది. వాటికి మనుషుల మాటలు వినిపించాయి. "లిసంక్రాంతికి చలి సంకలు ఎత్తనివ్వడంలి లేదురా ఆ కంబళి అందుకో కప్పుకుందాం" అని గొర్రెల కాపరుల మాటలు వినిపించాయి. మంత్రి నక్క ఆలోచనలో పడింది. వరిగడ్డి కంటే కూడా కంబళిని తీసుకెళ్తే బాగుంటుంది కదా! అనుకుంది. అదే విషయాన్ని చిరుతకు చెప్పింది. కంబళి ఎలా ఉంటుందో ఎంత ఉంటుందో తెలియదు. దాన్ని చూడలేదు. మనం ఉదయం వరకు ఉండి,చూసి దాన్ని ఎత్తుకెళ్దామనుకున్నాయి.


తెల్లవారింది. ఒక్కసారిగా జంతువులు కంబళి కోసం మనుషుల మీదకు ఉరికాయి. మనుషులు భయపడిపోయారు గొర్రెల కోసం వచ్చాయనుకున్నారు. మడిచిన కంబళిని లాఘవంగా నోట కరుచుకుంది చిరుత. రెండు నక్కలేమో మరో కంబళిని ఈడ్చుకుంటూ అక్కడ నుంచి పరుగుపెట్టాయి. మనుషులు,కుక్కలు తరుముతుండగా.

చిరుత కంబళిని తీసుకొచ్చింది. నక్కలు మాత్రం తీసుకు రాలేకపోయాయి. మధ్యలో చెట్లకు తగులుకుంది కంబళి. చిరుతను బహుమతి వరించింది. చలికి పులి కంబళి కప్పుకుంది.


**ఆవుల చక్రపాణి యాదవ్ 9963350973**




ఎలుకతోలుఁదెచ్చి యేడాది యుతికిన
నలుపు నలుపేగాని తెలుపురాదు
కొయ్యబొమ్మను దెచ్చి కొట్టినఁ బలుకునా
విశ్వదాభిరామ! వినుర వేమ!



కథ

# జ్యేష్ఠపాలు

రాజయ్య మధ్య తరగతి రైతు. కష్టపడి పని చేస్తూ, పైసా పైసా కూడబెట్టి తొమ్మిది ఎకరాల పొలం సంపాదించాడు.

అతనికి నలుగురు కొడుకులు ఉన్నారు. అందరికంటే ముందు జన్మించి, తనతో పాటు పొలం పనులు చేస్తూ, కుటుంబ ఉన్నతికి శ్రమించాడని పెద్ద కొడుకు భూపతికి మూడు ఎకరాలు ఇచ్చి, మిగతా ముగ్గురు కొడుకులకు తలా రెండు ఎకరాలు ఇచ్చి అస్థి పంపకాలు చేసాడు.

భూపతికి జ్యేష్ఠ పాలుగా వచ్చిన ఎకరం పొలం తీసుకోవడానికి భూపతి ముందు నిరాకరించినా, తండ్రి మాట కాదనలేక తీసుకున్నాడు.



మిగతా వారు కూడా తండ్రి మాటకు విలువ ఇచ్చి, అన్న శ్రమకు ప్రతిఫలంగా భావించి అంగీకరించారు.

ఈ విధంగా కొన్ని సంవత్సరాలు గడిచాయి. వృద్ధాప్యంతో రాజయ్య చనిపోయాడు. భూపతికి ఇచ్చిన ఎకరం పొలంపై తమ్ముళ్లకు దురాశ కలిగింది. ఒక రోజు ముగ్గురు తమ్ముళ్ళు ఎకరం పొలాన్ని ఆక్రమించారు. తండ్రి తమ కన్నా అన్నకు అదనంగా ఇచ్చిన పొలం కోసం భూపతికి, తమ్ముళ్ళ మధ్య గొడవ పెద్దదై పంచాయితీకి చేరింది.

మర్యాద రామన్నలు పొలం భూపతికే చెందుతుందని తీర్పు చెప్పారు. ఇది తమ్ముళ్లకు నచ్చలేదు. అన్నను పొలం నుండి తరిమేయాలని కుట్రలు పన్నారు.

కాలువకు గండి కొట్టి పొలాన్ని నీట ముంచారు. మరోసారి చేతికి అందిన పంటను కాల్చి బూడిద చేసారు. మరోసారి వ్యవసాయ పనిముట్లు ఎత్తుకెళ్లారు. పొలంలో పెంచిన చెట్లను నరికి వేసారు.

తమ్ముళ్ళు ఎన్ని ఇబ్బందులు పెట్టినా భూపతి ఓర్పుతో తన పని తాను చేసుకుంటున్నాడు. తనకు ఎంత నష్టం జరిగినా తమ్ముళ్ళను ఏమి అనలేదు.

భూపతికి ద్రోహం చేయాలనే దుర్బుద్ధి గల తమ్ముళ్ళు రోజు రోజుకు ఆర్థికంగా నష్టపోయారు. అందరూ మనవారే అని నమ్మకంతో కష్టాలను సహనంతో భరించిన భూపతి ఆర్థికంగా ఎదిగాడు. మరో రెండు ఎకరాల పొలం సంపాదించాడు. ఎంత నష్టపరిచినా అన్న ఎదుగుదల తమ్ముళ్ళను ఆశ్చర్యపరిచింది. అన్న మంచితనమే అతన్ని కాపాడుతుందని తెలుసుకుని, ఎకరం పొలంపై ఉన్న దురాశను వదిలిపెట్టారు.

తమ్ముళ్లలో మార్పు రాగానే భూపతి ఆ పొలాన్ని తమ్ముళ్లకు ఇచ్చి "శ్రమకు ప్రతిఫలంగా నాన్న ఇచ్చిన పొలాన్ని నేను మీకు ఉచితంగా ఇస్తున్నాను. ఇకనైనా కష్టపడి సంపాదించుకోండి" అని బుద్ధి చెప్పాడు.

– దుర్గం భైతి

– మంచి మాటలే గొప్ప అలంకారం. ఆభరణలన్నీ నశిస్తాయి గానీ వాక్కు అనే ఆభరణం ఎప్పటికీ నశించదు.

– నాలుక మనం చెప్పినట్టు వినకపోవటమే అన్ని అనర్థాలకు మూలం.